జగన్ పాలనలో చేసిన నిర్లక్ష్యం పేదల గృహాలకు శాపంగా మారింది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టిడ్కో ఇళ్లను వైసీపీ సర్కారు కావాలనే పాడుబెట్టింది. పేదల సొంతింటి కలను చెరిపేసింది. నవరత్నాలంటూ అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసిన వైసీపీ ప్రభుత్వం జీప్లస్‌త్రీ భవనాలను చూసి ఓర్చుకోలేకపోయింది. అధికారంలోకి వచ్చే సమయానికి 60శాతం పనులు పూర్తయినా పట్టించుకోకపోగా, పైసా నిధులు విడుదల చేయలేదు. దానికితోడు లబ్ధిదారుల పేరుతో బ్యాంకుల్లో రుణాలు తీసుకుని నవరత్నాలకు మళ్లించి ఘోరంగా మోసం చేసింది. దీంతో పట్టణ పేదల ఇళ్లు పాడుబడిపోయాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అర్హుల్లో ఆశలు మొదలయ్యాయి. వాటి నిర్మాణం పూర్తికి అవసరమైన నిధుల కోసం సర్కారు ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది.

- జగన్ పాలనలో అంతా నిర్లక్ష్యమే
- పేదల సొంతింటి కల సాకారానికి టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్లు
- వైసీపీ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యం
- నేడు అడవిని తలపిస్తూ సాలెగూళ్లుగా మారిన గృహాలు
- 60శాతం పనులతో అసంపూర్తిగా మిగిలిన నిర్మాణాలు
- పూర్తిచేయడానికి రూ.342.29 కోట్లు అవసరం
- కూటమి ప్రభుత్వంపై అర్హుల్లో ఆశలు


ఒంగోలు సమీపంలోని చింతలవద్ద కాలు పెట్టేందుకు కూడా వీలులేకుండా ఉన్న టిడ్కో ఇళ్ల సముదాయం
టిడ్కో ఇంట్లో మొలిచిన పిచ్చి మొక్కలు
దెబ్బతిన్న టిడ్కో ఇంటి ఫ్లోరింగ్

పేదల ఇళ్లు పాడుబెట్టారు!

రూ.342.29 కోట్లు అవసరం

వైసీపీ నిర్లక్ష్యం కారణంగా ఐదేళ్లపాటు ఎలాంటి పనులు చేపట్టకపోవడంతో టిడ్కో ఇళ్లు సాలెగూళ్లుగా మారాయి. వాటిని పూర్తి చేసి, లబ్ధిదారులకు అందించేందుకు ఆరు నుంచి 8 నెలల వరకు సమయం పట్టనుంది. అందుకోసం ఒంగోలులోని చింతల వద్ద గృహాలకు రూ.53.44 కోట్లు, కొప్పోలు వద్ద ఇళ్లకు రూ.127.07 కోట్లు, మార్కాపురంలో రూ.40.47 కోట్లు, గిద్దలూరులో రూ.70.76, కనిగిరిలో రూ.50.55కోట్లు వెరసి మొత్తం రూ.342.29 కోట్లు అవసరం ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు.

ఒంగోలు, కార్పొరేషన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదల సొంతింటి కల నెరవేరడానికి నిధుల సమస్య ఎదురైంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పేదల ఇళ్లను పాడుబెట్టారు. పైసా ఖర్చుచేయకుండా, లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారు. పట్టణ పేదల కోసం పక్కా ఇళ్లు నిర్మించి, పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు గత తెలుగుదేశం ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. జిల్లాలోని ఒంగోలు, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరిలో జీప్లస్‌త్రీ నిర్మాణాలను చేపట్టి అర్హులైన వారికి ఇంటి పత్రాలు మంజూరు చేసింది. 60శాతం పనులు పూర్తిచేసింది. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో అంతా తారుమారైంది. గత ఐదేళ్లలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం పేదల ఇళ్లపై సీతకన్ను వేసింది. కనీస నిధులు కేటాయించకపోవడంతోపాటు, పనుల గురించి పట్టించుకోకపోవడంతో పట్టణ పేదల్లో ఇంటి బెంగ ఏర్పడింది. పైగా లబ్ధిదారుల పేరుతో బ్యాంకుల్లో రుణాలు తీసుకుని వాటిని నవరత్నాలకు మళ్లించడంతో వారు గగ్గోలు పెట్టారు. ప్రస్తుతం సొంతింటి గృహప్రవేశం చేసే పరిస్థితి లేకపోగా, ఇంటిపై పొందిన రుణంతో వారిలో ఆందోళన మొదలైంది. నెలనెలా రుణం వాయిదా చెల్లించాలని బ్యాంకర్లు ఒత్తిడి చేస్తుండటంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టిడ్కో ఇళ్లపై మరోసారి ఆశలు పెంచుకున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 7,200 మందికి ఇళ్ల కేటాయింపులు జరిగాయి. దాదాపు ఐదేళ్లపాటు నిలిచిపోయిన పనులు పూర్తిచేయడానికి రూ.342.29 కోట్ల అవసరం

మిగతా 6వ పేజీలో

3న గృహప్రవేశాలు

- జిల్లాలో 2,750 ఇళ్లు సిద్ధం
- ఏర్పాట్లలో హౌసింగ్ అధికారులు
- ఎక్కడికక్కడ హాజరుకానున్న ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు



ఒంగోలు నగరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మాణాలు ప్రారంభించి పూర్తిచేసిన పక్కా గృహాల్లో ప్రవేశాలకు ముహూర్తం ఖరారైంది. జనవరి 3వతేదీన రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి లక్ష ఇళ్లల్లో ప్రవేశాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం జిల్లాలో 2,750 ఇళ్లను అధికారులు సిద్ధం చేశారు. కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఆరు నెలల్లో గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. గతంలో మంజూరైన పక్కాగృహాల నిర్మాణాలను కూడా వేగంగా చేపట్టే దిశగా చర్యలు తీసుకుంది. ప్రస్తుతం జిల్లాలో 17,170 గృహాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉండగా 2,750 పూర్తయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా వచ్చేనెల 3న చేపట్టే కార్యక్రమంలో ఆయా గృహాల్లో ప్రవేశాలు జరిపించి ఇంటి తాళాలను లబ్ధిదారులకు అప్పగించనున్నారు. ప్రతి నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా నియోజకవర్గాల శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు ఎక్కువ సంఖ్యలో పాల్గొననున్నారు.



నందనవనం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి స్వామి, వేదికపై కలెక్టర్ అన్సారియా, ఆర్డీవో లక్ష్మీప్రసన్న

వైసీపీ కబ్జా చేసిన భూములకు విముక్తి

- బాధితులందరికీ న్యాయం చేస్తాం
- గత ప్రభుత్వంలో అడ్డగోలుగా ఆక్రమణలు
- రికార్డులు సైతం మార్పు
- వాటిని సరిదిద్దేందుకే రెవెన్యూ సదస్సులు
- నందనవనంలో మంత్రి డాక్టర్ స్వామి

జరుగుమల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో ఆపార్టీ నేతల నిర్వాకంతో భూములు కోల్పోయిన వారికి అన్ని విధాలా న్యాయం చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. కబ్జాదారుల కబంధ హస్తాల నుంచి వాటిని విడిపించి అసలు యజమానులకు అప్పగిస్తామన్నారు. శనివారం మండలంలోని నందనవనంలో జరిగిన రెవెన్యూ గ్రామసభలో మంత్రి

మిగతా 6వ పేజీలో


దేవదాయ శాఖ మంత్రి ఆనంను కలిసి సమస్యను వివరిస్తున్న బసవన్నపాలెం గ్రామస్థులు

దివ్యాంగుల శాఖలో అక్రమాలు

- ఉద్యోగాల నియామకాలతోపాటు రుణాల మంజూరులో అవకతవకలు
- విచారణాధికారి ఎదుట ఏకరువు పెట్టిన దివ్యాంగులు


దివ్యాంగులను విచారిస్తున్న డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమ శాఖలో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. శాఖ ద్వారా భర్తీచేసిన నాల్గో తరగతి ఉద్యోగాల్లో పలు అవకతవకలు చోటుచేసుకున్నాయని ఇటీవల దివ్యాంగులు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆమె.. సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాలని డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావును ఆదేశించారు. దీంతో ఆయన రంగంలోకి దిగారు. ఈనేపథ్యంలో దివ్యాంగుల

మిగతా 6వ పేజీలో

నితీష్ మనోడే..

- అమ్మగారి ఊరు చెరువుకొమ్ముపాలెం
- ఆస్ట్రేలియాతో టెస్ట్ మ్యాచ్‌లో సెంచరీతో చెలరేగిన తెలుగు కుర్రోడు

7



దేవదాయశాఖ పేరుతో రైతులతో చెలగాటం

- పూర్వీకుల నుంచి సాగులో ఉన్న భూములను ఆన్‌లైన్ చేయకుండా వేధింపులు
- కోర్టు తీర్పులు వచ్చినా పట్టించుకోని అధికారులు
- రెవెన్యూ సదస్సుల్లో రైతుల గగ్గోలు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ పేరుతో అధికారులు రైతులతో చెలగాటమాడుతున్నారు. పూర్వీకుల నుంచి సంక్రమించిన భూముల విషయంలో రెవెన్యూ అధికారులు వేధింపులకు పాల్పడుతున్నారు. ఆన్‌లైన్ చేయకుండా దాటవేస్తుండటంతో అర్హులైన రైతులు ప్రభుత్వ పథకాలను కూడా కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. భూ సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో రైతులు ఇవే సమస్యలపై గగ్గోలుపెడుతున్నారు. మద్దిపాడు మండలం

మిగతా 6వ పేజీలో


తన భర్త ఆచూకీ పోలీసులు గుర్తించి తీసుకువచ్చినందుకు ఎస్పీకి కృతజ్ఞతలు తెలుపుతున్న పుల్లిపాడుకు చెందిన కవిత

శభాష్ పోలీస్

- అదృశ్యమైన వారు కుటుంబాల చెంతకు
- ఆరు నెలల్లో 367 కేసుల ఛేదన
- ఎస్పీకి బాధిత కుటుంబాల కృతజ్ఞతలు

7

వైసీపీ కబ్జా చేసిన భూములకు విముక్తి

(5వ పేజీ తరువాయి)

పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజా సమస్యలపై గ్రీవెన్స్ నిర్వహిస్తే అందులో వచ్చిన 60శాతం అర్జీలు భూ సంబంధమైనవేనన్నారు. వాటిలో వైసీపీ హయాంలో జరిగిన భూదారుణాలు అధికంగా ఉన్నాన్నారు. ఆపార్టీ నాయకులు అనేక మంది నుంచి బలవంతంగా భూములు లాక్కొన్నారని, రికార్డులను సైతం ఇష్టానుసారం మార్పించారని మంత్రి విమర్శించారు. బాధితులకు న్యాయం చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. అందుకోసమే రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎవరికి భూ సమస్య ఉన్నా నిర్భయంగా అధికారులకు తెలియజేయాలని సూచించారు. గ్రామస్థులు సభ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను నిర్ణీత సమయంలో అధికారులు పరిష్కరించాలన్నారు. పలు గ్రామాల్లో గర్భకంద్రికలు, ఎర్ర కంద్రిగలు రైతుల అనుభవంలో ఉన్నా పాస్ పుస్తకాలు లేక ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి మంత్రి స్వామి తెచ్చారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. నూతన సంవత్సరం రోజున ఉద్యోగులకు పని ఒత్తిడి ఉండకూడదన్న ఉద్దేశంతో ముందురోజు ఈనెల 31నే పింఛన్‌ల పంపిణీకి ముఖ్యమంత్రి ఆదేశించారు. వైసీపీ హయాంలో విచ్చలవిడిగా విద్యుత్ చార్జీలు పెంచి ఇప్పుడు తగ్గించాలని ఆ పార్టీ నేతలు ధర్నాలు చేయడం 'దొంగే.. దొంగ' అన్నట్లు ఉన్నదని మంత్రి ఎద్దేవా చేశారు. స్థానికులు సభ దృష్టికి తెచ్చిన పలు సమస్యల పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారు. ఉపాధి పథకం నిధులతో పొలాలకు వెళ్లే డొంకరోడ్లను మార్చి నుంచి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. నందనవనం నుంచి మండల కేంద్రమైన జరుగుమల్లికి దగ్గరి దారి కల్పించాలని ప్రజలు కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ పాలేరుపై మల్టీలెవల్ చెక్‌డ్యాం ను నిర్మించేందుకు కృషి చేస్తానని చెప్పారు. సభలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ జనార్దన్, టీడీపీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల శాఖలో అక్రమాలు

(5వ పేజీ తరువాయి)

నుంచి అనేక ఫిర్యాదులు అందుతున్నాయి. ఉద్యోగ నియామకాలతోపాటు కేంద్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం ఇచ్చే రుణాల్లో కూడా అక్రమాలు చోటుచేసుకున్నాయని విచారణాధికారికి కొందరు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దివ్యాంగుల సంక్షేమం కోసం 90శాతం కేంద్రప్రభుత్వం సబ్సిడీ ఇస్తుండగా ఐదు శాతం రాష్ట్ర ప్రభుత్వం, మరో ఐదు శాతం లబ్ధిదారుడు వాటా చెల్లించాల్సి ఉంది. అయితే ఈ రుణాల మంజూరులో కూడా పలు అక్రమాలు చోటు చేసుకున్నాయని శనివారం జరిగిన విచారణలో పలువురు దివ్యాంగులు.. లోకేశ్వరరావు ఎదుట ఏకరువు పెట్టారు. గత వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి ఆర్థిక చేయూతను ఇచ్చే పథకాల అమలులో కూడా తమకు అన్యాయం జరిగిందని వారు వాపోయినట్లు తెలిపింది. దీంతో విచారణాధికారి లోకేశ్వరరావు ఆయా అంశాలపై దృష్టిపెట్టి కొంత సమాచారాన్ని సేకరించినట్లు తెలుస్తోంది.

పేదల ఇళ్లు పాడుబెట్టారు!

(5వ పేజీ తరువాయి)

ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. జిల్లాలో మొత్తం 7,200 మంది టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు ఉన్నారు. అందులో 300 ఎస్ఎఫ్‌టీ లబ్ధిదారులు 4,800 మంది, 365 ఎస్ఎఫ్‌టీ లబ్ధిదారులు 1,296, 400 ఎస్ఎఫ్‌టీ లబ్ధిదారులు 1,104 ఉన్నారు. ఒంగోలులో ఫేజ్-2 కింద చింతల వద్ద 1,392, ఫేజ్-3 కింద కొప్పోలు వద్ద 2,736, గిద్దలూరులో ఫేజ్-3 కింద 1,248, కనిగిరిలో ఫేజ్-3 కింద చాకిరాల వద్ద 912, మార్కాపురంలో ఫేజ్-3 కింద పెదనాగులవరం రోడ్డులో 912 టిడ్కో ఇళ్లకు లబ్ధిదారులు అర్హత పొందారు.

అడవిని తలపిస్తున్న భవన సముదాయాలు

వైసీపీ నిర్వాకంతో గడిచిన ఐదేళ్లలో జిల్లాలో టిడ్కో ఇళ్లపై లబ్ధిదారులు ఆశలు వదిలేసుకున్నారు. ప్రస్తుత ఆ సముదాయాల పరిస్థితి చూస్తే ఇంటి గోడల నిర్మాణం పటిష్టంగానే ఉన్నా, ఫ్లోరింగ్ లేచిపోయి, మెట్లు పగిలిపోయి శిథిలావస్థకు చేరాయి. మరోవైపు అడవిని తలపించే విధంగా చెట్లు పెరిగిపోవడంతో విషపురుగులు సంచరించడంతో ఆ ప్రాంతంలో కాలుపెట్టే పరిస్థితి లేదు. అర్ధాంతరంగా ఆగిపోయిన పనులు నేటికి ఒక కొలిక్కి రాకపోవడంతో ఎండకు, వానకు, ఇనుము పాడై తుప్పుపట్టింది. కొప్పోలులో కనీస రహదారులు కూడా లేకపోగా, చింతల వద్ద నిర్మాణాలు లోతట్టు ప్రాంతాల్లో ఉండటంతో భారీగా నీరు నిలిచి ప్రాంగణంలో కాలు పెట్టలేని పరిస్థితి ఉంది. కట్టుబడి మొత్తం పూర్తయినా, తలుపులు, ఇతర మౌలిక వసతులు మాత్రమే మిగిలి ఉన్నాయి. అయితే అధికారులు గతేడాది చివరికి కేటాయింపులు జరుగుతాయని వెల్లడించారు. కానీ నేటికీ కేటాయింపుల జరగలేదు. టిడ్కో ఇళ్ల వాస్తవ పరిస్థితిని చూస్తే మరింత దయనీయంగా మారింది. ఇదిలా ఉండగా, నాడు పేదల సొంతింటి కల నిజం చేసేందుకు శ్రీకారం పలికిన టీడీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ఐదేళ్లుగా ఎదురుచూస్తున్నాం



- దండూరి శంకర్‌రావు, లబ్ధిదారుడు

గత టీడీపీ హయాంలో జీప్లస్‌త్రీలో ఇల్లు ఇచ్చారు. కానీ ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో అసలు ఇల్లు వస్తుందో.. రాదో అని ఆందోళన చెందా. కనీసం కట్టిన డబ్బులు తిరిగి ఇవ్వమని కార్పొరేషన్ ఆఫీసులో కూడా దరఖాస్తు చేసుకున్నా. ఇల్లు మంజూరైన వారికి ఇవ్వడం లేదని, రాని వారికి మాత్రమే డబ్బులు తిరిగి ఇస్తామన్నారు. దీంతో ఇల్లు వస్తుందో, రాదో తెలియలేదు. కట్టిన డబ్బులు లేవు. ఇల్లు ఇచ్చిన టీడీపీ ప్రభుత్వమే తిరిగి అధికారంలోకి రావడం సంతోషంగా ఉంది. త్వరలోనే పెండింగ్ పనులు పూర్తిచేసి ఇస్తారని ఎదురుచూస్తున్నాం.



కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

- ఈర్ల రత్తయ్య, లబ్ధిదారుడు

రోజువారీ పనులు చేసుకుంటూ జీవించేవాళ్లం. టీడీపీ ప్రభుత్వం పేదలకు పక్కా ఇల్లు ఇస్తామని చెప్పడంతో ఆర్థిక భారమైనా అప్పుచేసి మరీ డబ్బులు కట్టా. రూ.12,500 చొప్పున మూడు వాయిదాలు చెల్లించాను. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చి పేదల ఇళ్లను పూర్తిగా వదిలేసింది. కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు. అయితే కూటమి ప్రభుత్వం రావడం సంతోషంగా ఉంది. మాలాంటి పేదలకు సొంతిల్లు కల నెరవేరే రోజులు వచ్చాయని ఆశతో ఎదురుచూస్తున్నాము. పెండింగ్ పనులు పూర్తిచేసి, త్వరగా లబ్ధిదారులకు కేటాయించాలి.

వైసీపీ నేతల దాడులను సహించం

● **ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్**

ఒంగోలు నగరం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై వైసీపీ నేత సుదర్శన్‌రెడ్డి దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇలాంటి దాడులను సహించబోమని రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్ స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం ఒంగోలులోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మాల అధికారులపై వైసీపీ నేతలు దాడులు చేస్తే తగిన బుద్ధి చెబుతామన్నారు. జవహర్‌బాబుపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. వైసీపీ పాలనలో ఇష్టానురీతిగా ఎస్సీలపై దాడులకు తెగబడ్డ నాయకులు, అధికారం పోయినా అదే వరవడిని కొనసాగిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎస్సీలపై దాడులకు తమ నాయకులను ప్రోత్సహించే విధంగా జగన్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జగన్‌రెడ్డి హయాంలో ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యం అయ్యిందని, మాల, మాదిగ, రెల్లి కార్పొరేషన్‌లను ఏర్పాటు చేసి చిల్లిగవ్వ కూడా ఇవ్వకుండా ఎస్సీలకు అన్యాయం చేశారని మండిపడ్డారు. కూటమి అధికారంలోకి వచ్చాక కార్పొరేషన్‌కు రూ.340 కోట్లు కేటాయించిదని చైర్మన్ వెల్లడించారు.

యువకుడి ఆత్మహత్య

వేటపాలెం(చీరాల), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నీలకంఠాపురానికి చెందిన పింజల నాగార్జున (31) శనివారం తన బెడ్ రూంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని తండ్రి సమాచారం మేరకు.. వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. నాగార్జున భార్య ఏడాదిన్నర కిందట వారి మధ్య నెలకొన్న గొడవల నేపథ్యంలో పుట్టింటికి వెళ్లింది. కొంత కాలంగా నాగార్జునకు ఆరోగ్యం సరిగాలేక చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని తండ్రి రాత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

- పెరిగిన దొంగతనాలు
- మిస్సింగ్ కేసులలో పురోగతి
- విద్యార్థులకు అవగాహన సదస్సుల ఏర్పాటు
- వార్షిక నేర నివేదిక విడుదల చేసిన ఎస్పీ

ఒంగోలుక్రైం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా, వినియోగాన్ని పూర్తిగా లేకుండా చేసేందుకు పోలీసుశాఖ దృఢసంకల్పంతో ముందుకు పోతుందని ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని గెలాక్సీ భవన్‌లో పోలీసు అధికారులతో వార్షిక నేరసమీక్ష చేసిన అనంతరం మీడియాతో ఎస్పీ మాట్లాడారు. ఈ సందర్భంగా వార్షిక నేర నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతలను కాపాడేందుకు అధునాతన సాంకేతిక పద్ధతులను పాటిస్తున్నామన్నారు. నేర నియంత్రణకు డ్రోన్లు వినియోగిస్తున్నామని తెలిపారు. అందుకోసం వచ్చేనెలలోపు అన్ని స్టేషన్లలో డ్రోన్‌లు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అదే విధంగా జిల్లాలో ఐదు వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. సైబర్ క్రైంపై అవగాహన పెంచడంతో గత 25 రోజులుగా జిల్లాలో ఒక్క కేసు కూడా నమోదు కాలేదని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతున్నామని వివరించారు. గంజాయి, పేకాటలాంటి వాటిపై దృష్టిసారించామన్నారు. రోడ్డుప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టామని, అందుకనుగుణంగా గతేడాదితో పోలిస్తే 6.72 శాతం ప్రమాదాలు తగ్గాయని చెప్పారు. మిస్సింగ్ కేసులపై దృష్టిసారించి 378 మందిని వారి కుటుంబాల చెంతకు చేర్చామని చెప్పారు. అదేవిధంగా పోలీసు సిబ్బంది సంక్షేమానికి కూడా చర్యలు తీసుకున్నామని చెప్పారు.

ఈ ఏడాది 700 దొంగతనాలు

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది దొంగతనాలు పెరిగాయన్నారు. 2023లో 545 ఘటనలు జరగ్గా, 2024లో 700 చోటుచేసుకున్నాయి. అయితే గత ఆరు నెలలో 440 కేసులు నమోదు కాగా, రూ.1.7 కోట్లు సొత్తు చోరీకి గురైందన్నారు. అందుకు సంబంధించి రూ.1.4కోట్లు సొత్తు రికవరీ చేశామని తెలిపారు. దొంగతనాలపై ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. ఇంకా గస్తీ ముమ్మరం చేస్తామని తెలిపారు.

ఎస్పీ సీసీపై చేయిచేసుకున్న కానిస్టేబుల్

ఒంగోలు క్రైం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సాక్షాత్తు ఎస్పీ కార్యాలయంలో క్యాంప్ క్లర్క్‌పై అక్కడే పనిచేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ చేయి చేసుకున్నాడు. ఈ మేరకు ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ అజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం రాత్రి ఎస్పీ సీసీ, అక్కడే డిస్పాచ్‌లో పనిచేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ మధ్య మాటామాట పెరిగింది. ఓ ఫైల్ విషయంలో వీరి మధ్య వివాదం నెలకొంది. దీంతో సీసీపై కానిస్టేబుల్ చేయి చేసుకున్నాడు. ఈ మేరకు సీసీ తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మిస్సింగ్ కేసుల పరిశీలనకు ప్రత్యేక బృందాలు

ఈ ఏడాది 571 మిస్సింగ్ కేసులు నమోదు కాగా 478 కేసులలో పురోగతి సాధించామని తెలిపారు. తప్పిపోయిన వారిని ఇంటికి చేర్చామన్నారు. వీరిలో 22 మంది బాలురకు 18 మందిని, 114 మంది బాలికలకు 104 మంది, 139 పురుషులకు 104 మంది, 306 మంది మహిళలకు 252 మందిని గుర్తించి వారి ఇంటికి పోలీసు చేర్చారని వెల్లడించారు. ఇందుకోసం పోలీసు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అవగాహన సదస్సులు

జిల్లాలో నెలరోజుల పాటు ప్రత్యేక కార్యక్రమం చేపట్టి విద్యార్థులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశామన్నారు. బాలికలకు గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్, సైబర్ నేరాలు, రోడ్డుప్రమాదాలు, మత్తు పదార్థాలు సేవించడం వలన కలిగే అనర్థాలను వివరించినట్లు పేర్కొన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఈ అవగాహన సదస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

తగ్గిన నేరాలు

ఈ ఏడాది నేరాలు తగ్గాయని ఎస్పీ తెలిపారు. గతేడాది 46 హత్యలు జరగ్గా ఈ ఏడాది 27 జరిగాయని చెప్పారు. అదేవిధంగా గతేడాది 30 కిడ్నాపులు చోటు చేసుకోగా ఈ ఏడాది 23 జరిగాయన్నారు. లైంగికదాడి కేసులు ఈ ఏడాది 64 నమోదు కాగా గతేడాది 81 కేసులు వచ్చాయని తెలిపారు. ఈ విధంగా నేరాల సంఖ్య తగ్గినట్లు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పోలీసు అధికారుల సంఘ డైరీని ఎస్పీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, డీఎస్పీలు ఆర్.శ్రీనివాసరావు, నాగరాజు, లక్ష్మీనారాయణ, మహేశ్వరరావు, ఎస్పీ సీఐ రాఘవేంద్రరావు, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణరావు, డీసీఆర్‌బీ సీఐ దేవప్రభాకర్ పాల్గొన్నారు.

దేవదాయశాఖ పేరుతో రైతులతో చెలగాటం

(5వ పేజీ తరువాయి)

బసవన్నపాలెం, దొడ్డవరప్పాడు, వెంకటరాజుపాలెం తదితర గ్రామాలకు చెందిన వారు తమ భూములను ఆన్‌లైన్ చేయాలని ఆందోళన చేపట్టారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

స్పందన కరువు

ఇనమనమెళ్లూరు గ్రామ సర్వేనెంబర్‌లోని 291, 322, 324, 328, 329, 333, 391లో సుమారు 170.16 ఎకరాల భూమిని ఆయా గ్రామాల్లోని 230మంది రైతులు 30 ఏళ్ల నుంచి అనుభవిస్తున్నారు. అటువంటి భూములపై అనేక వివాదాలు నడిచి రైతులే హక్కుదారులుగా పలు న్యాయస్థానాల్లో తీర్పులు వచ్చినా సంబంధిత అధికారులు పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. రైతులు అనేక పర్యాయాలు మండల, డివిజన్, జిల్లాస్థాయిలో ఉన్నతాధికారులను కలిసి సమస్యను విన్నవించినా స్పందన కరువైంది. ఆ విధంగా జిల్లాలోని పలుప్రాంతాల్లో ఈ సమస్య ఉన్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది.

ఒంగోలులోనూ నిలిపివేత

జిల్లా కేంద్రమైన ఒంగోలులో కూడా సుదీర్ఘకాలం నుంచి నివాసాలు ఏర్పాటు చేసుకొని ఉంటున్న గృహాలపై కూడా దేవదాయశాఖ పేరుతో రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

అలా జిల్లావ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతున్నా అటు రెవెన్యూ యంత్రాంగం కానీ, ఇటు దేవదాయశాఖ అధికారులు కానీ పట్టించుకోవడం లేదు. దీంతో రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఆ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

దేవదాయశాఖ మంత్రిని కలిసిన రైతులు

మద్దిపాడు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలంలోని బసవన్నపాలెం, దొడ్డవరప్పాడు, వెంకటరాజుపాలెం గ్రామాల్లో తమ భూములను దేవదాయశాఖ భూములంటూ చెలగాటం ఆడుతున్నారని పలువురు రైతులు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి వినతి చేశారు. శనివారం మంగళగిరి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈమేరకు మంత్రిని కలిసి తమ సమస్యలను ఏకరవు పెట్టారు. మద్దిపాడు మండల టీడీపీ అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, రైతులు కలిసి దేవదాయ భూముల సమస్యలపై చర్చించారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి, దేవదాయశాఖ కమిషనర్‌తో ఫోన్లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా రైతు గోరంట్ల వెంకట్రావు మాట్లాడుతూ తమ గ్రామాల్లో 230మంది రైతులు 300 సంవత్సరాల నుంచి అనుభవిస్తున్న భూములు మీద ఎన్నో వివాదాలు నడిచి రైతులే హక్కుదారులుగా పలు న్యాయస్థానాలు తీర్పులు ఇచ్చాయని తెలిపారు. రైతులకే సంపూర్ణ హక్కులు ఉన్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, తుమ్మల వీరాంజనేయులు, మండవ వెంకట్రావు, మండవ శ్రీని వాసరావు, అబ్బూరి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రీ-సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

» రైతులు అందుబాటులో ఉండి వినియోగించుకోవాలి

» ఆర్డీవో చంద్రశేఖరనాయుడు



గుంటుపల్లిలో రీసర్వే అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో చంద్రశేఖరనాయుడు

బల్లికురవ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూ సర్వేతో గ్రామాలలో ఎన్నో దశాబ్దాల నుంచి ఉన్న భూ సమస్యలు పరిష్కారం అవుతాయని రైతులు దగ్గరుండి తమ భూములను సర్వే చేయించుకోవాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు పేర్కొన్నారు. శనివారం మండలంలోని గుంటుపల్లిలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెట్టమొదటి సారిగా చేపడుతున్న భూ సర్వేపై రైతులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో రైతులతో కలిసి ఆర్డీవో పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుంటుపల్లి రెవెన్యూలో రైతులకు పలు సమస్యలు అధికంగా ఉన్నాయని వాటి పరిష్కారానికి ఈ భూ సర్వే ఎంతో ఉపయోగ పడతుందన్నారు. రైతులందరు సర్వే టీంలు కొలతలు వేసే రోజు పొలాలకు వెళ్లి తమ వద్ద ఉన్న పట్టాదారు పాసు పుస్తకాలు, లింక్ డాక్యుమెంట్లు, రిజిస్ట్రేషన్ స్టాంపులు అధికారులకు చూపించాలన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి భూ సర్వే లేక రైతుల భూములు రికార్డులో నమోదు కాకపోవడంతో రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరిత గతిన సర్వే పూర్తి చేయిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవినాయక్, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, సర్వే డీటీ ప్రహర్ష, మండల సర్వేయర్ కిషోర్‌కుమార్, టీడీపీ నేతలు మలినేని గోవిందరావు, దద్దాల అంజయ్య, వీఆర్వో రామక్రిష్ణ, మాదాల శివన్నారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బైటమంజులూరులో 30న సర్వే

పంగులూరు : భూముల రీ-సర్వేపై ఈ నెల 30న రైతులకు అవగాహన కల్పించేందుకు బైటమంజులూరు గ్రామంలో గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పి.సింగారావు తెలిపారు. రీ-సర్వేపై శనివారం బైటమంజులూరు గ్రామంలో రెవెన్యూ సిబ్బంది నిర్వహించిన అవగాహన ర్యాలీలో తహసీల్దార్ సింగారావు పాల్గొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బైటమంజులూరులో రీ-సర్వే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో మొత్తం 1635ఎకరాల 54 సెంట్ల విస్తీర్ణం ఉన్నట్లు తెలిపారు. ఆరు బ్లాకులుగా విభజించి 5 ప్రత్యేక బృందాలతో సర్వే చేపడతామన్నారు. ర్యాలీలో గ్రామ సర్పంచ్ రుక్మిణి, మాజీ సర్పంచ్ శివరాజు, తిరుమలరాజు, కృష్ణంరాజు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు. కోటపాడు గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పాస్ పుస్తకాలు కోరుతూ ఏడుగురు, భూమి కొలతలకు సంబంధించి ఐదు ధరఖాస్తులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సురేష్, స్థానిక నేత గడ్డం నాగేశ్వరరావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మేదరమెట్ల : రీ సర్వేను ధైవాలరావూరులో పునఃప్రారంభిస్తున్నట్లు తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్వేయర్ మహేష్‌బాబు, రీ సర్వే డీటీ రవికాంత్, వీఆర్వో, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చినగంజాం : మండలంలోని మోటుపల్లి గ్రామంలో రీ సర్వేపై రైతుల్లో అవగాహన కల్పించడానికి శనివారం రెవెన్యూ అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు మాట్లాడుతూ గ్రామంలో రీ సర్వే కార్యక్రమం జరుగుతున్న సమయంలో సంబంధిత రైతులు హాజరై సర్వేకి సహకరించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. పొలాలకు చెందిన అన్ని పత్రాలను అధికారులకు అందజేసి సర్వేలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సుబ్బారావు, గ్రామ రెవెన్యూ అధికారులు, వీఆర్ఏలు, రైతులు పాల్గొన్నారు.

చీరాలటౌన్ : రీసర్వేపై అవగాహన కోసం ర్యాలీని తహసీల్దార్ గోపీకృష్ణ శనివారం మండల పరిధిలోని చీరాల రెవెన్యూ విలేజ్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రీసర్వే జనవరి నుంచి ప్రారంభమవతుందని చెప్పారు. భూ యజమానుల సమస్యల పరిష్కారం కోసం రీ సర్వేని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ అర్జున్, డివిజన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారి ముసలయ్య, సర్వేయర్ భ్రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పర్చూరు : పర్చూరు మండల పరిధిలోని రమణాయపాలెం గ్రామంలో రీసర్వేపై రెవెన్యూ అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. శనివారం తహసీల్దార్ పి.బ్రహ్మయ్య నేతృత్వంలోని సిబ్బంది గ్రామస్థులు, రైతులతో కలసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ డీటీ అరుణ, ఎంఎస్ బాలాంజనేయులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి.ప్రేమ్‌కుమార్, వీఆర్వోలు శ్రీనివాసరావు, హుస్సేన్ పాల్గొన్నారు.

మార్టూరు : రైతుల సమస్యలను పరిష్కరించేందుకు రీసర్వే ప్రారంభిస్తామని తహసీల్దార్ టీ ప్రశాంతి అన్నారు. శనివారం రాజుపాలెంలో రీసర్వేపై ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, టీడీపీ గ్రామ నాయకులు, సర్వేయర్ ఏడుకొండలు, జాష్టి వెంకటనారాయణ, అడుసుమల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యద్దనపూడి : మండలం పూనూరు గ్రామంలో శనివారం రీసర్వే ప్రారంభోత్సవ ర్యాలీని తహసీల్దార్ కే రవికుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్ఐ విష్ణు, పంచాయతీ కార్యదర్శి రాజు, టీడీపీ నాయకులు బోయపాటి సాంబశివరావు పాల్గొన్నారు.

ఇంకొల్లు : భూ రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ వెంకటరత్నం కోరారు. మండలంలోని ఇడుపులపాడు గ్రామంలో రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

గోశాలకు ట్రాక్టర్ వరిగడ్డి అందజేత

అద్దంకిటౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శనివారం అద్దంకిలోని హరిహర గోశాలకు ట్రాక్టర్ గడ్డిని అందజేశారు. అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో పని చేస్తున్న డాక్టర్ పొన్నం వెంకట కిరణ్ ఆర్థిక సహకారంతో వరిగడ్డి గడ్డిని గోశాలకు అందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీసుధాకరరావు, చిన్నిమురళీకృష్ణ, హరిప్రసాద్, ఊటుకూరు రామకోటేశ్వరరావు, తమ్మన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

31లోపు అభ్యంతరాల స్వీకరణ

అద్దంకి, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): సోషల్ ఆడిట్ ఆఫ్ క్యాస్ట్ సర్వే ఆఫ్ ఎస్సీ క్యాస్ట్ జాబితాలను అద్దంకి పట్టణంలోని అన్ని సచివాలయాల వద్ద ప్రదర్శించటం జరిగిందని మున్సిపల్ కమీషనర్ రవీంద్ర తెలిపారు. జాబితా లో అభ్యంతరాలను ఈ నెల 31 వ తేది లోపు సచివాలయం లో నేరుగా తెలియజేయాలని కోరారు. సదరు అభ్యంతరాలను పరిశీలించి తుది జాబితా ను 10 వ తేదీ సచివాలయాల వద్ద ప్రదర్శించటం జరుగుతుందని తెలిపారు.


తురిమెళ్ళలో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అడవులు, వన్యప్రాణులపై ప్రజల్లో అవగాహన

కంభం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అడవులు, వన్య ప్రాణుల వలన ఉపయోగాల గురించి కంభం, అర్ధవీడు మండలాల ప్రజలకు అటవీశాఖ అధికారులు అవగాహన కల్పించారు. శుక్రవారం రాత్రి తురిమెళ్ల ఫారెస్టు బీట్ ఆఫీసర్ రంగారెడ్డి ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ఈ జాతాలో అడవులకు నిప్పు పెట్టడం వలన కలిగే నష్టాలు, అనర్థాల గురించి వివరించారు. అడవుల సంరక్షణలో మన బాధ్యతల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు మహబూబ్‌సుభాని, కల్యాణి, అబ్దుల్‌గఫార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పద్మావతి

చిన్నారుల భద్రతపై ప్రత్యేక దృష్టి

చీరాలటౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామ స్థాయిలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి చిన్నారి బాలికల రక్షణకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. శనివారం జిల్లా స్థాయి విస్తృత సమావేశం చీరాల రోటరీ క్లబ్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా బాల్య వివాహాలు, బాల కార్మికులు, బాలల హక్కులు, బడి బయట పిల్లలు, ఫోక్సో కేసుల పురోగతి వంటి అంశాలపై ప్రాంతాలవారీగా సిబ్బందితో మాట్లాడి తెలుసుకున్నారు. ప్రతిఒక్కరూ చిన్నారల రక్షణ చర్యల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. వారి బంగారు భవిష్యత్‌కు ప్రతిఒక్కరూ క్రియాశీలకంగా పనిచేయాలని సూచించారు. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు ప్రభుత్వం ద్వారా సాయమందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే కొంతమంది చిన్నారులను శిశు గృహాల ద్వారా రక్షణ కల్పించి ఉన్నతంగా చదివిస్తున్నట్లు వివరించారు. సిబ్బంది సందేహాలను నివృత్తి చేశారు. అలాగే అంతకంటే ముందుగా హాయ్యర్‌పేటలోని ఎంపీపీ స్కూల్, గంజిపాలెంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యక్రమంలో వేటపాలెం ఐసీడీఎస్ సీడీపీవో ఉమ, జిల్లా పరిధిలోని సూపర్‌వైజర్‌లు, సీసీఐఎస్ సిబ్బంది, వార్డెన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ కార్పొరేటర్ భర్తపై దాడి

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని 32వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ తాడి కృష్ణలత భర్త వెంకటేష్‌పై స్థానిక గద్దలగుంటకు చెందిన కృష్ణ అనే వ్యక్తి శుక్రవారం రాత్రి దాడికి పాల్పడ్డారు. బాధితులు చెప్పిన వివరాల మేరకు.. కృష్ణ అర్ధరాత్రి మద్యం తాగి తమ ఇంటిపై దౌర్జన్యం చేయడమే కాకుండా మహిళ కార్పొరేటర్‌గా ఉన్న కృష్ణలతపైనా దౌర్జన్యం చేశాడని పేర్కొన్నారు. ఈ మేరకు బాధితుడు వెంకటేష్ వైద్యం కోసం జీజీహెచ్‌లో చేరారు. ఇదిలా ఉండగా బాధితుడు వెంకటేష్‌కు, దాడికి పాల్పడిన కృష్ణకు మధ్య గత కొంతకాలంగా వ్యక్తిగత విబేధాలు ఉన్నట్లు సమాచారం. గతంలోనూ పలుమార్లు వారి మధ్య వాగ్వావాదాలు, ఘర్షణలు జరిగినట్లు తెలుస్తుండగా, శుక్రవారం రాత్రి మరోసారి వారి మధ్య గొడవ పెరిగి దాడి జరిగినట్లు సమాచారం.


నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా కర్పూర ఆరాధన మహోత్సవం

ఈపూరుపాలెం(చీరాలటౌన్), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం ఈపూరుపాలెం పంచాయతీ పద్మనాభునిపేటలో వేంచేసిఉన్న శ్రీలక్ష్మీ అనంత పద్మనాభస్వామివారి దేవాలయ ప్రాంగణంలో ఘనంగా 38వ కర్పూర ఆరాధన మహోత్సవంను కమిటీ ప్రతినిధులు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమం గత బుధవారం జరగాల్సి ఉండగా అల్పపీడన ప్రభావంతో శనివారం నిర్వహించారు. ఈక్రమంలోనే హరిహర సుత శ్రీ అయ్యప్ప స్వామివారి నగరోత్సవం, తిరునాళ్ల కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.



జగన్ హయాంలోనే ప్రజలపై విద్యుత్ భారాలు

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ధ్వజం

సంతనూతలపాడు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జగన్ చేసిన అవినీతి వల్లే ప్రజలపై విద్యుత్ చార్జీల భారాలని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2014లో చంద్రబాబు పాలన 22.5 మిలియన్ యూనిట్లతో ప్రారంభమైందన్నారు. నేడు రాష్ట్రంలో 20వేల మెగావాట్లు విద్యుత్ సామర్థ్యంగల ప్లాంట్లను చంద్రబాబు నిర్మించినవేనని, దీనివల్ల రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వగలుగుతున్నట్లు గుర్తు చేశారు. 2019లో టీడీపీ ప్రభుత్వం మిగులు విద్యుత్‌ను జగన్ చేతిలో పెట్టిందని, అయితే తన ఐదేళ్ల పాలనలో 10సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ.32 వేల కోట్ల భారం మోపారని విమర్శించారు. మైలవరం సోలార్‌ప్లాంట్లపై దాడిచేసిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. చట్టవిరుద్ధంగా పీపీఏలను రద్దు చేయడం వల్ల 7వేల మెగావాట్లు తక్కువ రేటుకు వచ్చే విద్యుత్ కోల్పోవడం జరిగిందని, ఒక వేళ ప్రోత్సహించి ఉంటే 10వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగేదని, తద్వారా రాయలసీమ, ప్రకాశం జిల్లా యువకులకు ఉద్యోగఅవకాశాలు వచ్చేవని, మిగులు విద్యుత్ సైతం ఉండేదన్నారు. వైసీపీ పాలనలో విజయసాయిరెడ్డి జెన్‌కోకు నాసికరకం బొగ్గును సరఫరా చేయడంతో విద్యుత్ ఉత్పత్తి తగ్గిందని గుర్తు చేశారు. ఒక్క విద్యుత్‌ప్లాంట్‌ను జగన్ ముఖ్యమంత్రిగా ఉండి నిర్మించలేకపోయారని విమర్శించారు. నిర్మాణం పూర్తి అయ్యి విద్యుత్ ఉత్పత్తికి సిద్ధంగా ఉన్న కృష్ణపట్నం, వీటీపీఎస్‌లను సకాలంలో ప్రారంభించలేదని, దీనిని సాకుగా చూపి విద్యుత్ కొరతను సృష్టించి కమీషన్ల కోసం బహిరంగ మార్కెట్లో అధికరేట్లకు కొనుగోలు చేయడం వల్ల భారీ నష్టం వచ్చిందన్నారు. సెకీ ఒప్పందంలో జగన్ రూ.1750 కోట్లు లంచాలు తీసుకున్నారనే ఆరోపణలతో అమెరికా కోర్టులో కేసు నమోదైనట్లు తెలిపారు. ఇన్ని అవినీతి పనులు చేసి నేడు విద్యుత్ చార్జీలు పెంపు అని గగ్గోలు పెడుతూ వైసీపీ నాయకులు ధర్నాలు నిర్వహించడం ప్రజలను మోసం చేయడం కాదా అని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ నిలదీశారు.



ఏఈఎస్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కానిస్టేబుల్ శంకర్‌నాయక్

సీఐ వేధిస్తున్నాడని కానిస్టేబుల్ నిరసన

● మార్కాపురం ఏఈఎస్ కార్యాలయం ఎదుట బైఠాయింపు

మార్కాపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): తనపై వ్యక్తిగతంగా కక్షపెంచుకుని ఎర్రగొండపాలెం ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తనను వేధిస్తున్నాడని కానిస్టేబుల్ శంకర్ నాయక్ ఆరోపించారు. శనివారం స్థానిక ఎక్సైజ్ ఏఈఎస్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం 'ఈ నెల 3న వై.పాలెం మండలంలోని అమానిగుడిపాడు గ్రామంలో రైడ్‌కు వెళ్లమని నాకు సీఐ చెప్పారు. అక్కడ తనిఖీలు నిర్వహిస్తే ఓ వ్యక్తి వద్ద రెండు మద్యం సీసాలు దొరికాయి. కానీ సీఐ శ్రీనివాసరావు మాత్రం వెనక్కురావాలని ఆదేశించారు. వచ్చిన తర్వాత రైడ్ చేసి ఎందుకు మద్యం సీసాలు, నిందితుడిని తీసుకురాలేదని ఇష్టారీతిన తిట్టారు. అదేవిధంగా ఈ నెల 25న ఎర్రగొండపాలెంలో రైడ్ ఉందని రమ్మని సీఐ శ్రీనివాసరావు ఆదేశించారు. అక్కడకు వెళ్లి రైడ్ పాల్గొని వచ్చిన తర్వాత సీఐ శ్రీనివాసరావు, డీటీఎఫ్ ఎస్సై శ్రీకాంత్‌రెడ్డిలు తనను కులం పేరుతో దూషించారు.' అని ఆరోపించారు. ఈ విషయమై ఏఈఎస్ కార్యాలయంలో అందుబాటులో ఉన్న ఈఎస్‌టీఎఫ్ సీఐ సయ్యద్ గౌస్ మొహిద్దీన్‌ను అడుగగా విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానన్నారు.

నేటి నుంచి డిగ్రీ మూల్యాంకనం

ఒంగోలు(విద్య),డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సంబంధించిన మూడవ సంవత్సరం ఐదవ సెమిస్టర్ మూల్యాంకనం ఒంగోలులోని డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు ప్రారంభం అవుతుందని క్యాంప్ ఆఫీసర్ డాక్టర్ డి.కళ్యాణి శనివారం తెలిపారు. హిస్టరీ, ఎకనామిక్స్, రాజనీతిశాస్త్రం మినహా అన్ని సబ్జెక్టుల పేపర్లు వచ్చాయని, విధులకు నియమితులైన ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, అద్దంకి, పొదిలి, కందుకూరు, దర్శి, చీరాలలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు కళాశాల అధ్యాపకులు అందరూ తమ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అపాయింట్‌మెంట్ ఐడీ కార్డు, పర్సనల్ ప్రొఫైల్, కళాశాల రిలీవింగ్ తీసుకుని రావాలని ఆమె తెలిపారు.

శభాష్ పోలీస్

కనిపించకుండా పోయిన వారిని కుటుంబాల చెంతకు చేర్చిన వైనం

ఆరు నెలల్లో 367 కేసులలో పురోగతి

ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబాలు





కుటుంబాల చెంతకు చేరిన వారి బంధువులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్ (ఇన్‌సెట్లో) ఓ చిన్నారిని ముద్దాడుతున్న ఎస్పీ

ఒంగోలు(క్రైం),డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో ఇల్లు వదిలి వెళ్లిన వారిని కుటుంబాల చెంతకు చేర్చి పోలీసులు శభాష్ అనిపించుకున్నారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఎస్పీగా వచ్చిన తరువాత మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టిసారించారు. అందుకు సంబంధించి సబ్‌డివిజన్ స్థాయిలో బృందాలు ఏర్పాటుచేసి తప్పిపోయిన వారి వివరాలు సేకరించారు. వారు ఎక్కడ ఉంటున్నారు, ఎందుకు వెళ్లారు అనే అంశాలపై ఆరా తీశారు. జిల్లాలో నమోదు అయిన 367 మిస్సింగ్ కేసులను చేధించి వారి కుటుంబాల చెంతకు చేర్చారారు. వీరిలో మహిళలు, చిన్నపిల్లలు, పురుషులు ఉన్నారు.

కారణాలు ఏమయినా వారు అంతా కుటుంబాలకు దూరంగా ఉంటున్నారు. అలాంటి వారిని గుర్తించి తిరిగి కుటుంబాలకు చెంతకు చేర్చారు. ఈ మేరకు 42 మంది పురుషులు వారి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి శనివారం పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మాబిడ్డలను తిరిగి ఇంటికి చేర్చినందుకు జీవితాంతం రుణ పడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.నాగేశ్వరావు, ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీలు ఆర్.శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, నాగరాజు, సీఐలు,ఎస్సైలు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయమా.. ధాన్యం కేంద్రమా!



ముండ్లమూరు మండలంలోని కెల్లంపల్లిలో కొంతమంది రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొనేందుకు గ్రామ సచివాలయాన్ని ఎంచుకున్నారు. వరి పంటను నూర్పిడి చేసిన వెంటనే ధాన్యాన్ని తీసుకు వచ్చి సచివాలయం ముందు ఆరబోస్తున్నారు. గ్రామానికి కొంచెం దూరంలో సచివాలయం, రైతు సేవా కేంద్రం, ఆరోగ్య ఉప కేంద్రాల భవనాలు ఒకేచోట నిర్మించారు. ఇటీవల కొంతమంది రైతులు మూడు ప్రభుత్వ కార్యాలయాల ముందు ధాన్యాన్ని ఆరబెట్టడంతో వివిధ సమస్యలపై కార్యాలయాలకు వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు.

- ముండ్లమూరు, ఆంధ్రజ్యోతి

అమృత్ సరోవర్ పనుల వేగవంతం

● డ్వామా పీడీ జోసఫ్‌కుమార్



చేకూరపాడులో గోకులం షెడ్డును పరిశీలిస్తున్న పీడీ జోసఫ్‌కుమార్

నాగులుప్పలపాడు డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో అమృత్‌సరోవర్ కింద చెరువుల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ సూచించారు. శనివారం నాగులుప్పలపాడు మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 90శాతం సబ్సిడీపై గోకులం షెడ్లు అందిస్తున్నామని, ఇవి రైతులు, పశుపోషకులు, గొర్రెల పెంపకందార్లకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. పొలాల్లో నీటి నిల్వకు రైతువారీ కుంటలు పథకం సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్‌సరోవర్‌లో భాగంగా ప్రతి గ్రామంలో చెరువులను అభివృద్ధి చేసేలా తగిన స్థలాలను గుర్తించడం, గతంలో ఉన్న చెరువులలో అభివృద్ధి పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో బాగంగా చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, మొక్కలపెంపకంతో పాటు ప్రజలు సేదతీరేందుకు వీలుగా బెంచీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆయా పనులు ప్రారంభించాలని సూచించారు. రైతువారీ కుంటలు, ఇంకుడు గుంతలు, గోకులం షెడ్లు పథకాల లబ్ధిదారులను గుర్తించి పనుల ఆమోదానికి ప్రతిపాదనలు పంపించాలని సూచించారు జనవరి 10 నాటికి మండలంలో 67 మినీ గోకులం షెడ్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం చేకూరపాడు, మద్దిరాలపాడు గ్రామాల్లో జరుగుతున్న గోకులం షెడ్లు పనులను పీడీ జోసఫ్‌కుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీడీ వెంకటస్వామి, ఏపీడీ బసవసుబ్బారావు, ఏపీవో రవిబాబు, టీఏలు పిచ్చయ్య, జిలాని, వాసుబాబు, నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

విద్యాశాఖ గుంటూరు ప్రాంతీయ సంయుక్త సంచాలకులు లింగేశ్వరరెడ్డి



శిక్షణలో మాట్లాడుతున్న సంయుక్త సంచాలకులు లింగేశ్వరరెడ్డి

పొదిలి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విద్యాశాఖ గుంటూరు ప్రాంతీయ సంయుక్త సంచాలకులు లింగే శ్వరరెడ్డి అన్నారు. శనివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో సమగ్రశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు తన వంతుగా కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు మంచి ఆలోచనతో ముందుకు వెళితే ప్రతి విషయంలో మంచిఫలితాలు వస్తాయని సూచించారు. సీఈవో కిరణకుమార్ మాట్లాడుతూ కమిటీ సభ్యుల సహకారం తీసుకుంటూ పాఠశాల లను అన్నికోణాల్లో అభివృద్ధి చెందే విధంగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాలంటే ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో అవసరమౌతాయన్నారు. ఎస్ఎంసీ సభ్యుల పాత్ర, బాధ్యతలపై రిసోర్స్‌పర్సన్స్ కు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవోలు చంద్రమౌళీశ్వరరావు, సామ్యేల్‌జాన్, ఎంఈవోలు ఎం.శ్రీనివాసరెడ్డి, నాగలక్ష్మీ, ఆర్ కొండారెడ్డి, రామిరెడ్డి, సమగ్రశిక్ష అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అభినందనలు

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉపాధ్యాయులు దుస్తులు సమకూర్చడం అభినందనీయమని ఆర్‌జేడీ లింగేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి మంచి కార్యక్రమాలు చేయడం వలన విద్యార్థులు కూడా ఆకర్షితులు అవుతారన్నారు. ఎంఈవో శ్రీనివాసరెడ్డి చొరవతో ఉపాధ్యాయులు విద్యార్థులకు సహాయం చేయడం హర్షణీయమన్నారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒకరకంగా తనవంతుగా సాయం చేయాలన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న గుంటూరు ఆర్‌జేడీ లింగేశ్వర్‌రెడ్డి

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

గిద్దలూరు టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకున్న డాక్టర్ మొర్రి పిచ్చయ్యను శనివారం గుంటూరు విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ లింగేశ్వర్‌రెడ్డి సన్మానించారు. పొదిలి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశాలను పర్యవేక్షించడానికి వచ్చిన ఆర్‌జేడీ పిచ్చయ్యను సన్మానించారు. కార్యక్రమంలో ఒంగోలు విద్యాశాఖ అధికారి కిరణ్‌కుమార్, మార్కాపురం ఉప విద్యాశాఖ అధికారి జాన్‌శ్యామూల్, ఒంగోలు విద్యాశాఖాధికారి చంద్రమౌళేశ్వర్‌రావు, రాచర్ల మండల విద్యాశాఖాధికారులు గిరిధరశర్మ, శివకోటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు వెంకటరావు, ఖాన్, మీరావలి పాల్గొన్నారు.

తగ్గించిన క్వాంటమ్‌ను పునరుద్ధరించాలి

● పెన్షనర్ల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు గత వైసీపీ ప్రభుత్వం తగ్గించిన అదనపు క్వాంటమ్‌ను తిరిగి పూర్వ స్థితికి తీసుకవచ్చేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల ఫెడరేషన రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక ఎన్‌జీవో సమావేశపు హాలులో శనివారం పెన్షనర్ల సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా జిల్లా ఖజానాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎ.జగన్నాథరావు జాతీయ జెండాను ఎగురవేశారు.

అనంతరం జిల్లా అధ్యక్షుడు బి.అంకిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సభలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 11వ పే రివిజన్ అరియర్స్‌ను త్వరగా ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రభుదాస్, ట్రెజరీశాఖ డీడీ ఎం.జగన్నాథం ఎస్‌టీవో డి.రాజ్యలక్ష్మి, ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శరత్‌బాబు, అసోసియేట్ అధ్యక్షుడు ఎం.రామకృష్ణ, జిల్లా ప్రధానకార్యదర్శి డాక్టర్ కంచర్ల సుబ్బారావు, కొప్పోలు రామారావు తదితరులు పాల్గొన్నారు.

నితీష్ మనోడే..

● అమ్మగారి ఊరు చెరువుకొమ్ముపాలెం

● ఆస్ట్రేలియాతో టెస్ట్ మ్యాచ్‌లో సెంచరీతో చెలరేగిన తెలుగు కుర్రోడు

ఒంగోలు, కార్పొరేషన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియా జట్టుతో జరుగుతున్న టెస్ట్ మ్యాచ్‌లో ఇండియా జట్టును ఆఖరి నిమిషంలో ఆదుకున్న నితీష్‌కుమార్‌రెడ్డి మన తెలుగు వాడే. అంతకుమించి మన ఒంగోలు సమీపంలోని చెరువుకొమ్ముపాలెం గ్రామ వాసికి మనుమడు. నితీష్ అమ్మగారు జోకృష్ణది ఆ ఊరే. ఆస్ట్రేలియాపై తలపడుతున్న ఇండియా జట్టుకు తెలుగు బిడ్డ ఆక్సిజన్‌గా మారాడు. మొదటి ఇన్నింగ్‌లో సెంచరీ చేసి, ప్రతిభ చాటడమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా తెలుగు కీర్తిని చాటారు నితీష్‌కుమార్ రెడ్డి. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాడు. అందరు బ్యాట్స్‌మెన్‌లు చేతులెత్తేసిన సమయంలో బ్యాటింగ్‌కు దిగిన నితీష్ కుమార్‌రెడ్డి ఏకంగా సెంచరీ చేసి ఇండియా జట్టును ఆదుకున్నాడు. మరోవైపు ఆస్ట్రేలియన్ బౌలర్లు సైతం భయపడేలా పరుగుల వర్షం కురిపించిన నితీష్ ప్రతిభను ప్రతి ఒక్క క్రికెట్ అభిమాని కొనియాడుతున్నారు. నితీష్ కుమార్‌రెడ్డి తండ్రి ముత్యాలరెడ్డి వృత్తి రీత్యా వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగిగా పని చేస్తుండగా, ఆయనను భోపాల్ బదిలీ చేశారు. అయితే కుమారుడి కోసం ఉద్యోగాన్ని వదిలేశారు. నిరంతరం కుమారుడి కఠోర సాధనకు సహకారం అందించారు. నితీష్‌రెడ్డి తల్లి స్వగ్రామం చెరువుకొమ్ముపాలెం కాగా, ఆయన మేనమామలు తాతయ్య, అమ్మమ్మలు మన జిల్లాకు చెందిన వారే కావడం సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో వీల్‌చైర్లు, ర్యాంపుల ఏర్పాటు

● కలెక్టర్ అన్సారియా



సమావేశంలో మాట్లాడుతున్న అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వీల్‌చైర్లు, ర్యాంపులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో శనివారం దివ్యాంగుల చట్టం-2016 అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలీస్‌స్టేషన్లకు దివ్యాంగులు ఫిర్యాదులు ఇచ్చేందుకు వచ్చిన సమయంలో ఎలాటి ఇబ్బందులు లేకుండా వారి సమస్యలను పరిష్కరించేలా చర్యలు సూచించారు. దివ్యాంగుల కమిటీ సభ్యుల నుంచి వచ్చి అభిప్రాయాలకు అనుగుణంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో దివ్యాంగుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు జి.అర్చన, జడ్పీ సీఈవో చిరంజీవి, మెప్మా పీడీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

4లోపు ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైద్యశాఖ పరిధిలోని నేషనల్ హెల్త్‌మిషన్(ఎన్ఎంహెచ్) ద్వారా మార్కాపురంలోని జీజీహెచ్‌లో ఫిజిషియన్, మూడు స్టాఫ్ నర్సుల ఉద్యోగాలకు వచ్చేనెల 4వతేదీలోపు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి టి.వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఒంగోలులోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో దరఖాస్తులతో పాటు ధ్రువీకరణ పత్రాల నకలను జతపర్చి స్వయంగా అందజేయాలని ఆయన కోరారు.



వైసీపీ పాలన పాపమే ప్రజలకు శాపం


మాట్లాడుతున్న హరిబాబు

సంతనూతలపాడు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ పరిపాలనలో జరిగిన పాపాలే రాష్ట్ర ప్రజలపై విద్యుత్ చార్జీల భారాల రూపంలో శాపమైందని టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు ఆరోపించారు. శనివారం సంతనూతలపాడు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ చార్జీలను నాడు సీఎం జగన్ ఇష్టమొచ్చిన పెంచేసి, నేడు అధికారం కోల్పోగానే అన్యాయం అంటూ ధర్నాలు చేస్తే ప్రజలు నమ్మరన్నారు. రాష్ట్రంలో నాడు చంద్రబాబు పాలనలో విద్యుత్ చార్జీల పెంపు అనేది అంతగా భారంగా ఉండేది కాదని, ఉచిత విద్యుత్ సైతం అందించిన ఘనత టీడీపీదేనని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ముప్పరాజు శ్రీను, ఎం.వెంకటేశ్వర్లు, పీఏసీఎస్.చౌదరి, టి.నరసింహారావు, బి.శంకర్, బోసు తదితరులు పాల్గొన్నారు.

కేవీపాలెం తాగునీటి పథకం పరిశీలన


సంపును పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చీమకుర్తి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : రామతీర్థం రిజర్వాయర్ నుంచి దాదాపు 15గ్రామాలకు సరఫరా చేసే తాగునీటి పథకం నిర్వహణా లోపంతో మండలంలోని ఐదు గ్రామాలలో తాగునీటి సమస్య తీవ్రంగా నెలకొంది. ఈ సమస్యపై శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికార, ప్రతిపక్ష సభ్యుల నుంచి తీవ్రస్థాయిలో ప్రశ్నలు ఎదుర్కొన్న అధికారులు సమస్య పరిష్కారానికి రంగంలోకి దిగారు. జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులతో కలిసి సమస్య ఎక్కడ నెలకొందో తెలుసుకోవటానికి క్షేత్రస్థాయిలోకి వెళ్లారు. ఎంపీడీవో రాఘవేంద్ర, ఏఈ శాంతిలు ప్రజాప్రతినిధులతో కలిసి కేవీపాలెం, ముప్పావారిపాలెం, చినరావిపాడు గ్రామాలను పరిశీలించారు. ముప్పావారిపాలెంలో సంపు, మోటారు ఏర్పాటుచేసి పైపులైన్లకు మరమ్మతులు నిర్వహిస్తే తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తొలగిపోతాయని, ఇందుకోసం దాదాపు రూ.6లక్షలు అవసరమని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. దీనిపై ఎమ్మెల్యే విజయ్‌కుమార్, మండల పాలకవర్గంతో చర్చించి సత్వరమే పనులు నిర్వహించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్ణయించారు.

పశుగ్రాస సాగుపై అవగాహన ఉండాలి

- జేడీఏ బేబీరాణి


కూలీలతో మాట్లాడుతున్న జేడీఏ బేబీరాణి

నాగులుప్పలపాడు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పశుపోషకులు బహువార్షిక పశుగ్రాస సాగుపై అవగాహన కలిగిఉండాలని జేడీఏ బేబీరాణి సూచించారు. చేకూరపాడు గ్రామంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఉపాధి పథకం ద్వారా నూరు శాతం సబ్సిడీపై అందిస్తున్న బహువార్షిక పశుగ్రాస విత్తనాలను రైతులకు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ గడ్డి ద్వారా పశువులకు మినరల్స్, విటమిన్లు అందుతాయని, తద్వారా పాల దిగుబడి పెరుగుతుందని తెలిపారు. ఐదు ఎకరాలు కలిగిన ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు అర్హులని తెలిపారు. ఒక్కో రైతు వ్యక్తిగతంగా 10 నుంచి 50 సెంట్ల దాకా బహువార్షిక పశుగ్రాసం సాగుచేసుకోవచ్చని సూచించారు. తగిన ధ్రువపత్రాలతో గ్రామాల్లోని మీసేవా, పశువైద్యకేంద్రాలలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న పశుగణన, గోకులం షెడ్ల నిర్మాణాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి పి.అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

- డిప్యూటీ కలెక్టర్ వరకుమార్


అర్జీలను స్వీకరిస్తున్న డిప్యూటీ కలెక్టర్ వరకుమార్

నాగులుప్పలపాడు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని రెవెన్యూ సమస్యలకు సత్వరం పరిష్కారం సదస్సుల ద్వారా లభిస్తుందని కేఆర్‌ఆర్ డిప్యూటీ కలెక్టర్ వరకుమార్ తెలిపారు. చేకూరపాడులో శనివారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సదస్సులు నిర్వహించి సాధ్యమైనవి అప్పటికప్పుడే పరిష్కరిస్తామన్నారు. మిగిలినవి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపుతామన్నారు. సదస్సులో 5 అర్జీలు అందినట్లు తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బీబీరాణి, సర్వేయరు రత్నాకర్, ఆర్ఐ రమేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కార్మికుడి మృతి

- తమిళనాడు వాసిగా గుర్తింపు


మరణించిన కార్మికుడు

కొండపి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో తమిళనాడుకు చెందిన హోటల్ కార్మికుడు స్థానిక బస్టాండ్ ఆవరణలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు 60 సంవత్సరాల వయసు కలిగిన ఆయన శనివారం కొండపి సీహెచ్‌సీకి వెళ్లాడు. అక్కడ చికిత్స చేయించుకొని బయటకు వచ్చాడు. ఆ సమయంలో ఆయన మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది. అనంతరం బస్టాండ్ ఆవరణలోని ఓ దుకాణం వద్ద పడుకొని అక్కడే ప్రాణాలు విడిచాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లోని నంబర్ల ఆధారంగా తమిళనాడు వాసిగా గుర్తించారు. కామేపల్లిలోని ఓ హోటల్‌లో పని చేస్తున్నాడని భావిస్తున్నారు. కాంటాక్ట్ నంబర్లకు ఫోన్ చేస్తుంటే తమిళంలో మాట్లాడుతున్నారని, సమాచారం సేకరిస్తున్నామని ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు.

గోకులం షెడ్ల నిర్మాణాలు వేగవంతం

- డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ జోసెఫ్‌కుమార్

సంతనూతలపాడు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆయా గ్రామాల్లో నిర్మిస్తున్న గోకులషెడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్ సూచించారు. శనివారం సంతనూతలపాడు మండలపరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ఆయా గ్రామాల్లో 53 గోకులంషెడ్లు మంజూరైనట్లు తెలిపారు. మండలానికి ప్రభుత్వం నిర్దేశించిన అమృతసరోవర్ కింద గ్రామంలో ఉన్న మంచినీటి చెరువులు అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. అదేవిధంగా మంజూరైన క్యాటిల్‌షెడ్లను జనవరి 10లోపు పూర్తి చేయాలన్నారు. ఉపాధి పనులకు కూలీలు పెంచాలని చెప్పారు. అనంతరం మద్దులూరులో జరుగుతున్న గోకులంషెడ్ల పనులను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ వెంకటస్వామి, ఎంపీడీవో సురేష్‌కుమార్, ఏపీవో వాసంతి, సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేను రద్దు చేయాలి

సంతనూతలపాడు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గుమ్మళంపాడు గ్రామంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో గ్రామరైతులు రీసర్వే రద్దు చేసి పాతవిధానాన్ని కొనసాగించాలని తహసీల్దార్ వి.ఆదిలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. 2023లో చేపట్టిన రీసర్వేలో అన్ని తప్పుల తడకలుగా ఉన్నాయని, పాతవిధానాన్ని కొనసాగిస్తే రైతులకు శ్రేయస్కరంగా ఉంటుందని టీడీపీ నాయకులు వివరించారు. రైతుల నుంచి ఐదు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వానంగా ఉన్నా.. పట్టించుకోరా..?

- పాత బైపాస్‌లోని జనసేన పార్టీ ఆఫీసు సమీపంలో సర్వీసు రోడ్డు అస్తవ్యస్తం
- గుంతలు తెలియక తరచూ ప్రమాదాలు
- గత రెండేళ్లుగా వాహనదారుల అవస్థలు




చెరువును తలపిస్తున్న సర్వీసురోడ్డు (పైన), నీటిలోని గుంతలతో వాహనదారుల అవస్థలు (పక్క చిత్రాలు)

ఒంగోలు నగరంలోని పాత బైపాస్‌రోడ్‌లో ప్రయాణమంటే ప్రమాదాలు కొని తెచ్చుకున్నట్టే. స్థానిక జనసేన పార్టీ కార్యాలయం సమీపంలోని సర్వీసు రోడ్డు అధ్వానంగా మరినా దాని మరమ్మతులు పట్టించుకున్న నాధుడే కరువయ్యారు. చినుకుపడితే చెరువులా మారే ఈరోడ్డులో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అయినా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. గత వైసీపీ పాలనలో పూర్తిగా వదిలేయగా, నేడు కూటమి ప్రభుత్వం వచ్చాక జనం కోటి ఆశలు పెంచుకున్నారు. త్రోవగుంట వైపు రాకపోకలు సాగించేవారి పరిస్థితి మరింత దారుణంగా మారింది. పగటి పూట సంగతి ఎలా ఉన్నా, రాత్రయితే ఆ రోడ్డులో ప్రమాదాలుగా జరగడం పరిపాటిగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. గత రెండేళ్ళుగా చెరువును తలపిస్తున్న ఈ మార్గంలో ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నాను. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ రోడ్డను బాగుచేయించి ప్రమాదాలు నివారించాలని నగరవాసులు కోరుతున్నారు

- ఒంగోలు కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి)

నిధులు ఉన్నా.. ఏమీ చేయలేకపోతున్నాం !

- చీమకుర్తి మండల సమావేశంలో ప్రజాప్రతినిధుల అంతర్మథనం
- ఎంపీపీ, వైస్ ఎంపీపీ మధ్య వాగ్వాదం
- సమస్యలపై అధికారులను నిలదీత



తాగునీటి సమస్యపై నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు

చీమకుర్తి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : "సమావేశాలకు వస్తున్నాం. వెళ్తున్నాం. గ్రామాల్లో ఒక్క పనికూడా చేయలేకపోతున్నాం.. రూ.20కోట్లు డబ్బులు మన వద్ద ఉన్నాయి. అయినా ఏమి చేయలేకపోతున్నాం. ఊళ్లల్లో ఏమిచేశారని ముఖం మీదే అడుగుతున్నారు. ఇంకో ఏడాది ఉంది. మన టైం అయ్యేలోపు ఏదో ఒకటి చేశామన్న తృప్తి అన్నా ఉంటుంది. వాళ్లతో రాజీ కుదుర్చుకొని అయినా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేద్దాం" ఇవీ... చీమకుర్తి మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధుల్లో నెలకొన్న అంతర్మథనం. కనీసం అజెండా కూడా లేని సమావేశాలకు హాజరైనా లాభం ఏమి ఉంటుందని నిట్టూర్పు విడిచారు. కొత్త ప్రభుత్వం వచ్చినానాటి నుంచి కనీసం అధికారులు కూడా గ్రామాల్లో నిర్వహించే సమావేశాలకు పిలవటం లేదని, సర్వసభ్య సమావేశాల్లో అడిగిన సమస్యలను పరిష్కరించటంపై కూడా పట్టించుకోవటం లేదని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వాపోయారు. ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన చీమకుర్తి మండల సర్వసభ్యసమావేశాన్ని శనివారం నిర్వహించారు. అజెండా లేకుండానే జరిగిన సమావేశంలో శాఖల వారి సమీక్ష నిర్వహించారు. కొంతమంది అధికారులు సమావేశాలకు హాజరుకాకపోవటంపై ఎంపీపీ అసహనం వ్యక్తం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శాంతి సమావేశంలో మాట్లాడుతున్న సమయంలో కేవీపాలెం తాగునీటి పథకం కింద గ్రామాలకు నీరు అందకపోవటంపై జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, ఆయా గ్రామాలకు చెందిన సర్పంచ్, ఎంపీటీసీలు ప్రశ్నించారు. గత మూడు సమావేశాల నుంచి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నా పట్టించుకోకపోవడంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విద్యుత్‌శాఖపై సమీక్షలో ఎంపీపీ శ్రీనివాసరావు, ఏఈ చంద్రశేఖర్‌ను కరెంట్ సమస్యలపై ప్రశ్నించారు. రూ.1.80కోట్లు మండల నిధుల నుంచి విద్యుత్‌శాఖకు అందచేస్తే అన్ని గ్రామాల్లో పనులు పూర్తిచేయకపోవటంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు.

ఎంపీపీ, వైస్ ఎంపీపీ మధ్య..

వైస్ ఎంపీపీ జూష్టి శ్రీనివాసరావు, పీడతలపూడిలో గృహలు నిర్మించుకున్నవారికి నిదులు రాకపోవటంపై ప్రశ్నించారు. మండలంలో నిధులెన్ని ఉన్నాయని అడగ్గా రూ.20కోట్లు ఉన్నాయని ఎంపీడీవో రాఘవేంద్ర తెలిపారు. ఆరునెలల నుంచి ఈ డబ్బులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు ఎందుకు నిర్వహించలేకపోయారని ఎంపీపీని ప్రశ్నించారు. గత మూడేళ్లలో రూ.40కోట్లతో అన్ని గ్రామాల్లో దాదాపు 850 పనులు నిర్వహించామని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారటం, తదుపరి నెలకొన్న పరిస్థితులు మీకు కూడా తెలుసు కదా అని ఎంపీపీ జవాబిచ్చారు. ప్రజాప్రతినిధులు అంతా కూర్చొని సమన్వయంతో అభివృద్ధి కోసం ఐక్యంగా ముందుకెళ్లటానికి ఎందుకు చొరవ తీసుకోవటం లేదని ఎంపీపీని వైస్ ఎంపీపీ ప్రశ్నించారు. దీనిపై పలుమార్లు అందరి సభ్యులతో కలిసి మీటింగ్ పెట్టామని, దానికి మీరే హాజరు కాలేదని జవాబిచ్చారు. ఈ సమయంలో వాగ్వాదం వ్యక్తిగతంగా వెళ్తున్న సమావేశంలో జడ్పీటీసీ శ్రీనివాసరావు జోక్యం చేసుకున్నారు. అధికార, ప్రతిపక్షాల సభ్యులందరూ ఏకమై ఐక్యంగా మండలాన్ని అభివృద్ధి పథంలో నడుపుదామన్నారు. అనంతరం వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు సమావేశాన్ని నుంచి నిష్క్రమించారు. చివరగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో అధికారులు ప్రజాప్రతినిధుల విషయంలో ప్రోటోకాల్ పాటించాలని కోరారు. ఈ సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంపీడీవోపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి


జడ్పీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు


సంతనూతలపాడులో..

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవోపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని జడ్పీ యూనిట్ సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట శనివారం యూనియన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉన్న ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడి చేయడం దారుణంగా ఉందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్పందించి బాధిత ఉద్యోగిని పరామర్శించడం ఉద్యోగులలో మనోధైర్యాన్ని కల్పించిందని చెప్పారు. మరోసారి ఇటువంటి దాడులు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.సింగయ్య, చల్లా శ్రీనివాసకుమార్, పసుపులేటి శ్రీనివాసరావు, సీతారామారావు, పూర్ణ, పద్మావతి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..


నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపీడీవో జ్యోతి

మద్దిపాడు: ప్రభుత్వ అధికారులపై దాడులు చేయటం అప్రజాస్వామిక చర్యని ఎంపీడీవో వి.జ్యోతి పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై జరిగిన దాడులను ఖండిస్తూ కార్యాలయ సిబ్బంది నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్‌ప్రసాద్, ఈవోఆర్డీ కె.రఘుబాబు, జూనియర్ అసిస్టెంట్ సుగుణరావు, టైపిస్ట్ వినోద్ కుమార్, డి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: గాలివీడు మండలం ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడిని నిరసిస్తూ శనివారం సంతనూతలపాడులో ఎంపీడీవో సురేష్ బాబు ఆధ్వర్యంలో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ప్రజలకు సేవలందించే ఉద్యోగులపై దాడులు చేస్తుంటే ఉద్యోగులు విధులు సక్రమంగా నిర్వహించలేరని, దాడికి కారకులైన వారిని శిక్షించాలని ఆయన చేశారు.

సమాజ అభివృద్ధిలో మహిళలదే కీలకపాత్ర

- నరసం గౌరవాధ్యక్షురాలు అరుణ


ప్రసంగిస్తున్న తేళ్ల అరుణ

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సమాజ అభివృద్ధిలో మహిళా రచయితలది కీలకపాత్ర నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం(నరసం) రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ పేర్కొన్నారు. విజయవాడలో శనివారం ప్రారంభమైన ఆరో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలలో ఆమె మహిళా ప్రతినిధుల సదస్సుకు అధ్యక్షురాలిగా వ్యవహరించారు. సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ సమాజానికి మంచి పౌరులను అందించే బాధ్యత తరతరాలుగా ఒక తల్లిగా మహిళల మీద ఉన్నదన్నారు. ప్రస్తుతం సమాజంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు జరగడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎంతోమంది మహిళలు సాహిత్యరంగంలో కృషిచేస్తున్నారని, వారిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర స్థాయిలో నరసం అన్ని విధాలుగా అండగా ఉంటుందని అరుణ చెప్పారు. సమన్వయకర్తగా ఒంగోలుకు చెందిన కళామిత్ర మండలి జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు, యువకలాల సమ్మేళనానికి సమన్వయకర్తగా వ్యవహరించిన సింహాద్రి జ్యోతిర్మయి, తన్నీరు బాలాజీలు మాట్లాడుతూ రచయితను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రజలు, ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన మిడసల మల్లిఖార్జునరావు, బీరం అరుణ, బండారు సునీత, కందుల మధు, గుంటూరు సత్యనారాయణ, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

కొండపి-పొదిలి రోడ్డుకు తొలగిన అడ్డంకులు

- ట్రాన్స్‌ఫార్మర్ మార్పు
- వేగవంతం కానున్న పనులు

కొండపి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కొండపి నుంచి పొదిలి వెళ్లే ఆర్ అండ్‌బీ రోడ్డు ఉత్తరం వైపు అభివృద్ధి పనులకు అవరోధంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎట్టకేలకు విద్యుత్ అధికారులు తొలగించారు. దీంతో పనులు వేగవంతం కానున్నాయి. స్థానిక పోలీసు స్టేషన్ నుంచి పొదిలి వైపు రోడ్డును ఒక వైపు వెడల్పు చేశారు. రెండో వైపు కూడా చేయాల్సి ఉండగా ఈప్రాంతంలో పోలీస్‌స్టేషన్ వద్ద ఒకటి, ఎస్‌బీఐ వద్ద ఒకటి రెండు ట్రాన్స్‌ఫార్మర్లు అడ్డంగా ఉన్నాయి. ఎస్‌బీఐ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రైవేటు వ్యక్తికి సంబంధించినది కావడంతో ఇప్పటికే అతనికి చెప్పి విద్యుత్ అధికారులు తొలగించారు. పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మార్చడానికి ప్రభుత్వం నుంచి అనుమతి రావడంతో శనివారం దానిని రోడ్డు మార్జిన్‌కు మార్చారు. వైసీపీ హయాంలో వర్షాకాలంలో ఈ రోడ్డుపై నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. కూటమి ప్రభుత్వం రాగానే మంత్రి స్వామి స్వయంగా పర్యవేక్షించి పక్కా ప్రణాళికతో సీసీరోడ్డును నిర్మింపజేశారు. మార్జిన్‌లలోని దుకాణాల వద్ద మెరకలు తొలగించి సైడు కాల్వలు ఏర్పాటు చేయించారు. దీంతో ఎంత వర్షం కురిసినా నీరు సైడు కాల్వల్లోకి వెళ్తోంది. రెండో వైపు కూడా రోడ్డును వెడల్పు చేస్తే ఇబ్బందులు పూర్తిగా తీరనున్నాయి.

సమస్యలను పరిష్కరించకపోతే సమ్మె

- జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని జిల్లా సహకార బ్యాంకు పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 30వతేదీ నుంచి నిరవధిక సమ్మెను చేపట్టాల్సి వస్తోందని జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మనోజ్, రామాంజనేయరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని, జీవోనెంబరు 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. సహకార సంఘాలలో పనిచేస్తున్న ఉద్యోగులందరికి హెల్త్ ఇన్సూరెన్స్ ఏర్పాటు చేయాలని, సీఈవోలకు రూ.50వేలు, మిగిలిన ఉద్యోగులకు రూ.30వేలు వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగులందరికీ డీఎల్‌ఈసీ కమిటీ ద్వారా ఐడీకార్డులను ఇవ్వాలని కోరారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వైసీపీ బలోపేతానికి కృషి చేయాలి

- పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి సురేష్

టంగుటూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సూచించారు. శనివారం సింగరాయకొండలో నిర్వహించిన టంగుటూరు మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరంతరం ప్రజల పక్షాన నిలబడాలను సూచించారు. పార్టీ మండల, గ్రామ కమిటీల ఎన్నికలపై చర్చించారు. నేతలు, కార్యకర్తల అభిప్రాయాలను సేకరించారు. కొందరు తమ అభిప్రాయాన్ని బహిరంగంగా చెప్పేందుకు ఇష్టపడలేదు. దీంతో గ్రామాల వారీగా లోపలికి పిలిపించుకొని సురేష్ కార్యకర్తలతో మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్ష పదవికి ఎక్కువ మంది జమ్ములపాలెంకు చెందిన చింతపల్లి హరిబాబు పేరు సూచించినట్లు సమాచారం. కార్యక్రమంలో నాయకులు బొట్లా రామారావు, రమణారెడ్డి, చింతపల్లి హరిబాబు, పుట్టా వెంకట్రావు, శారీమందిర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు డ్రోన్ బహూకరణ


ఎస్పీ దామోదర్‌కు డ్రోన్‌ను అందజేస్తున్న జయంత్‌బాబు

టంగుటూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు స్థానిక పోలీస్ స్టేషన్‌కు డ్రోన్‌ను బహూకరించారు. బీవీఎల్ ఎక్స్‌పోర్ట్ ప్రైవేటు లిమిటెడ్ తరపున దీన్ని ఆయన శనివారం ఎస్పీ దామోదర్‌కు ఒంగోలులో అందజేశారు. అనంతరం ఆయన్ను ఎస్పీ అభినందిస్తూ షీల్డ్‌ను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోల్‌బాల్ జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ఒంగోలుకు చెందిన ఐకాన్ గ్లోబల్ స్కూలు విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ కె.చిరంజీవి తెలిపారు. శనివారం స్థానిక స్కూలులో ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతున్న నిహాల్ రెడ్డి, తన్మయికృష్ణ, మనురేశ్వంత్, నాగనిహాల్, సీహెచ్.లాహయ్య బి.మొక్షితలు ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 30, 31తేదీల్లో తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటానని తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

సీఐటీయూ నిరసన

సంతనూతలపాడు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌పై కేంద్రహోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు డిమాండ్ చేశారు. మండలంలోని ఎండ్లూరు గ్రామంలో అంబేడ్కర్, జగజ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎలీషా, గిరిరావు, దానియేలు, జక్రయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

క్విస్‌లో ఫార్మసీలో అవగాహన సదస్సు


ప్రసంగిస్తున్న చల్లా రామ్

ఒంగోలు(విద్య), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో 2024-2025 విద్యా సంవత్సరంలో చేరబోయే విద్యార్థులకు స్వాగత కార్యక్రమం శనివారం నిర్వహించారు. డీన్ ఆఫ్ అకడమిక్స్ చల్లా రామ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఫార్మసీ విద్యగురించి, కళాశాలలో సౌకర్యాల గురించి వివరించారు. ప్రిన్సిపాల్ ఎం.కిశోర్‌బాబు ఫార్మసీలో ఉన్న ఉద్యోగ అవకాశాలను చెప్పారు. అనంతరం తల్లిదండ్రులు, విద్యార్థులకు కళాశాలలోని అన్ని సౌకర్యాలు, లాబ్‌లను చూపించి వాటి గురించి వివరించారు. బీఫార్మసీ విద్యార్థులకు క్విస్ విద్యాసంస్థల అధినేత సూర్యకళ్యాణ్ చక్రవర్తి, వైస్‌చైర్మన్ డాక్టర్ శ్రీగాయత్రి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయులకు సత్కారం


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం వీఐపీరోడ్డులోని శ్రీచైతన్య ఒలంపియాడ్ స్కూలులో శనివారం ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బ్రాంచి ప్రిన్సిపాల్ అపర్ణ శిరీష మాట్లాడుతూ గత విద్యా సంవత్సరంలో జరిగిన పదో తరగతి ఫలితాల్లో గరిష్ఠ మార్కులతో పాటు, అత్యధికంగా ఏవరేజ్ సాధించేలా కృషి చేసిన ఉపాధ్యాయులను సత్కరించినట్లు చెప్పారు. ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కృషి చేయడం వల్ల మంచిఫలితాలు వచ్చాయని తెలిపారు. రీజనల్ ఇన్‌చార్జి అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంటే విద్యార్థుల అభివృద్ధికి నిరంతరం శ్రమించే అక్షర కార్మికుడని కొనియాడారు. కార్యక్రమంలో రీజనల్ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, బ్రాంచ్ డీన్ శ్రీనివాసరావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం


మాట్లాడుతున్న ఏపీఎం సుబ్బారావు

మద్దిపాడు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మహిళలను సంఘటితం చేసి వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా మహిళా సమాఖ్య పని చేస్తుందని ఏపీఎం కె.సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం మద్దిపాడులో మహిళా సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల సమాఖ్య నూతన అధ్యక్షురాలుగా పల్లె శ్రావణి, ప్రధాన కార్యదర్శిగా మేకల అంజమ్మ, కోశాధికారిగా మద్దినేని అరుణ, ఉపాధ్యక్షురాలుగా కరిచేటి తేజస్విని ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు.

అవీ..ఇవీ

మెటీరియల్ సిద్ధంగా ఉంచుకోవాలి



వివిధ విభాగాల సిబ్బందితో సమావేశమైన కమిషనర్

గిద్దలూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని వివిధ విభాగాల సిబ్బందితో కమిషనర్ వెంకటదాస్ శనివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తాగునీటి సమస్య ఏర్పడిన సందర్భంలో వాటిని యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేందుకు వీలుగా సంబంధిత మెటీరియల్ లేదని చెబితే కుదరదని, మెటీరియల్ ముందుగానే సిద్ధం చేసుకొని ఆదేశించారు. వీధిలైట్లు కాలిపోయిన వెంటనే కొత్తవాటితో పునరుద్ధరించేందుకు వీలుగా లైట్లు, ఇతర సామగ్రి అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సామగ్రి లేకపోతే తెప్పించుకోవాలని కమిషనర్ వెంకటదాస్ సిబ్బందికి సూచించారు.

ఫ్లెక్సీల తొలగింపు

గిద్దలూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ అనుమతి లేకుండా రోడ్ల వెంబడి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించే కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. తొలుత పొట్టిశ్రీరాములు విగ్రహం కూడలిలో ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసుకున్న వివిధ వ్యాపార సంస్థల ఫ్లెక్సీలను తొలగించారు. పట్టణంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకునే వారు ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. లేకపోతే వాటిని తొలగించడమే కాకుండా ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ వెంకటదాస్ హెచ్చరించారు.

సేవకు సరైన వేదిక జాయింట్ క్లబ్



మాట్లాడుతున్న శ్రీనివాసప్రసాద్

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సేవచేయాలనే సామాజిక దృక్పథం ఉన్నవారికి లయన్స్ క్లబ్ చక్కని వేదిక అని క్లబ్ జోనల్ చైర్మన్ డాక్టర్ పులి శ్రీనివాసప్రసాద్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నూతన లయన్స్‌క్లబ్ ఏర్పాటు సన్నద్ధ సభ నిర్వహిం చారు. ఈ సందర్భంగా శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ.. సేవకు డబ్బే ముఖ్యం కాదని, సేవచేయాలనే తపన ఉంటే చాలు అన్నారు. త్వరలో జిల్లా కేంద్రం కానున్న మార్కాపురంలో లయన్స్ క్లబ్ ఏర్పాటు అవసరం ఉందని కంభం లయన్స్‌క్లబ్ అధ్యక్షులు డా.టీవీ.రామకృష్ణ అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.కాశయ్య, విశ్రాంత బ్యాంకు మేనేజర్ రామకృష్ణ, విశ్రాంత ప్రిన్సిపాల్ రంగయ్య, కంభం లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు మొఘల్ మహబూబ్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ వేగవంతం చేయాలి



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న జడ్పీసీఈవో చిరంజీవి

పొదిలి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సచివాలయాలకు ఆధార్ అనుసంధానం వేగవంతం చేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి చిరంజీవి అన్నారు. శనివారం మండలంలోని ఏలూరు గ్రామ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా 0 నుండి 6 సంవత్సరాల పిల్లలకు ఆధార్ నమోదు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. పిల్లల ఆధార్ అనుసంధానంతో పాటు ఎంప్లాయిస్ సిటీజన్ సేవల సర్వే వివరాలను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. సర్వే ఆధార్ అనుసందాన ప్రక్రియలో అలసత్వం వహించకుండా సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో గుత్తా శోభన్‌బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేను రద్దు చేయాలి

సంతనూతలపాడు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గుమ్మళంపాడు గ్రామంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో గ్రామరైతులు రీసర్వే రద్దు చేసి పాతవిధానాన్ని కొనసాగించాలని తహసీల్దార్ వి.ఆదిలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. 2023లో చేపట్టిన రీసర్వేలో అన్ని తప్పుల తడకలుగా ఉన్నాయని, పాతవిధానాన్ని కొనసాగిస్తే రైతులకు శ్రేయస్కరంగా ఉంటుందని టీడీపీ నాయకులు వివరించారు. రైతుల నుంచి ఐదు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పురోహితులు పిచ్చయ్యశాస్త్రి మృతి



పిచ్చయ్యశాస్త్రి (ఫైల్)

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలో పురోహితులు, వేదపండితులు రెంటచింతల పిచ్చయ్య శాస్త్రి(72) శనివారం మృతిచెందారు. కొంతకాలంగా ఈయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. శనివారం ఆయన తుదిశ్వాస విడిచారు. మార్కాపురంలో ప్రముఖ పురోహితుడిగా, వేదపండితులుగా ఆయన గుర్తింపు పొందారు. ఈయన ఎంతోమంది పేద బ్రాహ్మణులకు, విద్యార్థులను తన ఇంటి వద్దనే భోజన సౌకర్యం కల్పించారు. వేదవిద్యను నేర్పించారు. తన శిష్యులను వేదపండితులు, పురోహితులను తయారు చేశారు. పిచ్చయ్య శాస్త్రి మృతదేహాన్ని పలువురు రాజకీయ నాయకులు, పట్టణ ప్రముఖులు, బ్రహ్మణ సంఘ నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి

- రెడ్డి సంక్షేమ సేవా సంఘం కన్వీనర్ గుంటక సుబ్బారెడ్డి



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల సంక్షేమం కోసం సేవాకార్యక్రమాలు మరింత విస్తృత పరుస్తామని నియోజకవర్గ రెడ్డి సంక్షేమ సేవా సంఘం కన్వీనర్ గుంటక సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక రెడ్డి సంక్షేమ సేవాసంఘం కార్యాలయంలో 2025 సంవత్సరం నూతన క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమసంఘం నాయకులు కందుల బలరాంరెడ్డి, లక్ష్మీరెడ్డి, జీవీ.నారాయణరెడ్డి, చిన్నవెంకటరెడ్డి, కె.రమణారెడ్డి, తిరుమలరెడ్డి రామిరెడ్డి, గుంటక భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ అవినీతి వల్లే విద్యుత్ భారం

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి





మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి, ఎరిక్షన్‌బాబులు

గిద్దలూరు టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి వల్లే రాష్ట్ర ప్రభుత్వంపై విద్యుత్ భారాలు పెరిగాయని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విద్యుత్ బిల్లుల పెంపు పేరుతో రూ.1.29 లక్షల కోట్ల మేర జనంపై భారం మోపాడన్నారు. నేడు నాటి ప్రభుత్వంలో పెంచిన చార్జీలను తగ్గించాలని ధర్నాలు చేయడం ప్రజలను మోసం చేయడమే అన్నారు. జగన్‌రెడ్డి అవినీతి వల్లనే రాష్ట్ర ప్రజలపై అధిక విద్యుత్ భారాలు పడ్డాయన్నారు. 2014లో లోటు విద్యుత్ ఉన్న రాష్ట్రాన్ని 2019నాటి మిగులు విద్యుత్ సాధించారన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో పదిసార్లు విద్యుత్‌భారం మోపారన్నారు. ప్రజలపై విద్యుత్‌భారం మోపిన జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు ధర్నాలు చేయాలని వైసీపీ కేడర్‌కు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జగన్‌రెడ్డి పాలనలో మైలవరం సోలార్ ప్లాంట్‌పై దాడి చేసి ధ్వంసం చేశారన్నారు. చట్టవిరుద్ధంగా పీపీఏలను రద్దు చేశారన్నారు. దీంతో తక్కువరేటుకు వచ్చే 7వేల మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తిని రాష్ట్రం కోల్పోయిందన్నారు. అలా కాకుండా వారిని ప్రోత్సహించి ఉంటే మరో 10వేల మెగావాట్ల ప్లాంటును ఉత్పత్తిలోకి వచ్చేదన్నారు. తద్వారా రాయలసీమ ప్రకాశం జిల్లాలో యువతకు ఉద్యోగాలు రావడమే కాకుండా మిగులు విద్యుత్ రాష్ట్రంలో నేడు ఉండేదన్నారు. విద్యుత్ సంస్థలపై రూ.49వేల కోట్లకు పైగా అప్పు చేసిన నాటి వైసీపీ ప్రభుత్వం ఒక కొత్త విద్యుత్ ప్లాంటును నిర్మించలేదని దుయ్యబట్టారు. నిర్మాణం పూర్తయినప్పటికీ కృష్ణపట్నం వీటీపీఎస్‌లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించలేదన్నారు. సెకీ ఒప్పందంలో జగన్‌రెడ్డి రూ.1750 కోట్లు లంచాలు పుచ్చుకున్నాడని అమెరికా కోర్టులో కేసు నమోదైందన్నారు. సెకీ ఒప్పందం వలన విద్యుత్ సంస్థలపై ఏడాదికి రూ.3850 కోట్లు భారం పడుతోందన్నారు. ఇలా జగన్ విద్యుత్ చార్జీలు పెంచి వారే ధర్నాలు చేయడం ప్రజలను మోసగించడమే అని విమర్శించారు. వైసీపీ నాయకులు కూడా వాస్తవాలు తెలుసుకోవాలన్నారు.

విద్యుత్‌చార్జీల పెంపుభారం వైసీపీదే

ఎర్రగొండపాలెం రూరల్ : గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను కప్పిబుచ్చుకునేందుకు కూటమి ప్రభుత్వంపై నిందలు వేయడం ఏమిటని ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబు మండిపడ్డారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జగన్‌రెడ్డి అవినీతి వలనే రాష్ట్ర ప్రజలపై విద్యుత్‌భారం పడిందన్నారు. 'నువ్వే చార్జీలు పెంచి నువ్వే ధర్నాలు చేయడం చేయించడం ప్రజలను మోసం చేయడం కాదా' అని ప్రశ్నించారు. మిగులు విద్యుత్ పాలన ప్రారంభించి ఇతర రాష్ట్రాల కన్నా ఎక్కువ వనరులున్న రాష్ట్రంలో నేడు జగన్‌రెడ్డి అవినీతి, కక్షసాధింపు విధానాలే కారణమని అన్నారు. ఐదేళ్లలో పదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ. 32 వేల కోట్లు భారం మోపారని అన్నారు. జెన్ కో విద్యుత్ ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తి తగ్గిపోవడానికి విజయసాయిరెడ్డి సర ఫరా చేసిన నాసిరకం బొగ్గు కారణమని అన్నారు. నాణ్యమైన బొగ్గు తగినంత నిల్వ పెటుకోనందుకు విద్యుత్ ఉత్పత్తి తగ్గిందని అన్నారు. విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు, స్మార్ట్ మీటర్లు వంటి విద్యుత్ పరికరాలను కమిషన్ల కోసం అధికరేట్లకు కొనుగోలు చేయడం వలన వేల కోట్ల రూపాయలు నష్టం వచ్చిందని అన్నారు. నేడు రాష్ట్రంలో 20వేల మెగా వాట్ల విద్యుత్ సామర్థ్యం ఉన్న విద్యుత్ ప్లాంట్లు చంద్రబాబు పాలనలో నిర్మించినవే అని గుర్తు చేశారు. అందువలన రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వగలుగు తున్నామని అన్నారు. ప్రజలను మోసం చేసింది, చేస్తున్నది జగన్‌రెడ్డే అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, మాజీ సర్పంచ్ కంచర్ల సత్యనారాయణ గౌడ్, కాశికుంట తాండ సర్పంచ్ ఎంసిహెచ్ మంత్రునాయక్ నాయకులు పాల్గొన్నారు.

కంభం ఏఎంసీ చైర్మన్ పదవిపై సర్వత్రా ఆసక్తి

బేస్తవారపేట మండల వాసులకు ప్రాధాన్యత అని చర్చ



కంభం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

కంభం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కంభం ఏఎంసీ చైర్మన్ ఎన్నికపై ప్రస్తుతం కూటమి నేతల్లో సర్వత్ర ఆసక్తి నెలకొంది. నామినేటెడ్ పోస్టుల ఎంపికలో భాగంగా సంక్రాంతి పండుగ సమయానికి మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ ఎన్నిక ఉంటుందని తెలిసింది. అందులో భాగంగా కంభం వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా ఎవరిని ఎన్నిక చేస్తారనే ఆసక్తి మూడు మండలాల్లో కూటమి నాయకులు ఆశగా ఎదురు చూస్తున్నారు. కంభం వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాలు ఉన్నాయి. ఇప్పటివరకు ఎన్నికైన ఐదుగురు చైర్మన్లు కంభం, అర్ధవీడు మండలాలకు చెందిన వారే ఉన్నారు. దీంతో ఈ సారి ఎలాగైనా బేస్తవారపేట మండలానికి చెందిన వ్యక్తిని చైర్మన్‌గా చేస్తారనే చర్చ జోరుగా సాగుతోంది. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో వ్యవసాయ మార్కెట్ కమిటీల అభివృద్ధికి ఎటువంటి నిధులు మంజూరు చేయకపోవడం, గత మూడు సంవత్సరాలుగా కంభం ఏఎంసీకి చైర్మన్ నియామకం లేకపోవడంపై తీవ్రవిమర్శలు వస్తున్నాయి. 2001-2002 వరకు అర్ధవీడు మండలానికి చెందిన టీడీపీ నాయకులు దండు వెంకటరెడ్డి, 2002-2007 వరకు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే చప్పిడి వెంగయ్యకుమారుడు చప్పిడి రవిశంకర్, 2007-2010 వరకు అర్ధవీడు మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బొగ్గు రామచంద్రారెడ్డి, 2015-2016 వరకు కంభం మండలం జంగంగుంట్లకు చెందిన నెమలిదిన్నె చెన్నారెడ్డి, 2020-2022వరకు కంభం మండలం తురిమెళ్లకు చెందిన వైసీపీ నాయకుడు ఏలం వెంకటేశ్వర్లు మార్కెట్ కమిటీ చైర్మన్లుగా పని చేశారు. 2022 నుండి ఇప్పటివరకు చైర్మన్ ఎన్నిక నిర్వహించలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో బాగంగా మార్కెట్ చైర్మన్‌గా ఎవరిని ఎంపిక చేస్తారో అనే చర్చ జోరుగా సాగుతోంది.

ఉత్తర, పశ్చిమ ద్వారం ఏర్పాట్లు



వేణుగోపాల స్వామి ఆలయంలో ఉత్తరద్వారం ఏర్పాటు చేస్తున్న ఆలయ ధర్మకర్త

తర్లుపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడులో వెలసిన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదినానికి ఉత్తర, పశ్చిమ ద్వారాలను ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులకు ఉత్తర ద్వారా దర్శనం కల్పించేందుకు ఈ ద్వారం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్త జవ్వాజి విజయ్‌భాస్కర్ తెలిపారు. ఉత్తర ద్వారానికి అవసరమైన నిధులను గోపు వెంకటయ్య జ్ఞాపకార్థం ధర్మపత్ని గోపు శ్రీదేవి రూ.3లక్షలను అందజేశారు. పశ్చిమ ద్వార నిర్మాణానికి పెరుమాళ్ల వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం ధర్మపత్ని సరస్వతమ్మ, వీరి కుమారులు బాలమోహన్ రావులు రూ.70116లను అందజేశారు. పలువురు దాతలతో ఉత్తర, పశ్చిమ ద్వారాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్త తెలిపారు. కార్యక్రమంలో సూరెడ్డి రామచంద్రారెడ్డి, జగర్లపూడి రాధాకృష్ణ, దేవిరెడ్డి నరసింహారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

కేసును ఛేదించిన పోలీసులకు రివార్డులు

ప్రోత్సాహకాలు అందజేసిన ఎస్పీ



ఎస్పీ చేతుల మీదగా రివార్డు అందుకుంటున్న ఎస్సై

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్రపుశాల గ్రామంలో ఈ నెల 21న జరిగిన హత్య కేసును ఛేదించిన వైపాలెం పోలీసులకు ఎస్పీ రివార్డులు ప్రకటించారు. వై.పాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రభాకరరావు, ఎస్సై పి. చౌడయ్య, కానిస్టేబుల్స్ పి.బాషావలి, జి.అనిల్ కుమార్‌లను జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ రివార్డులు అందించి సత్కరించారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ నిందుతుడు చెన్నయ్య సొంత పిన్నిని హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రికరించడానికి ప్రయత్నించాడన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అనుమానస్పదంగా ఉందన్న ఆలోచనతో సీఐ సీహెచ్ ప్రభాకరరావు, ఎస్సై పి.చౌడయ్య, కానిస్టేబుల్ పి.బాషావలి, జి. అనిల్ కుమార్‌లు విచారించి త్వరితగతిన కేసును ఛేదించారన్నారు. ఆ ఘటన రోడ్డు ప్రమాదం కాదు హత్య అని నిరూపించి నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినందుకు వారిని అభినందించారు. అనంతరం వారికి జ్ఞాపికలు అందజేసి సత్కరించినట్లు తెలిపారు.

త్రీమెన్ కమిటీ ఏర్పాటుకు నాయకుల అభిప్రాయ సేకరణ



కార్యకర్తలు నాయకులతో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని సొసైటి అధ్యక్షుల త్రీమెన్ కమిటీల ఏర్పాటుకు సంబంధించి నాయకుల అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదు మండలాలలోని నాయకుల అభిప్రాయాన్ని తీసుకున్నారు. ఈ అభిప్రాయాలను పార్టీ రాష్ట్ర కార్యాలయానికి పంపించ నున్నట్లు తెలిపారు. అధిష్టానం నిర్ణయం ప్రకారం త్వరలోనే సొసైటీ త్రీమెన్ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఐదు మండలాల నాయకులు పాల్గొన్నారు.



హాజరైన కార్యకర్తలు

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

- కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్ నాయుడు

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 30న మెగా జాబ్‌మేళ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌నాయుడు శనివారం తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, సిడాప్ సంయుక్తంగా ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 19 సంవత్సరాల నుండి 30 సంవత్సరాల వయస్సు ఉన్న పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం 9553945387, 6302220609లను సంప్రదించాలని ఆయన సూచించారు.

టీడీపీ కేంద్ర కార్యాలయానికి అసమ్మతి నాయకులు

- ఎరిక్షన్‌బాబుపై ఫిర్యాదు చేసేందుకు పయనం

త్రిపురాంతకం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబుపై ఫిర్యాదు చేసేందుకు మండలంలోని పలు గ్రామాల టీడీపీ అసమ్మతి నాయకులు శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయానికి వెళ్లారు. పలు వాహనాలలో 150 మంది కార్యకర్తలతో అసమ్మతి నేతలు వెళ్లారు. కేంద్ర కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలను కలిసి వినతి పత్రం అందజేసినట్లు సమాచారం. కాగా అసమ్మతి అంటూ వెళ్లిన వాళ్ళంతా పార్టీకి పనిచేయని వారేనని, కనీసం పార్టీ సభ్యత్వాలు కూడా లేవని, వైసీపీ కార్యకర్తలను వెంట పెట్టుకుని టీడీపీ అసమ్మతి అని చెప్పుకుంటున్నారని మండల పార్టీ నాయకులు విమర్శించారు.

ఇన్‌చార్జ్‌పై అసత్య ప్రచారాలు మానుకోవాలి

ఎర్రగొండపాలెం రూరల్ : నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కష్టపడుతూ కృషి చేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబుపై అసత్య ప్రచారాలు మానుకోవాలని బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి నలగాటి మల్లికార్జున నాయుడు అన్నారు శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నియోజకవర్గ అభ్యర్థిగా నియమించినప్పటి నుంచి నాయకులతో, కార్యకర్తలతో నిరంతరం అందుబాటులో ఉండి కలిసి కట్టుగా పని చేశారని అన్నారు. అలాంటి వ్యక్తిపై కొంత మంది వెంట ఉంటునే వెన్నుపోటు పొడిచి ఆయన ఓటమికి కారణం అయ్యారని అన్నారు. ప్రస్తుతం నియోజకవర్గ అభివృద్ధి కోసం అధికారులను, రాష్ట్ర నాయకులను కలిసి నిదులు మంజూరు చేయిస్తున్నారని అన్నారు. అలాంటి వ్యక్తిపై అసత్య ప్రచారాలు మానుకోని నియోజకవర్గ అభివృద్ధికి, పార్టీకి తోడ్పాటు అందించాలని ఆయన కోరారు.

నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ

గిద్దలూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చలితీవ్రత ఎక్కువగా ఉండడంతో నిరాశ్రయులకు ఇబ్బంది లేకుండా అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. పట్టణంలోని వివిధ ప్రాంతాలలో ఫుట్‌పాత్‌లపై ఉంటున్న, మరికొందరు నిరాశ్రయులకు దాతల సహకారంతో సమకూర్చిన 60 దుప్పట్లను అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బోసేని వెంకటేశ్వర్లు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షులు అంకయ్య, కార్యదర్శి భూపాల్, కోశాధికారి సుధాకర్, యోగా గురూజీ బి.ఎస్.నారాయణరెడ్డి, దాతలు పాల్గొన్నారు.

వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాముడు

గిద్దలూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం గిద్దలూరు మండలశాఖ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుమ్మా రాముడు నియమితులయ్యారు. నియామక పత్రాన్ని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ వేములపాటి చెన్నయ్య, యూత్ అధ్యక్షులు బోదనబోయిన అరుణ్‌యాదవ్ రాముడికి అందచేశారు. ఈకార్యక్రమంలో పట్టణ బీసీ సంఘం అధ్యక్షులు ఎస్.వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి పి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

3న మండల సర్వసభ్య సమావేశం

కంభం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కంభం మండల సర్వసభ్య సమావేశం జనవరి 3వ తేదీ శుక్రవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వీరభద్రాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ తులసమ్మ అధ్యక్షతన జరిగే సమావేశంలో అన్నిశాఖల అధికారులు సమాచారంతో పాల్గొనాలని తెలిపారు.

మిరప పైరు పరిశీలన



మిరపతోటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి విష్ణుప్రియ

గిద్దలూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం రామాపురం, పలు గ్రామాల పరిధిలో సాగైన మిరప తోటలను ఉద్యాన శాఖాధికారిణి విష్ణుప్రియ పరిశీలించారు. పంటలో తామర పురుగు, తెల్లదోమ ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. పురుగుల నివారణ కోసం ఎకరా పొలంలో 30 నుంచి 40 నీలి, పసుపు రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే టిప్రోనిల్ లేదా స్పైనోసాడ్ మందులను పిచికారి చేసుకోవాలని పేర్కొన్నారు. శిలీంద్రాల వలన వచ్చే ఆకుమచ్చ, కాయమచ్చ, అలాగే కాయకుళ్ళు వ్యాప్తి చెందకుండా పురుగుమందులను వెంటనే పిచికారి చేసుకోవాలని పేర్కొన్నారు. బొబ్బర తెగులు నియంత్రించడానికి సమీకృత తెగులు నివారణ చేపట్టాలన్నారు. డిసెంబరు 31 తేదీలోగా పంటలబీమాకు అవకాశం ఉన్న దృష్ట్యా మిరప రైతులు ఎకరాకు రూ.525 ప్రీమియం చెల్లించాలని ఉద్యానవన శాఖాధికారిణి విష్ణుప్రియ రైతులకు సూచించారు.

కే.ఎస్.పల్లిలో పొలం పిలుస్తోంది

గిద్దలూరు : మండలంలోని కే.ఎస్.పల్లి గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ అధికారులు నిర్వహించారు. రబీసీజన్‌లో పంటలు సాగు చేసిన వారు తప్పనిసరిగా ఈ-క్రాప్ చేయించుకోవాలని సూచించారు. అతివృష్టి, అనావృష్టి సందర్భాలలో పంటలబీమా ఉన్న వారు నష్టపరిహారం పొందవచ్చని పేర్కొన్నారు. గ్రామసభ అనంతరం మొక్కజొన్న, కంది పైర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆ పైర్లకు వచ్చే చీడపీడలు, నివారణ చర్యలను గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏవో విజయభాస్కర్‌రెడ్డి, విస్తరణాధికారులు శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీ సాధనలో డిగ్రీ జవాబు పత్రాల మూల్యాంకనం

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీసాధన డిగ్రీ కళాశాలలో ఆదివారం నుంచి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డిగ్రీ 5వ సెమిస్టర్ పరీక్ష జవాబుపత్రాల మూల్యాంకనం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతుల మధుసుదన్ శనివారం తెలిపారు. క్యాంపు ఆఫీసర్‌గా శ్రీధర్‌కుమార్, వాల్యూయేషన్ ఆఫీసర్‌గా శేషుకుమార్, స్ట్రాంగ్‌రూం ఆఫీసర్‌గా పవన్ కుమార్, టీచర్ అసోసియేట్‌లుగా ప్రసాద్, ఏడుకొండలు వ్యవహరిస్తారన్నారు. నాగార్జున విశ్వవిద్యాలయం పరీక్షల అధికారుల నుంచి ఉత్తర్వులు పొందిన మార్కాపురంతో పాటు గిద్దలూరు, కంభం, బేస్తవారిపేట, కొమరోలు, దోర్నాల, యర్రగొండపాలెం, దర్శి, పొదిలి, కనిగిరి, పామూరు, దొనకొండ డిగ్రీ కళాశాలల ఎగ్జామినర్‌లు ఆదివారం నుంచి, స్క్రుటినైజర్లు సోమవారం నుంచి గుర్తింపు కార్డు, టీచర్ ప్రొఫైల్‌లతో క్యాంపునకు హాజరుకావాలని క్యాంపు ఆఫీసర్ శ్రీధర్ కుమార్ తెలిపారు.

పశుగ్రాస సాగుపై అవగాహన ఉండాలి

- జేడీఏ బేబీరాణి



కూలీలతో మాట్లాడుతున్న జేడీఏ బేబీరాణి

నాగులుప్పలపాడు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పశుపోషకులు బహువార్షిక పశుగ్రాస సాగుపై అవగాహన కలిగిఉండాలని జేడీఏ బేబీరాణి సూచించారు. చేకూరపాడు గ్రామంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఉపాధి పథకం ద్వారా నూరు శాతం సబ్సిడీపై అంది స్తున్న బహువార్షిక పశుగ్రాస విత్తనాలను రైతులకు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ గడ్డి ద్వారా పశువులకు మినరల్స్, విటమిన్లు అందుతాయని, తద్వారా పాల దిగుబడి పెరుగుతుందని తెలిపారు. ఐదు ఎకరాలు కలిగిన ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు అర్హులని తెలిపారు. ఒక్కో రైతు వ్యక్తిగతంగా 10 నుంచి 50 సెంట్ల దాకా బహువార్షిక పశుగ్రాసం సాగుచేసుకోవచ్చని సూచించారు. తగిన ధ్రువపత్రాలతో గ్రామాల్లోని మీసేవా, పశువైద్యకేంద్రాలలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న పశుగణన, గోకులం షెడ్ల నిర్మాణాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి పి.అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.

తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేక కుమారుడు ఆత్మహత్య



దేవిరెడ్డి ప్రకాష్‌రెడ్డి (ఫైల్)

కనిగిరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేక కుమారుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం రాత్రి కనిగిరిలో చోటుచేసుకుంది. పట్టణంలోని పరాశరభారతి స్కూల్ వద్ద నివాసం ఉంటున్న దేవిరెడ్డి ప్రకాష్‌రెడ్డి (37) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి గతేడాది అనారోగ్యంతో మృతిచెందగా, శుక్రవారం తండ్రి మృతి చెందాడు. శుక్రవారం సాయంత్రం తండ్రి అంత్యక్రియలు నిర్వహించాడు. మృతుడికి వివాహం కాలేదు. ఇక తనకెవరూ లేరని మనోవేదన చెందుతూ కనిగిరిలో అద్దెకు ఉంటున్న నివాసంలో ఉరి వేసుకున్నాడు. మృతుడికి ఒక సోదరి ఉంది. తండ్రి మరణంతో కర్నూలు నుంచి వచ్చిన ఆమె సోదరుడు కూడా మృతి చెందటంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తుంది. దీంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుము కున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని విచారిస్తున్నారు.

పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

పామూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీనరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శనివారం ఎంపీటీసీ బొల్లా నరసింహారావు స్టడీ మెటీరియల్ అందజేశారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్వయం కృషి సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్, మాజీ ఎంపీటీసీ ఇర్రి కోటిరెడ్డి, రాచూరి ఏలీయ, హెచ్ఎం సయ్యద్ ఇషాక్, స్కూల్ కమిటీ ఛైర్మన్ బట్టరుశెట్టి శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు ఎస్‌డీ ఖాదర్‌వలి, విద్యార్థులు పాల్గొన్నారు.

పీసీపల్లిలో..

పీసీపల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జనసేన పార్టీ నాయకుడు మాదాసు రమేష్ శనివారం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. యూటీఎఫ్ తయారుచేసిన వీటిని విద్యార్థులకు ఉచితంగా అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు డి.ఆంజనేయులు తెలిపారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి సంజీవి, ఆర్.శ్రీనివాసులు, వేమూరి రామయ్య, చినబ్రహ్మయ్య, సత్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, నేరేడుపల్లి పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సీహెచ్ పద్మావతి శనివారం విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు టి.అంజనీదేవి తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా రోడ్ల నిర్మాణ పనులు

పామూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని పంచాయతీరాజ్ ఎస్ఈ షేక్ మస్తాన్‌వలి తెలిపారు. పామూరు పట్టణంలో సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే ఉగ్ర మంజూరు చేయించిన రూ.5 కోట్ల ఉపాధి నిధులతో 23 రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. మండలంలోని పడమట కట్టకిందపల్లిలో రూ. 45 కోట్లతో సీసీ రోడ్డు, వీరభద్రాపురంలో రూ.47 లక్షలతో తారు రోడ్డు, చిలంకూరులో రూ. 55 లక్షలు, తూర్పుకోడిగుడ్లపాడలో రూ.48 లక్షలతో తారు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నట్లు చెప్పారు.

4లోగా ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైద్యశాఖ పరిధిలోని నేషనల్‌హెల్త్‌మిషన్(ఎన్‌ఎంహెచ్) ద్వారా మార్కాపురంలోని జీజీహెచ్‌లో ఫిజిషియన్, మూడు స్టాఫ్ నర్సుల ఉద్యోగాలకు వచ్చేనెల 4వతేదీలోపు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి టి.వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ జిల్లా వెబ్‌సైట్‌లో అన్ని అంశాలను పరిశీలించి గడువులోగా ఒంగోలులోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో దరఖాస్తులతో పాటు ధృవీకరణ పత్రాల నకలను జతపర్చి స్వయంగా అందజేయాలని ఆయన కోరారు.

క్విస్ ఫార్మసీలో అవగాహన సదస్సు

ఒంగోలు(విద్య), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో 2024-2025 విద్యా సంవత్సరంలో చేరబోయే విద్యార్థులకు స్వాగత కార్యక్రమం శనివారం నిర్వహించారు. డీన్ ఆఫ్ అకడమిక్స్ చల్లా రామ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఫార్మసీ విద్యగురించి, కళాశాలలో సౌకర్యాల గురించి వివరించారు. ప్రిన్సిపాల్ ఎం.కిశోర్‌బాబు మాట్లాడుతూ ఫార్మసీలో ఉన్న ఉద్యోగ అవకాశాలను వివరించారు. అనంతరం తల్లిదండ్రులు, విద్యార్థులకు కళాశాలలోని అన్ని సౌకర్యాలు, లాబ్‌లను చూపించి వాటి గురించి వివరించారు. బీఫార్మసీ విద్యార్థులకు క్విస్ విద్యాసంస్థల అధినేత సూర్యకళ్యాణ్ చక్రవర్తి, వైస్‌ఛైర్మన్ డాక్టర్ శ్రీగాయత్రి శుభాకాంక్షలు తెలిపారు.

మండల సమావేశానికి తహసీల్దార్ గైర్హాజర్

» ప్రజాప్రతినిధుల ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు

తాళ్లూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల సమావేశానికి తహసీల్దార్ గైర్హాజరు కావడంపై ఎంపీపీ, జడ్పీటీసీ, వైస్ఎంపీపీ, పలు గ్రామాల సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ శ్రీనివాసరావు, జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి, తదితరులు మాట్లాడుతూ రీసర్వే జరిగిన గ్రామాల్లో రికార్డులు తప్పుల తడకగా ఉన్నాయన్నారు. దీంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈసమస్యలపై ప్రజాప్రతినిధులకు తహసీల్దార్ నివృత్తి చేయాల్సి ఉండగా, డిప్యూటీ తహసీల్దార్ ఏమి సమాధానం చెబుతారన్నారు. మూడు నెలలకు ఓసారి జరిగే సమావేశానికి రాకుండా తప్పించుకుంటే రెవెన్యూ సంబంధ సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ప్రశ్నించారు. ఎంపీపీ తాటికొండ మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు సమావేశానికి తప్పక రావాలన్నారు. జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజాప్రతినిధుల సహకారంతో అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు జరిగేలా చూడాలన్నారు. గ్రామాల్లో మంచినీరు కలుషితమవుతూ వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. మంచినీటిని క్లోరినేషన్ చేయించాలన్నారు.

వితలాపురం సర్పంచ్ మారం ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ మండలంలో కల్తీ పాలను కట్టడి చేయాలన్నారు. కల్తీపాల వల్ల ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మాట్లాడుతూ కల్తీపాల తయారీ దారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో గతంలో కంటే ఎక్కువ పాలుపోసే పాలఉత్పత్తిదారులపై దృష్టి సారించి తగు విచారణ చేస్తే కల్తీ బట్టబయలు అవుతుందని అన్నారు. నాగంబొట్లపాలెం సర్పంచ్ చిమటా సుబ్బారావు మాట్లాడుతూ అధికారులు పాల డెయిరీలపై దాడులు చేసి కల్తీపాలు తయారీ జరుగుతున్నట్లు నిర్ధారణ జరిగినా ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదన్నారు. పశువైద్యాధికారి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ సభ్యుల విన్నపాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు. మండలానికి రెగ్యులర్ విద్యుత్ ఏఈని నియమించాలని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకవచ్చారు.

సమావేశంలో ఎంపీడీవో సుందరరామయ్య, డిప్యూటీ తహసీల్దార్ ఇమ్మానియేల్‌రాజు, వివిధశాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. కాగా, మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.

గ్రావెల్ అక్రమ తరలింపును అడ్డుకోవాలి



తహసీల్దార్‌కు అర్జీ అందజేస్తున్న వెలుగువారిపాలెం గ్రామస్థులు

తాళ్లూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ముప్పవరం-బెంగుళూరు హైవేరోడ్డు నిర్మాణం కోసం వెలుగువారిపాలెం సమీపానగల సర్వేనంబర్ 489 కొండ నుంచి అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్నారని గ్రామస్థులు పేర్కొన్నారు. గ్రావెల్‌ను అక్రమ తరలింపును అడ్డుకోవాలని కోరారు. ఈమేరకు శనివారం వెలుగువారిపాలెంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ కె.సంజీవరావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతోకాలంగా గ్రామంలో పశువుల, గొర్రెలు, మేకల పెంపకందార్లు కొండకు జీవాలను మేతకు తోలుకుని వెలుతుంటారన్నారు. రోడ్డు నిర్మాణసంస్థవారు ఇష్టానుసారం గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నందున కొండ నామరూపాల్లేకుండా పోతున్నదన్నారు. భవిష్యత్తులో జీవాల మేతకు ఇబ్బందిగా ఉంటుందని చెప్పారు. అక్రమంగా గ్రావెల్ తరలించ కుండా తగు చర్యలు చేపట్టాలని విన్నవిస్తూ వినతిపత్రం అందజేశారు. అదే కొండకు గ్రామంలో ఆరుగురు వ్యక్తులు అక్రమంగా పట్టాలు పొందేందుకు నకిలీ రికార్డులు సృష్టించారని వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. నకిలీ రికార్డులు సృష్టించేందుకు సహకరించిన తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమంగా పట్టాలు పొందినవారిపై కేసులు నమోదు చేయాలని గ్రామస్థులు తహసీల్దార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. కాగా, రెవెన్యూ సమస్యలపై 13 అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్‌వో శివారెడ్డి, శాగం కొండారెడ్డి, ఎం.బ్రహ్మారెడ్డి, సీహెచ్‌వీ నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారం కోసమే

రెవెన్యూ సదస్సులు



ముండ్లమూరులో రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖరరెడ్డి

» మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖరరెడ్డి

ముండ్లమూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించటం వల్ల రైతుల భూ సమస్యలను తక్షణమే పరిష్కరించే అవకాశం ఏర్పడిందని మండల ప్రత్యేక అధికారి చంద్రశేఖరరెడ్డి అన్నారు. శనివారం ముండ్లమూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామ సభల్లో అర్జీలు స్వీకరిస్తున్నట్టు చెప్పారు. ప్రధానంగా రెవెన్యూ రికార్డుల్లో సవరణలు, సరిహద్దుల తప్పులు, 10-1 అడంగుల్లో తప్పులుంటే సవరణలు చేస్తున్నట్టు చెప్పారు. దీర్ఘ కాలికంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్దేశించిన కాల వ్యవధిలో పరిష్కరిస్తున్నట్టు చెప్పారు ఇవికాక గ్రామాల్లో ప్రభుత్వ పథకాలకు అర్హులు ఉంటే ఆయా శాఖల అధికారులకు అర్జీలు సమర్పించాలని కోరారు. అనంతరం గ్రామ సభలో రెవెన్యూ, పింఛన్‌లు, వివిధ సమస్యల కోసం 75 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్, ఆర్ఐ పీఎస్ఆర్ మూర్తి, సీనియర్ అసిస్టెంట్ పి.శేషగిరిరావు, మండల సర్వేయర్ కోటం రాజు, వీఆర్‌వో దయానందం, బి.గురవయ్య, సీహెచ్ బ్రహ్మతేజ, రాఘవరెడ్డి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదిక రెవెన్యూ సదస్సులు

దర్శి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు వేదికలు అయ్యాయని డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని కొత్తపల్లి, లక్ష్మీనారాయణపురం గ్రామాల్లో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన పాల్గొన్నారు.

ఈసందర్భంగా రైతులు భూములకు సంబంధించిన సమస్యలపై అర్జీలు అందజేశారు. భాగపంపిణీ, రికారుల మార్పు, ఆన్‌లైన్ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. సాంకేతికపరమైన సమస్యలు ఉన్న భూవివాదాల పరిష్కారం కోసం ఉన్నతాధికారుల అనుమతి కోసం పంపించారు. కార్యక్రమంలో ఆర్ఐ పరిటాల శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల ద్వారానే సమస్యల పరిష్కారం

పామూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతులకు సంబంధించిన భూ సమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం రైతు సదస్సులను నిర్వహిస్తుందని సింగిల్ విండో మాజీ ఛైర్మన్ బైరెడ్డి జయరామిరెడ్డి అన్నారు. ఈ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని వగ్గంపల్లిలో శనివారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం భూ కబ్జాలు, రికార్డుల టాంపరింగ్, రీసర్వే రైతులకు కష్టాలు తెచ్చి పెట్టిందన్నారు. అలాంటి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఈసందర్భంగా వివిధ సమస్యలపై 27 అర్జీలు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

కార్యక్రమంలో తహసీల్దార్ బీవీ రమణారావు, టీడీపీ నాయకులు యారవ శ్రీనివాసులు, రెక్కల అనిత, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య, ఆర్ఐ బి.మల్లికార్జునరావు, ఎండోమెంట్ ఈవో నరసింహాబాబు, మండల సర్వేయర్ స్నేహ, వీఆర్వో బూదాల కుమార్, పంచాయతి కార్యదర్శి ఇండ్ల హరినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోపై దాడిచేసిన వారిని శిక్షించాలి



నిరసన తెలుపుతున్న పామూరు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది

వీసీపల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవోపై దాడిచేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కనిగిరి యూనిట్ అధ్యక్షుడు షేక్ ఖాజారహ్మద్ బాషా అన్నారు. ఈ సంఘటనపై స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట శనివారం మండల పరిషత్ సిబ్బంది, ఉపాధిహామీ సిబ్బంది నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఖాజారహ్మద్‌బాషా మాట్లాడుతూ ఏదైనా సమస్య ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. అకారణంగా అధికారిపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఉద్యోగులు, ఎంప్లాయీస్ అసోసియేషన్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీడీవోపై దాడికి నిరసన

పామూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవోపై జరిగిన దాడికి ఖండిస్తూ శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది భోజన విరామ సమయంలో నల్ల రిబ్బన్‌లు ధరించి నిరసన తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చేసిన వారిపై కేసులు నమోదు చేసి ఉద్యోగులకు రక్షణ కల్పించాలని ఎంపీడీవో బి.సురేష్ కోరారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి ఎస్.చెన్నకేశవరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, సీఎస్‌పురం మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది కూడా ఎంపీడీవోపై జరిగిన దాడి ఘటనపై నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు.

మూడున్నరేళ్లుగా నిలిచిన ఉపాధి పనులు

» తూర్పుగంగవరంలో కూలీల ఇబ్బందులు

» ఫీల్డ్ అసిస్టెంట్ నియామకంలో మోకాలడ్డు

» నేతల మధ్య ఆధిపత్యపోరుతో ముందుకుసాగని వైనం



తాళ్లూరులోని జాతీయ ఉపాధి హామీ కార్యాలయం

తాళ్లూరు, డిసెంబరు 28(ఆంధ్యజ్యోతి): నేతల మధ్య ఆధిపత్య పోరు కూలీలకు ఇబ్బందులు తెచ్చిపెట్టాయి. మండలంలోని తూర్పుగంగవరం గ్రామంలో టీడీపీ నేతల ఆధిపత్యపోరుతో ఉపాధిఫీల్డ్ అసిస్టెంట్ నియామకం జరగలేదు. దీంతో ఉపాధి పనులు నిలిచిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వంలోనూ ఆధిపత్యపోరుతో మూడేళ్లపాటు పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం రావడంతో కూలీలకు పనులు దొరుకుతాయని ఆశించారు. ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు కావస్తున్నా గ్రామంలో ఫీల్డ్‌అసిస్టెంట్ నియామకం జరగలేదు. అధికార టీడీపీలో ఆధిపత్యపోరుతో ఏకాభిప్రాయం కుదరక ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించలేదు.

తూర్పుగంగవరం గ్రామంలో ఉపాధి పథకం కింద రూ.15 లక్షల సీసీ రోడ్లు, ఎంపీ గ్రాంట్ కింద రూ.15 లక్షలు మంజూరయ్యాయి. అధికార పార్టీ నాయకులు గ్రామసభ తీర్మాణాలు ఇచ్చి పనులు చేపట్టారు. గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద మూడు గోకులం షెడ్లు నిర్మించతలపెట్టారు. ఒక్కో షెడ్‌కు రూ.2లక్షల 30 వేల చొప్పున రూ.6.90 లక్షల నిధుల మంజూరుకు గ్రామసభ తీర్మాణాలు ఇచ్చారు. కూలీలకు పనులు కల్పించేందుకు ఫీల్డ్ అసిస్టెంట్ నియామకానికి మాత్రం చర్యలు తీసుకున్న పాపాన పోలేదని కూ లీలు వాపోతున్నారు. ఆగ్రామంలో దాదాపు 750 మందికి జాబ్‌కార్డులు ఉన్నాయి. ఉపాధి పనులు జరిగితే దాదాపు 350 మందికి పైగా కూలీలు పనులకు వెళతుంటారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా తూర్పుగంగవరం గ్రామంలో ఫీల్డ్‌అసిస్టెంట్ నియామకం జరుగలేదు. దీంతో పేద కూలీలకు ఉపాధిపనులు జరగకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ నేతల మధ్య ఆధిపత్య పోరుతో ఫీల్డ్ అసిస్టెంట్ నియామకం జరగక పోవటం చర్చనీయాంశమైంది. గ్రామ సర్పంచ్ కూడా ఫీల్డ్‌అసిస్టెంట్ నియామకం కోసం పంచాయతీ తీర్మాణం ఇవ్వకపోవటం పలు విమర్శలకు దారితీస్తుంది. ఉపాధి హామీ అధికారులు కూడా ఫీల్డ్‌అసిస్టెంట్ నియామం చేపట్టకుండా మిన్న కుండటంపై అనుమానాలకు తావిస్తుంది. ఇప్పటికైనా స్పందించి తూర్పుగంగవరంలో ఫీల్డ్ అసిస్టెంట్ నియామకం చేపట్టి ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని సి నాగులారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదుగురు షెడ్యూల్ తెగకు చెందిన పేద విద్యార్థులకు స్కూల్ కమిటీ ఛైర్మన్ యర్రగుడ్డి ప్రభాకర్ శనివారం యూనిఫాం అందజేశారు. అలాగే, ప్రతిరోజు కె.అగ్రహారం నుంచి పాఠశాలకు రావడానికి ఐదు నెలలపాటు ఆటో ఖర్చుల కోసం రూ.15 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ భారం పాపం వైసీపీదే!



మాట్లాడుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు చార్జీలు తగ్గించాలని వైసీపీ నాయకులు ఆందోళన చేయటం దొంగే దొంగ అని రాద్ధాంతం చేసినట్లుగా ఉందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ధ్వజమెత్తారు. శనివారం ఆమె నరసరావుపేటలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో 13 సార్లు విద్యుత్తు చార్జీలు పెంచి ప్రజలపై పెనుబారం మోపారని విమర్శించారు. వైసీపీ పాలనలో పెంచిన చార్జీలను తగ్గించాలంటూ వైసీపీ పార్టీ నాయకులు ఆందోళన చేయటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, వైసీపీ నాయకులు ఇదే విధానం కొనసాగిస్తే రానున్న రోజుల్లో ప్రజలే వైసీపీ నాయకులకు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

పెండింగ్ బకాయిలను విడుదలచేయాలి



ఎస్‌టీయూ సభ్యత్వాన్ని అందజేస్తున్న నరసింహారెడ్డి

ముండ్లమూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలు రూ.23 వేల కోట్లను వెంటనే విడుదలచేయాలని ఎస్‌టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి జి.నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. ఎస్‌టీయూ సభ్యత్వ క్యాంపెయిన్‌లో భాగంగా శనివారం మండలంలోని పలు పాఠశాలలను ఆయన సందర్శించారు. ఎస్‌టీయూ సభ్యత్వాన్ని ఉపాధ్యాయులకు అందజేశారు. ఈసందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏ విడుదల చేయాలని, 30 శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలన్నారు. ఏపీజీఎల్ మెచ్యూరిటీ బకాయిలు, పీఎఫ్ లోన్‌లు, సరండర్ లీవ్ బకాయిలు, విశ్రాంత ఉపాధ్యాయల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి వెంగళరెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి నాగయ్య, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ముండ్లమూరు బాధ్యులు సీహెచ్ నాగేశ్వరరావు, పి.వెంకయ్య పాల్గొన్నారు. ఈసందర్భంగా మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.వెంకయ్య, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ నాగేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్‌గా పి.వెంకట్‌ను ఎన్నుకున్నట్టు నరసింహారెడ్డి తెలిపారు.

దోమల నివారణకు ఫాగింగ్

పామూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలతో నీరు నిల్వఉన్న ప్రాంతాల్లో దోమల ఉధృతి ఎక్కువైంది. వీటినివారణ కోసం గ్రామ పంచాయతి ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఫాగింగ్ కార్యక్రమం చేపట్టారు. వారం రోజులపాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పంచాయతి కార్యదర్శి జీవీ అరవింద తెలిపారు. కాగా మురికి కాలువల్లో పేరుకొనిపోయిన మురికిని కూడా పారిశుధ్య కార్మికుల ద్వారా తొలగిస్తున్నట్లు తెలిపారు. ఇళ్లలోని చెత్త చెదారాన్ని కాలువల్లో పడవేయకుండా రిక్షాల్లో వేయాలని కోరారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ రుతూజాపాటిల్

కనిగిరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తుంది. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో జననీ చారిటబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ శిబిరంలో వంద మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. వారిలో 40 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు.

అలాగే, గత నెల 21న నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారికి శంకర కంటి వైద్య నిపుణులు పరీక్షలు చేసి మందులు అందచేశారు. శనివారం నిర్వహించిన పరీక్షల్లో కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి ఆదివారం ప్రత్యేక వాహనంలో పెదకాకానిలోని కంటి వైద్య శిబిరానికి పంపించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ ప్రత్యేక వాహనాలు ఏర్పాటుచేశారు. ఈ శిబిరంలో వైద్యనిపుణులు రుతూజాపాటిల్ పరీక్షలు నిర్వహించారు.

వృత్తి విద్యలో నైపుణ్యం సాధించాలి

కనిగిరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): యువతీయువకులు వృత్తి విద్యలో నైపుణ్యం సాధించాలని మున్సిపల్ కమిషనర్ జోసఫ్ దానియేలు అన్నారు. ఈనెల 30న పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా ప్లంబరు, కార్పెంటర్లు, ఎలక్ట్రిషియన్‌లు, ఏసీ, రిఫ్రిజిరేటర్‌లు, టీవీ, వాషింగ్‌మిషన్‌ల రిపేరులో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు.

అలాగే, యువతులకు బ్యూటీషియన్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లాంటి చేతి వృత్తులలో శిక్షణ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ఎన్ఎస్‌డీసీ ద్వారా సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. ఆసక్తి గల్గిన యువతీ యువకులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తివివరాలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఆసక్తి కల్గినవారు ఆధార్, రేషన్, బ్యాంక్, పాన్ కార్డు జిరాక్స్‌లను జతచేసి కార్యాలయంలో అందజేయాలని కోరారు.

సమస్యలను పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని జిల్లా సహకార బ్యాంకు పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 30వతేదీ నుంచి నిరవధిక సమ్మెను చేపట్టాల్సి వస్తుందని జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మనోజ్, రామాంజనేయరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని, జీవోనెంబరు 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. సహకార సంఘాలలో పనిచేస్తున్న ఉద్యోగలందరికి హెల్త్ ఇన్సూరెన్స్ ఏర్పాటు చేయాలని, సీఈవోలకు రూ.50వేలు, మిగిలిన ఉద్యోగులకు రూ.30వేలు వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగులందరికీ డీఎల్ఈసీ కమిటీ ద్వారా ఐడీకార్డులను ఇవ్వాలని కోరారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

సమాజాభివృద్ధిలో మహిళలదే కీలకపాత్ర

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సమాజ అభివృద్ధిలో మహిళా రచయితలది కీలకపాత్ర అని నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం(నరసం) రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ పేర్కొన్నారు. విజయవాడలో శనివారం ప్రారంభమైన ఆరో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలలో ఆమె మహిళా ప్రతినిధుల సదస్సుకు అధ్యక్షురాలిగా వ్యవహరించారు. సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ సదస్సును ప్రారంభించారు. అరుణ మాట్లాడుతూ సమాజానికి మంచి పౌరులను అందించే బాధ్యత తరతరాలుగా ఒక తల్లిగా మహిళల మీద ఉన్నదన్నారు. ప్రస్తుతం సమాజంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు జరగడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎంతోమంది మహిళలు సాహిత్యరంగంలో కృషిచేస్తున్నారని, వారిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర స్థాయిలో నరసం అన్ని విధాలుగా అండగా ఉంటుందని అరుణ చెప్పారు. సమన్వయకర్తగా ఒంగోలుకు చెందిన కళామిత్ర మండలి జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు, యువకలాల సమ్మేళనానికి సమన్వయకర్తగా వ్యవహరించిన సింహాద్రి జ్యోతిర్మయి, తన్నీరు బాలాజీలు మాట్లాడుతూ రచయితను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రజలు, ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో మిడసల మల్లికార్జునరావు, బీరం అరుణ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
ఆదివారం 29 డిసెంబరు 2024



సూర్యలంక సముద్రతీరం


కోటి ఆశలతో.. కొత్త ఏడాదిలోకి

- రెండున్నరేళ్లు గడిచినా గాడిలో పడని పాలన
- జిల్లా ఆవిర్భావం తర్వాత రెండు ఏడాదులు పూర్తి
- జిల్లా ఏర్పాటుతో సరి.. వసతులు మరిచిన గత ప్రభుత్వం
- 2025లో జిల్లాకు సరికొత్త వెలుగులపై జిల్లావాసుల ఆశలు

నూతనంగా జిల్లా ఏర్పాటు చేస్తున్నాం.. ఇకపై అభివృద్ధి దిశగా పరుగే పరుగు.. బాపట్ల, చీరాల జంట నగరాలుగా పురోగమన బాట పడతాయి.. ఉద్యోగులకు వసతులతో పాటు సమీకృత కలెక్టరేట్ నిర్మాణం చేస్తాం.. ఇలా వైసీపీ పాలకులు అరచేతిలో వైకుంఠం చూపించారు. 2022 ఏప్రిల్‌లో జిల్లా ఏర్పాటు జరిగితే కాలగమనంలో రెండు ఏడాదులు ముగియగా.. 2025 నూతన సంవ త్సరంతో మూడో ఏడాదిలోకి అడుగుపెడుతోంది. కానీ నాటి పాలకులు చెప్పిన ఏ ఒక్కహామీ అమలుకు నోచుకోకపోగా అనేక బాలారిష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. కనీసం జిల్లా కేంద్రంలో ఏర్పాటైన కార్యాలయాల్లో మౌలిక వసతుల కల్పనపై కూడా గత ప్రభుత్వం దృష్టి సారించలేదు. జిల్లా ఏర్పాటుతో చేతులు దులుపుకుందే తప్ప జిల్లాకు కావాల్సిన హంగులు సమకూర్చడంలో పూర్తిగా వైఫల్యం చెందింది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో జిల్లా ఏర్పాటు నుంచి ఉన్న అనేక ఇక్కట్లకు తెరపడనుందని ప్రజలు ఆశిస్తున్నారు. త్వరలోనే 2025 లోకి అడుగు పెట్టనుండడంతో ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టబోతున్న తరుణంలో జిల్లా ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు అవలోకనం..

కలెక్టర్ కార్యాలయం


ఓ కళాశాల భవనంలో కొనసాగుతున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కార్యాలయం


(బాపట్ల,ఆంధ్రజ్యోతి)

రెండున్నరేళ్ల గడిచినా.. జిల్లాలో పరిపాలన ఇంకా గాడిలో పడలేదు. బాపట్ల కేంద్రంగా పూర్తిస్థాయిలో కార్యకలాపాలు జరగడం లేదు. కార్యాలయాల్లో కనీస వసతులు లేక ఉద్యోగులు ఇక్కట్లు పడుతున్నారు. జిల్లా ఏర్పాటు ద్వారా పర్యాటక రంగంలో కొత్త రికార్డులు సాధ్యమవుతాయని చెప్పిన నాటి పాలకులు ఆ విషయాన్నే మరిచారు. మొత్తం మీద జిల్లా ఏర్పాటుతో గత ప్రభుత్వం చేతులు దులుపుకుందే తప్ప జిల్లాకు కావాల్సిన హంగులు సమకూర్చడంలో పూర్తిగా వైఫల్యం చెందింది. జిల్లా ఏర్పాటు సమయంలో నాటి పాలకులు చెప్పిన ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోకపోగా అనేక బాలారిష్టాలు ఏళ్ల తరబడి జిల్లాను వెంటాడుతూనే ఉన్నాయి. జిల్లా ఏర్పాటు తర్వాత రెండు కొత్త సంవత్సరాలను జిల్లావాసులు చూశారు. ఎప్పటికప్పుడు జిల్లాకు మహర్దశ పడుతుందని ఎదురుచూడడం తప్పితే పాలకుల వైపు నుంచి కనీస చలనం లేకుండా రెండు నూతన సంవత్సరాలు ఆశల పల్లకిలోనే గతించిపోయాయి. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో జిల్లా ఏర్పాటు నుంచి ఉన్న అనేక ఇక్కట్లకు తెరపడనుందని ప్రజలు ఆశిస్తున్నారు. ఈ క్రమంలోనే త్వరలోనే 2025లోకి అడుగు పెట్టనుండడం, జిల్లా ముచ్చటగా మూడో ఏడాదిలోకి ప్రవేశిస్తుండడంతో ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి ప్రస్తావించిన పలు అంశాల్లో 2025లో పురోగతి కనబడాలని చంద్రబాబు ఆదేశించారు. ఆ కార్యక్రమాలకు సంబంధించి ఇప్పటికే కలెక్టర్ సంబంధిత విభాగాల అధికారులకు దిశానిర్దేశం చేశారు. వీటన్నింటి కార్యక్షేత్రంగా 2025 ఏడాదే ఉండనుండడం ఆశలకు ఊతమిస్తోంది.

2022 ఏప్రిల్ 4న జిల్లా ఆవిర్భావం..

బాపట్ల కేంద్రంగా 2022 ఏప్రిల్ 4న కొత్తగా జిల్లా ఏర్పడిన సంగతి తెలిసిందే. జిల్లా ఏర్పాటుతో తీరప్రాంతాలకు మహర్దశ పట్టనుందని ప్రజలు ఆశించారు. కానీ అలాంటిదేమి జరగకుండానే 2023-24 సంవత్సరాలు గడిచిపోయాయి. నూతన సంవత్సరంలోకి అడిగిడబోతున్న ప్రతిసారి జిల్లా ఏర్పాటు లక్ష్యాలను నెరవేర్చేలా పాలకులు అడుగులుంటాయని ప్రజలు ఆశపడడం, వారికి నిరాశే మిగలడం పరిపాటిగా మారింది.

సమీకృత కలెక్టరేట్ నిర్మాణం దిశగా అడుగులు...

జిల్లా ఏర్పాటు చేసిన ఆరు నెలల్లోనే సమీకృత కలెక్టరేట్ నిర్మాణం చేపడతామంటూ వైసీపీ చెప్పింది. ఆచరణలోకి రాకపోగా చాలా ప్రభుత్వ కార్యాలయాలకు ఇప్పటికీ అద్దె భవనాలే దిక్కయ్యాయి. ఇక పలు విభాగాల్లో ఉండాల్సిన నిష్పత్తిలో సిబ్బంది లేకపోవడంతో పనుల్లో వేగం లోపించింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక వీటిపై దృష్టి పెట్టింది. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా సమీకృత కలెక్టరేట్ నిర్మాణం కోసం రెండు మూడు స్థలాలను బాపట్ల సమీపంలో పరిశీలించారు. కొత్త ఏడాదిలో ఇందుకు సంబంధించి గ్రీన్‌సిగ్నల్ రానుంది. ఇక ఆయా కార్యాలయల్లో సిబ్బంది కొరతపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. దాదాపు 22 విభాగాలకు సంబంధించి 750 మంది సిబ్బంది కావాల్సి ఉంటుందనే వినతులు ప్రభుత్వానికి వెళ్లాయి. వీటికి కూడా కొత్త ఏడాదిలోనే మోక్షం లభించనుంది. ఇటీవల వరకు కలెక్టరేట్ ప్రాంగణంలో రోడ్డే సరిగా లేవు. అలాంటిది ఇప్పుడు సర్వాంగ సుందరంగా కలెక్టరేట్ అంతర్గత రోడ్లు కనిపిస్తున్నాయి.

నిధుల ఊసే లేదు...

జిల్లాను ఏర్పాటుచేశారే తప్ప గత ప్రభుత్వం ఒక్క రూపాయి కేటాయించలేదు. చివరికి కార్యాలయాల్లో స్టేషనరీకి కూడా వెతుక్కోవాల్సిన దుస్థితి. వాటికి స్వస్తిపలికేలా జిల్లా కార్యాలయాల నిర్వహణ కోసం నూతన సంవత్సరంలో నిధులు కేటాయించి వాటి మంజూరుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. గత ప్రభుత్వ పెండింగ్ బిల్లులను క్లియర్‌చేసే కసరత్తు చేస్తున్నారు.

అక్రమార్కుల భరతం పట్టేలా....

జిల్లా ఏర్పాటుతో పాలన సరళతరం సంగతి దేవుడెరుగు కానీ వైసీపీ నేతల దోపిడీకి వికేంద్రీకరణ బాగా ఉపయోగపడిందనడంలో ఎటువంటి సం దేహం లేదనేది ప్రజల అభిప్రాయం. భూ ములు మొదలుకుని సహజవనరుల దోపి డీ వరకు ఆకాశమే హద్దుగా వైసీపీ నేతల తోపాటు వారి అనుచరగణం చెలరేగిపోయాయి. ఇసుక, భూములు, రేషన్ ఈ మూడింటిలోనే జిల్లావ్యాప్తంగా దాదాపు 500కోట్ల వరకు వైసీపీ నేతలు దోపిడీకి పాల్పడ్డారని అంచనా. ఇప్పటికే ప్రభుత్వానికి అందిన రిపోర్టుల ఆధారంగా 2025 ను అక్రమార్కుల భరతం పట్టే ఏడాదిగా అభివర్ణించడంతో పాటు దోపిడీ వికేంద్రీకరణ కాకుండా పాలన సరళతరం చేసేలా కూటమి ప్రభుత్వం అడుగులు వేయనుంది.

సాంకేతిక చిక్కులకూ స్వస్తి..

జిల్లా ఏర్పాటు సమయంలో సాంకేతికంగా సరైన ప్రక్రియ పాటించలేదు. ఇప్పటికీ జిల్లా అధికారుల పోస్టింగ్ విషయంలో కేటాయింపులు తక్కువగా ఉన్నాయి. జిల్లా అధికారుల పోస్టులను నోటిపై చేయకపోవడంతో ఖాతాల విభజన కూడా జరపలేదు. ఆదరాబాదరాగా జిల్లా ఏర్పాటుతో రెండేళ్ల నుంచి అనేక ఇక్కట్లు వెంటాడుతున్నాయి. కూటమి ప్రభుత్వంలో వీటిని సరిదిద్దే దిశగా ఇప్పటికే చర్యలు మొదలుపెట్టింది. జిల్లా ఏర్పడినప్పటి నుంచి మెప్మా విభాగం పాలనను గుంటూరు జిల్లా అధికారే ఇన్‌చార్జిగా వ్యవహరించే వారు. అలాంటిది ఇటీవల ప్రభుత్వం నియమించిన డిప్యూటీ కలెక్టర్ల పోస్టింగ్‌లలో మెప్మా జిల్లా విభాగానికి అధికారిని నియమించారు. దాదాపు పన్నెండు విభాగాలకు ఇన్‌చార్జిల పాలనే సాగుతోంది. కొత్త సంవత్సరంలో వీటన్నింటికి తెరపడడంతో పాటు అన్ని విభాగాలకు పూర్తిస్థాయిలో అధికారులను నియమించే ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. సాంకేతికపరమైన చిక్కులకు 2025లోనే పరిష్కారం లభించేలా చర్యలు చేపట్టింది.

సూర్యలంక అభివృద్ధికి ప్రత్యేక నిధులు...

బాపట్ల జిల్లాగా ఏర్పాటైన సమయంలో అందరి దృష్టి పర్యాటక రంగంపైనే ఉంది. జిల్లాలో దాదాపు 72 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం ఉండడంతో ఆతిథ్య రంగాన్ని కొత్త పుంతలు తొక్కించడానికి జిల్లా ఏర్పాటు ఇతోధికంగా తోడ్పడుతుందని అందరూ భావించారు. కానీ అలాంటిదేమి జరగకపోగా తిరోగమన బాట పట్టించిన ఘనత గత ప్రభుత్వానిది. పర్యాటక రంగానికి ఊతమిచ్చే దిశలో ఇప్పటికే కూటమి ప్రభుత్వంలో అడుగులుపడ్డాయి. సూర్యలంక బీచ్‌లో మెరుగైన వసతుల కల్పనకు కేంద్రం దాదాపు వంద కోట్ల నిధులు ఇవ్వడానికి పచ్చజెండా ఊపందని సమాచారం. ఈ నిధులను సూర్యలంక బీచ్ అభివృద్ధికి పారదర్శకంగా వెచ్చించ గలిగితే 2025 ఏడాది పర్యాటక రంగానికి మహర్దశగా చెప్పవచ్చు.

సమాజం బాగుంటేనే సంతోషం

- సంపాదన కన్నా సమాజహితానికి ప్రాధాన్యమివ్వాలి
- ఆధునిక కోర్సులతో పాటు సంప్రదాయ కోర్సులను ప్రవేశపెట్టాలి
- సోషల్ మీడియా కార్యకలాపాలు మాతృభాషలో సాగించాలి
- వర్సిటీ పూర్వ విద్యార్థుల సంఘ సమావేశంలో జస్టిస్ ఎన్.వి.రమణ

పెదకాకాని, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సమాజం సంతోషంగా ఉంటే మనం కూడా బాగుంటామని.. ఆనందమయ జీవితాన్ని గడుపుతామని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ అభిప్రాయపడ్డారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థుల సంఘ సమావేశం వర్సిటీలోని డైక్‌మన్ ఆడిటోరి యంలో శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ రమణ మాట్లాడుతూ సమా జంలో అల్లర్లు, గొడవలు, కొట్లాటలు ఉంటే మనం సుఖమైన జీవితాన్ని గడపలేమన్నారు. ధన సం పాదన ముఖ్యమైనా దానికన్నా సమాజ హితానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మాతృ భాషకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మనలోని భావాలను మాతృ భాష ద్వారా వ్యక్తపరిస్తే అందులో కనిపించే భావోద్వేగం సరైన క్రమంలో చెప్పగలుగుతామన్నారు. నేటి రోజుల్లో అధికంగా వినియోగిస్తున్న సోషల్ మీడియా ద్వారా కూడా మన మాతృభాషలోనే కార్యకలాపాలు సాగిస్తే మాతృభాషకు పూర్వవైభవం తీసుకువస్తామన్నారు. దేశ విదేశాల్లో ఎక్కడ ఉన్నా మాతృ భాషను మరువరాదన్నారు. మాతృభాషతోపాటు ఇతర భాషలను కూడా అభిమానించాలని చెప్పారు. కోర్సులు పూర్తి కాగానే విద్యార్థులు ఉద్యోగాలతో బయటకు వెళ్లాలనే ఆలోచనతో ఇంజనీరింగ్ టెక్నాలజీ, ఫార్మసీ వంటి ఆధునిక కోర్సుల అభివృద్ధి వైపు వర్సిటీలు ఉన్నాయన్నారు. ఆధునిక కోర్సులతో పాటు సంప్రదాయ కోర్సులు కూడా ఎంతో ముఖ్యమన్నారు. అందులో తెలుగు, సంస్కృతం, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ వంటి సంప్రదాయ కోర్సులపై దృష్టి సారించాలని సూచించారు. తాము చదువుకునే రోజుల్లో అల్లర్లతో కూడిన ఆటపాటలు ఉన్నాయి కానీ ర్యాగింగ్ లేదన్నారు. రేకుల షెడ్లలో నాడు తరగతులు జరిగేవని, ఇప్పుడు విద్యార్థులకు అన్ని వసతులు ఉన్నాయన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు ఉండాలని ఆ నాయకత్వ లక్షణాలు వ్యక్తిగత హోదాని వ్యక్తిత్వాన్ని పెంపొందించేలా ఉండాల న్నారు. ఆ లక్షణాలు ఇతరులపై, ఇతర వ్యాపకా లపై ఉండకూడదని సూచించారు. విద్యార్థి నాయకులుగా విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తాము ఎక్కువ సమయం కేటాయించినట్లు గుర్తుచేసుకున్నారు. అధ్యాపకులు తమతోస్నేహంగా సోదరభావంతో ఉండే వారన్నారు. విద్యార్థి జీవితం ఎంతో మధురమైందని వివరిం చారు. విద్యార్థులు తమ ముందున్న లక్ష్యాలను నెరవేర్చుకునే క్రమంలో కృషి, పట్టుదల, అంకిత భావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. వృత్తి పట్ల నిబద్ధత ఉంటే ఏ రంగంలోనైనా రాణించవ చ్చన్నారు. ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే.గంగాధరరావు మాట్లాడుతూ వర్సిటీ అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల సహకారం మరువలేనిదన్నారు. ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, ఇన్‌చార్జి రిజి స్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, పూర్వ విద్యార్థుల సంఘం డైరెక్టర్ ఆచార్య జీవీఎస్ఆర్. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



జస్టిస్ ఎన్.వి.రమణను సత్కరిస్తున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు తదితరులు

షెడ్యూల్ కులాల కులగణనపై

సామాజిక తనిఖీ

- కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 31వ తేదీ వరకు షెడ్యూల్ కులాల కులగణనపై సామాజిక తనిఖీ నిర్వహించి అభ్యంతరాలు స్వీకరిస్తామని కలెక్టర్ జె.వెంకటమురళి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ కులాల కులగణన వివరాలను గ్రామ, వార్డు సచివాలయాలలో ప్రదర్శించామని, వీటిపై వచ్చే అభ్యంతరాలను జనవరి 6వ తేదీ వరకు క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తామన్నారు. కులగణన తుది వివరాలను వచ్చే నెల 10న సచివాలయాలలో ప్రదర్శిస్తామని తెలిపారు. కులగణనపై వచ్చిన అభ్యంతరాలు, గ్రీవెన్స్ మూడు దశలలో తనిఖీలు ఉంటాయన్నారు. పౌరులు నుంచి వచ్చే అభ్యంతరాలను వీఆర్వో క్షేత్ర స్థాయిలో వాస్తవాలను పరిశీలించి ఆర్ఐకు నివేదిస్తారన్నారు. వీటిని ఆర్ఐ పరిశీలించి తహసీల్దార్‌కు సమర్పిస్తారన్నారు. అనంతరం తహసీల్దార్, వీఆర్వో, ఆర్ఐ నివేదికలలోని వివరాలను పరిశీలించి తుది ఆమోదం తెలిపి వివరాలు భద్రపరుస్తామని తెలిపారు. ఈ వివరాలలో ఖచ్చితత్వాన్ని పెంపొందించేందుకు సాంఘిక సంక్షేమాధికారులతో 50మంది వివరాలను తనిఖీ చేస్తారని, సామాజిక తనిఖీ విధానాన్ని కలెక్టర్, ఆర్డీవోలు, ప్రత్యేకాధికారులు పర్యవేక్షిస్తారని ఆయన తెలిపారు.

రికార్డుల లోపాలపై సమగ్ర విచారణ


సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పొన్నూరు టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతులకు సంబంధించి రెవెన్యూ రికార్డులలో ఉన్న లోపాలను సరిచేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ తెలిపారు. 'ఆంధ్రజ్యోతి' పత్రికలో వచ్చిన కథనం నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ శనివారం పొన్నూరు తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ రెవెన్యూ రికార్డులో రైతుల పేర్లు ఉండాల్సిన స్థానంలో ఇతరుల పేర్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. అయితే, గతంలో పనిచేసిన అధికారులు ఆ వివరాలను నమోదు చేసినట్లు చెప్పారు. ఈ వివరాలను సరిచేసేందుకు ఐదుగురు సభ్యులతో కూడిన ఐదు రెవెన్యూ బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ బృందం రైతుల వద్దకు వెళ్లి ఆ సర్వే నంబర్‌లో ఉన్న రైతుల వివరాలను సర్వే చేయడంతోపాటు పూర్తి వివరాలను సేకరించి, అర్హులైన రైతుల వివరాలను రికార్డులలో నమోదు చేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ భూమి ఉంటే ప్రభుత్వం అని, దేవాదాయ శాఖ భూమి ఉంటే దేవాదాయ శాఖ భూమి అని రికార్డులను సరి చేయనున్నట్లు చెప్పారు. రైతులు కూడా తమ వివరాలను సర్వే అధికారులకు అందజేయాలని అన్నారు. పూర్తి విచారణ జరిపి రికార్డులలో లోపాలు సరిచేసేందుకు జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ జియావుల్ హక్, డిప్యూటీ తహసీల్దార్ రాజా రమేష్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గింది.. తప్పులున్నాయి

- భూ సమస్యలపై అర్జీల వెల్లువ
- 12,347 అర్జీల్లో ఇప్పటికి 976 పరిష్కారం
- మూడు జిల్లాలు.. 660 రెవెన్యూ సదస్సులు
- సమస్యల పరిష్కారంపై అధికారుల్లో తాత్సారం
- నీరుగారి పోతోన్న కూటమి ప్రభుత్వ ఉన్నతాశయం



బొల్లాపల్లి : గండిగనుమలలో రెవెన్యూ సదస్సులో రైతులతో అధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

విస్తీర్ణం తగ్గింది.. సరిహద్దుల్లో తేడాలున్నాయి.. సర్వే నెంబర్లల్లో అయోమయం.. ఆన్‌లైన్‌లో తప్పులు.. ఏ ప్రాంతంలో చూసినా భూ వివాదాలే.. ఇలాంటి భూ సమస్యలపై యజమానులు అర్జీలతో రెవెన్యూ కార్యాలయాలు, గ్రామసభలకు బారులు తీరుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతో మరింతగా పెరిగిన భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది. అయితే సదస్సుల లక్ష్యం అంతగా నెరవేరడంలేదని పరిష్కారమైన అర్జీలను చూస్తే తెలుస్తోంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో ఇప్పటి వరకు నిర్వహించిన సదస్సుల్లో బాధితులు 12,347 అర్జీలను అందజేశారు. వీటిలో 976 అర్జీలను మాత్రమే అధికారులు పరిష్కరించగలిగారు. భూ సమస్యల పరిష్కారం నామమాత్రంగా కూడా లేదన్న అభిప్రాయం బాధితుల్లో ఉంది. దీంతో ప్రభుత్వ లక్ష్యాలు నీరుగారిపోయే ప్రమాదం ఉంది. గత వైసీపీ ప్రభుత్వం ప్రచారార్భాటంతో అమలు చేసిన శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేసింది. క్షేత్రస్థాయిలో హడావుడిగా భూముల రీసర్వే చేసి గందరగోళం సృష్టించడమే కాకుండా రైతులను సమస్యల సుడిగుండంలోకి నెట్టివేసింది. భూ విస్తీర్ణంలో వ్యత్యాసాలు, పొలాల సరిహద్దుల్లో తేడాలు, సర్వే నెంబర్లల్లో అయోమయం, పేర్లు తారుమారుతో రైతుల మధ్య గొడవలతో అల్లాడిపోతున్నారు. ఆయా తప్పులను సరిదిద్దడంపై గత వైసీపీ ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ చూపలేదు. ప్రచార యావతో రైతులకు అందజేసిన భూహక్కు పత్రాలు సరిహద్దు రాళ్లపై అప్పటి సీఎం జగన్ ఫొటోలు, పార్టీ రంగులు పేర్లు వేసుకోవడానికే అత్యధిక ప్రాధాన్యమిచ్చిన తీరు తీవ్ర విమర్శలకు దారితీసింది. వీటికి చెక్ పెట్టడానికి కూటమి ప్రభు త్వం నిర్మాణాత్మక చర్యలకు పూనుకుంది. అధికారం చేపట్టిన వెంటనే కూటమి ప్రభుత్వం భూముల రీ సర్వే ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేసింది. తప్పులను సరిదిద్దడానికి తొలి ప్రాధాన్యమిచ్చింది. ప్రత్యేకంగా రీ సర్వే జరిగిన గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించింది. ఈ సందర్భంగా స్వీకరించిన వేలాది అర్జీలు పరిష్కారానికి నోచుకోలేదన డానికి అధికారుల లెక్కలే నిదర్శనం. ఈ పరిస్థితుల్లో గత కొన్ని రోజులుగా మళ్లీ గ్రామాల పరిధిలో రెవెన్యూ సదస్సులను అధికారులు నిర్వహిస్తున్నారు. వీటిలో బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నారు. మూడు జిల్లాల వ్యాప్తంగా 660 రెవెన్యూ గ్రామాల్లో

(మిగతా 6వ పేజీలో)

ఎక్స్‌కవేటర్ ఎవరిది?

- ఆధిపత్య పోరా.. వ్యక్తిగత కక్షలతో తగలబెట్టారా?
- పొరుగు నియోజకవర్గ ఎమ్మెల్యే సమీప బంధువు స్నేహితుడి ఇసుక దందా
- ఇసుక తవ్వకాలతో చెరువులను తలపిస్తున్న బోయినవారిపాలెం భూములు

చీరాల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చీరాల మండలం బోయినవారిపాలెం పరిధిలో టీపీ స్కీమ్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున తగలబడిన ఎక్స్‌కవేటర్ తనదని, ఈపూరుపాలేనికి చెందిన రామకృష్ణ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే సదరు ఎక్స్‌కవేటర్ రామకృష్ణది అనేందుకు అతడి వద్ద ఎలాంటి ధ్రువపత్రాలు లేవు. ఈ విషయం పోలీస్ విచారణలో వెల్లడయింది. అక్రమార్కుల మధ్య ఆధిపత్య పోరా లేదా వ్యక్తిగత కక్షల నేపథ్యమా అనేది తెలియాల్సి ఉంది. బోయినవారిపాలెం పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాలో రామకృష్ణ ఎప్పటి నుంచో ఉన్నాడని గ్రామస్థులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. అతడు ఏ పార్టీ అధికారంలో ఉంటే, ఆ పార్టీకి చెందిన కీలక వ్యక్తులతో కలసి ప్రయాణం చేస్తూ దందా చేస్తుంటాడని చెప్తున్నారు. పొరుగు నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే సమీప బంధువుకు స్నేహితుడు కావడంతో పాటు, సంబంధిత అధికారులను ప్రసన్నం చేసుకుంటూ దందా సాగిస్తున్నట్లు వ్యాఖ్యానిస్తున్నారు.

కలెక్టర్ ప్రత్యేక దృష్టి

ఇసుక అక్రమాలపై కలెక్టర్ జె.వెంకటమురళి ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో బోయినవారిపాలెం ఘటనకు సంబంధించిన పూర్వాపరాలను తెలుసుకుంటున్నారు. ఇసుక అక్రమాలు పూర్తిగా నియంత్రించే దిశగా అడుగులు వేయాలని సంబంధిత అధికారులకు గట్టిగా చెప్పినట్లు సమాచారం.

నివేదిక తయారు చేస్తున్నాం

బోయినవారిపాలెం పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా జరుగుతున్న మాట వాస్తవమే. అందుకు సంబంధించి సదరు భూములు ఎవరి పేరు మీద ఉన్నాయి. గతంలో వారికేమన్నా అనుమతులు ఇచ్చారా, లేదా తదితర విషయాలతో ఉన్నతాధికారులకు నివేదించేందుకు సమగ్ర నివేదిక తయారు చేస్తున్నాం. మండలంలో మిగిలిన ప్రాంతాల్లో కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం.

- గోపీకృష్ణ, తహసీల్దారు, చీరాల

ఎక్స్‌కవేటర్ పత్రాలు లేవు

బోయినవారిపాలెం టీపీ స్కీమ్ వద్ద తగలబడిన ఎక్స్‌కవేటర్ తనదని ఈపురుపాలేనికి చెందిన రామకృష్ణ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. అయితే ఎక్స్‌కవేటర్‌కు సంబంధించి అతడి వద్ద ఎలాంటి ధ్రువపత్రాలు లేవు. అన్ని కోణాల్లో కేసును విచారిస్తున్నాం. అక్రమ తవ్వకాలు, రవాణా చేసే వారిపై ప్రత్యేక దృష్టి సారించి కఠినంగా వ్యవహరిస్తాం.

- చంద్రశేఖర్, ఎస్ఐ

బోయినవారిపాలెం పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరిగే ప్రదేశాలలో ఒక ప్రదేశం


విందు, వినోదం.. కారాదు విషాదం

- నూతన సంవత్సర వేడుకల అనుమతుల కోసం అరకొర అడుగులు
- సుమారు 40 రిసార్టులు, లాడ్జీలు, హోటళ్లు
- కార్యక్రమాల నిర్వహణకు వచ్చింది ఒక్క దరఖాస్తు, లిక్కర్ కోసం 8
- వేచి చూసే ధోరణిలో మిగిలినవారు

చీరాల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విందు, వినోదాలు విషాదాలు కాకూడదు. నూతన సంవత్సర వేడుకల్లో అపశ్రుతులు దొర్లకూడదు. ఈవెంట్స్‌ను నిర్వహించే రిసార్ట్‌లు, హోటళ్లు, లాడ్జీల నిర్వాహకులు ఎవరైనా నిర్దీత అనుమతులు పొందాలి. నిబంధనలు పాటించాలి. లేదంటే చట్టపరంగా చర్యలు తప్పవని పోలీస్, ఎక్సైజ్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి స్థానిక డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో రూరల్ సీఐ శేషగిరిరావు, ఈపురుపాలెం, వేటపాలెం ఎస్సైలు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లులతో కలసి డీఎస్పీ మహ్మద్ మొయిన్ రిసార్ట్‌ల నిర్వాహకులతో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా తీసుకోవల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలపై అవగాహన సమావేశం నిర్వహించారు. పక్కాగా అనుమతులు పొందాలని, స్వీయనియంత్రణ ఉండాలని పేర్కొన్నారు.

అనుమతులకు అందని దరఖాస్తులు

తీరప్రాంతంలో రిసార్ట్‌లు, లాడ్జీలు, హోటళ్లు సుమారు 40 వరకు ఉన్నాయి. వాటిలో సింహభాగం నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి ఈవెంట్లను నిర్వహించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. అయితే అందుకు సంబంధించిన అనుమతులకు పోలీస్, ఎక్సైజ్ అధికారులకు దరఖాస్తులు అరకొరగానే అందుతున్నాయి. పోలీస్ అనుమతికి సంబంధించి ఒక్క రిసార్ట్ నిర్వాహకుల నుంచి మాత్రమే అనుమతి కోసం దరఖాస్తు అందినట్లు తెలిసింది.



రిసార్ట్‌ల నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్పీ మహ్మద్ మొయిన్ (ఫైల్)

ఎక్సైజ్ వారికి అందినవి 8

నూతన సంవత్సర వేడుకలలో భాగంగా ఆయా రిసార్టులు, లాడ్జీలు, హోటల్స్‌కు వచ్చిన వారిలో అధిక సంఖ్యాకులు మద్యం సేవించడం పరిపాటి. అందుకు గాను సదరు ఈవెంట్స్ నిర్వాహకులు ముందస్తుగా ఎక్సైజ్ శాఖకు దరఖాస్తు చేసుకుని అనుమతి పొందాలి. అందుకు నిర్దీత రుసుము చలానా రూపేణా చెల్లించాలి. ఎక్సైజ్ ఎస్సై, సీఐల పరిశీలన అనంతరం ఈఎస్ అనుమతి ఇస్తారు. అయితే ఇప్పటి వరకు కేవలం 8 దరఖాస్తులు మాత్రమే అందినట్లు ఎక్సైజ్ ఎస్సై శ్రీహరి తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎన్‌డీపీ (నాన్ డ్యూటీ పెయిడ్) లిక్కర్ వినియోగం జరిగితే తగిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ప్రభుత్వ డిపోలో లేదా లైసెన్స్ షాపులలో మాత్రమే మద్యం కొనుగోలు చేసేందుకు అనుమతిస్తామన్నారు. లేదంటే తాము తనిఖీలు నిర్వహించినపుడు ఎన్‌డీపీ లిక్కర్ పట్టుబడితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

వెల్‌కం, డ్రింక్, స్నాక్స్

నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి రూముల అద్దెతో పాటు ఈవెంట్స్‌లో పాల్గొనేందుకు ఆయా రిసార్టులు, లాడ్జీలు, హోటళ్ల వారి, వారి పరిధిలో టికెట్ల ధరలను నిర్ణయించారు. కొందరు విక్రయాలు మొదలు పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. టికెట్‌తో ఈవెంట్‌లో పాల్గొనవచ్చు. ఆ సమయంలో వెల్‌కమ్, డ్రింక్, స్నాక్స్ అందజేస్తారు. అదనంగా లిక్కర్ కావల్సిన వారు కొనుగోలు చేసుకోవల్సిందే.

తీసుకోవలసిన జాగ్రత్తలు

చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ఈవెంట్స్ నిర్వహించే ప్రతి రిసార్ట్, హోటల్, లాడ్జీల నిర్వాహకులు కేవలం వారివారి ప్రాంగణాల్లో మాత్రమే ఈవెంట్స్ నిర్వహించాలి. సముద్ర తీరంలో ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించకూడదు. ప్రాంగణంలో ఈవెంట్స్ నిర్వహించినా అందులో పాల్గొనేవారు సముద్రం వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అందుకోసం ఆ రోజు వరకు ప్రత్యేక సిబ్బందిని కూడా ఏర్పాటు చేసుకుంటే మంచిది. 12, 12.30 గంటల తరువాత ఎవరూ రోడ్లపై తిరగకుండా చర్యలు తీసుకోవాలి. వేడుకలు పూర్తయ్యే వరకు గజ ఈతగాళ్లను కూడా అందుబాటులో ఉంచుకోవాలి. అనుమతులు పొందిన చోట పోలీసు పర్యవేక్షణ ఉంటుంది. కాబట్టి ప్రతి ఒక్కరూ పోలీస్ అనుమతి పొంది ఎలాంటి అపశ్రుతులు దొర్లకుండా వేడుకలు నిర్వహించకుంటే అందరికీ సంతోషదాయకమే.



సివిల్ సప్లయిస్ గోడౌన్‌లో పరిశీలిస్తున్న చీరాల ఆర్డీవో

గోడౌన్‌లో తనిఖీ చేసిన ఆర్డీవో

అద్దంకి,డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): అద్దంకిలోని సివిల్ సప్లయిస్ గోడౌన్‌లో చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు శనివారం తనిఖీ చేశారు. గోడౌన్ లో ఉన్న స్టాక్ వివరాలు, రిజిస్టర్ లను పరిశీలించారు. తహసీల్దార్ శ్రీచరణ్, గోడౌన్ డీటీ రామకృష్ణ, ఆర్ఐ శంకర్ పాల్గొన్నారు.

గాలివీడు ఎంపీడీవోపై దాడికి నిరసన

పర్చూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ ఎంపీడీవో ప్రద్యుమ్న కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు. విధి నిర్వహణలో ఉన్న అధికారిపై ఇలా దాడులకు పాల్పడడం బాధాకరమన్నారు.

చినగంజాం : అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై వైసీపీ నేతలు దాడి అమానుషమని ఎంపీడీవో అద్దంకి శ్రీనివాసమూర్తి అన్నారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో, కార్యాలయ సిబ్బంది నల్ల రిబ్బన్లు ధరించి శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న అధికారిపై భౌతిక దాడికి పాల్పడడం దారుణమని అన్నారు. దాడి చేసిన నిందితులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న సిబ్బంది

ఇంకొల్లు : ఎంపీడీవో జవహర్‌బాబుపై జరిగిన దాడిని ఖండిస్తూ ఇంకొల్లు ఎంపీడీవో కార్యాలయం ఎదుట సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.శ్రీనివాసరావు, ఏపీవో రేణుక, ఏపీఎం అనూరాధ, ఏవోఎం కిరణ్‌కుమార్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తలు పాటించండి

డీఎస్పీ మొయిన్



గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ మొయిన్

గవినివారిపాలెం(చీరాలటౌన్), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్లు సామాన్యులకు వలవేసి మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు వాటికి దూరంగా ఉండాలని డీఎస్పీ ఎండీ మొయిన్ అన్నారు. పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి గవినివారి పాలెంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంక్ ఖాతా వివరాలు అపరిచితులకు తెలియజేయవద్దన్నారు. ఓటీపీ, ఏదైనా మోసపూరిత ఫోన్ లింకులు ఓపెన్ చేయరాదని చెప్పారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న క్రమంలో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి జాగ్రత్తగా ప్రయాణాలు చేయాలని సూచించారు. పగలు, ప్రతీకారాలకు పోయి కేసులబారిన పడకుండా ప్రజలు ప్రశాంతంగా ఉండేలా చూడాలన్నారు. డీఎస్పీ వెంట రూరల్ సీఐ శేషగిరిరావు, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, ఎస్సై చంద్రశేఖర్, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

దుకాణాల్లోకి దూసుకెళ్లిన లారీ

డ్రైవర్‌కు గాయాలు



తిమ్మనపాలెంలో దుకాణాల్లోకి దూసుకెళ్లిన లారీ

మేదరమెట్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిలో తిమ్మనపాలెం వద్ద రోడ్డు మార్జిన్‌లోని దుకాణాల్లోకి లారీ దూసుకువెళ్లింది. శుక్రవారం అర్ధరాత్రి ఒంగోలు వైపు నుంచి గుంటూరు వైపు వెళ్తున్న లారీ తిమ్మనపాలెం చెరువు కట్ట వద్ద రోడ్డు పక్కన ఉన్న హోటల్, పంచర్ దుకాణంలోకి ఒక్కసారిగా దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ గాయపడ్డారు. అతడిని 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

గుండ్లకమ్మ బ్రిడ్జి నుంచి నదిలోకి దూకిన మహిళ

- తిమ్మాయపాలెంకువాసిగా అనుమానం
- పరిశీలించిన కుటుంబ సభ్యులు, సెల్‌ఫోన్ స్వాధీనం

అద్దంకి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గుండ్లకమ్మ నదిలోకి బ్రిడ్జిపై నుంచి ఓ మహిళ దూకింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి అక్కడ ఉన్న సెల్‌ఫోన్‌ను తీసుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని తిమ్మాయపాలెం కు చెందిన మహిళ శనివారం రాత్రి గుండ్లకమ్మ బ్రిడ్జి వద్ద ఉంది. సుమారు అర్ధగంట పాటు అక్కడే ఉన్న మహిళ బ్రిడ్జి పై నుంచి నదిలోకి దూకింది. ఆ సమయంలో అటువైపు వెళ్తున్న వ్యక్తులు ఆపే ప్రయత్నం కూడా చేసినట్లు తెలుస్తుంది. ఆమె ఉపయోగించే సెల్‌ఫోన్ బ్రిడ్జి వద్ద గట్టుపై పెట్టి ఉంది. తిమ్మాయపాలెంకు చెందిన వ్యక్తి అటు వైపు వెళ్తూ ఆ సెల్‌ఫోన్ గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యులు అక్కడకు చేరుకొని సెల్‌ఫోన్‌ను తీసుకొని అక్కడ పరిశీలించారు. చీకటిగా ఉండడంతో ఏమి గుర్తించలేకపోయారు. అక్కడ ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా తిమ్మాయపాలెం కు చెందిన హనుమాయమ్మగా భావిస్తున్నారు. భార్యాభర్తలు పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంటారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మోటార్ బైకు

- ఒకరు మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రుడిని తరలించేందుకు గంట వరకు అందుబాటులోకి రాని 108 వాహనం

బల్లికురవ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వీర్ల కొండ గ్రానైట్ క్వారీల సమీపంలో రోడ్డుపై నిలిపి ఉన్న లారీని వెనుక నుండి బైకుపై వస్తున్న కార్మికులు శనివారం రాత్రి ఇరువురు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బైకు నడుపుతున్న ముఠా మేస్త్రీ వెంకటేష్ (40) అక్కడిక్కడే మృతి చెందగా ఎస్కలేటర్ అపరేటర్ వివేకానంద రెడ్డి కి తీవ్ర గాయాలు అయ్యాయి. బల్లికురవ సంతమాగులూరు రోడ్డు వీర్ల కొండ క్వారీల సమీపంలో ముడి రాయి రవాణా చేసే ఒక లారీ మర్మత్తులకు గురై నిలిచి పోయింది. క్వారీలలో పనులు ముగిసిన తదుపరి బల్లికురవ వచ్చి తిరిగి వెళుతున్న ఇరువురు కార్మికుల బైకు కు లైట్ లేకపోవటంతో చీకట్లో లారీ కనిపించక వారు లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తమిళనాడుకు చెందిన వెంకటేష్ అను ముఠా మేస్త్రీ సంఘటన స్థలంలోనే మృతి చెందగా, అనంతపురంకు చెందిన క్రేన్ అపరేటర్ వివేకానందరెడ్డికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయాలైన క్షతగాత్రుడిని మార్టురు 108 వాహనంలో చి లకలూరిపేట వైద్యశాలకు తరలించారు. ఇరువురు కార్మికులు గత పదేళ్లగా బ్రతుకు దెరువుకు వచ్చి గ్రానైట్ క్వారీలలో పనులు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇరువురు కుమార్తెలు, ఒక కుమారుడు కలరు.



ప్రమాదంలో మృతి చెందిన వెంకటేష్, తీవ్రంగా గాయపడిన వివేకానందరెడ్డి

108 వాహనం కోసం పడిగాపులు

క్వారీల సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగి ఒకరు మృతి చెందగా మరోక కార్మికుడు కొన ఊపిరితో కొట్టు మిట్టాడుతుండగా బాట సారులు రాత్రి 7 గంటల సమయంలో 108 వాహనం కోసం ఫోను చేయగా బల్లికురవ మండల కేంద్రంలో ఉన్న వాహనం అందుబాటులో లేదు అని సమాచారం వచ్చింది. మార్టురు నుండి 108 వాహనం 8 గంటలకు వచ్చింది. తీవ్ర గాయాల పాలైన కార్మికుడు గంట పాటు రోడ్డు మీదే రక్తపు మడుగులో పడి ఉన్నాడు. గాయాపడిన కార్మికుడు పరిస్థితి విషమంగా ఉందని సకాలంలో 108 వాహనం వచ్చి ఉంటే బాగుండేది అని ప్రజలు వాపోతున్నారు.

దివ్యాంగుల శాఖలో అక్రమాలు

- ఉద్యోగాల నియామకాలతోపాటు రుణాల మంజూరులో అవకతవకలు
- విచారణాధికారి ఎదుట ఏకరువు పెట్టిన దివ్యాంగులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమశాఖలో ఒక్కొక్కటిగా అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. శాఖ ద్వారా భర్తీచేసిన నాల్గవ తరగతి ఉద్యోగాల్లో పలు అవకతవకలు చోటుచేసుకున్నాయని ఇటీవల దివ్యాంగులు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఆ నియామకాలపై సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాలని డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావును ఆదేశించారు. దీంతో ఆయన విచారణ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో దివ్యాంగుల నుంచి అనేక ఫిర్యాదులు అందుతున్నాయి. ఉద్యోగ నియామకాలతోపాటు కేంద్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం ఇచ్చే రుణాల్లో కూడా అక్రమాలు చోటుచేసుకున్నాయని విచారణాధికారికి కొందరు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దివ్యాంగుల సంక్షేమం కోసం 90శాతం కేంద్రప్రభుత్వం సబ్సిడీ ఇస్తుండగా ఐదు శాతం రాష్ట్ర ప్రభుత్వం, మరో ఐదు శాతం లబ్ధిదారుడు వాటా చెల్లించాల్సి ఉంది. అయితే ఈ రుణాల మంజూరులో కూడా పలు అక్రమాలు చోటుచేసుకున్నాయని శనివారం జరిగిన విచారణలో పలువురు దివ్యాంగులు విచారణాధికారి లోకేశ్వరరావు ఎదుట ఏకరువు పెట్టారు. గత వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి ఆర్థిక చేయూతను ఇచ్చే పథకాల అమలులో కూడా తమకు అన్యాయం జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపింది. దీంతో విచారణాధికారి లోకేశ్వరరావు ఆయా అంశాలపై దృష్టిపెట్టి కొంత సమాచారాన్ని సేకరించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే లోకేశ్వరరావు ఆధ్వర్యంలో పలు శాఖల్లో జరిగిన అవినీతి వెలుగులోకి రాగా తాజాగా దివ్యాంగుల సంక్షేమశాఖలో జరిగిన అవినీతి వెలుగులోకి వస్తుండటంతో జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

30న అద్దంకిలో జాబ్ మేళా

అద్దంకిటౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం, సిడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన రేణింగివరం రోడ్డులోని సాయిబాబా ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు సంస్థ జిల్లా అధికారి పి.ప్రణయ్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాకు హెటిరో ల్యాబ్, రవి లీల గ్రానైట్స్, కాల్గేట్, ఎస్ఎస్ఎస్ కంపెనీలు వారు హాజరవుతున్నట్లు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లమో చదివిన 18-30 సంవత్సరాల వయస్సు గల యువతీయువకులు బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు నకలు, పాస్‌పోర్టు ఫొటోలతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 9542970871, టోల్ ఫ్రీ నెంబర్ 9988853335 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

టెలికం ఆఫీసు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

చీరాల, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : పాపరాజు తోటలోని టెలికం ఆఫీసు, అర్బన్ హెల్త్ సెంటర్, విద్యుత్ కార్యాలయం తదితర కార్యాలయాలకు రాకపోకలు సాగించే రోడ్డు ఛిద్రమైంది, దీంతో ఆయా కార్యాలయాలకు రాకపోకల సాగించే వాహనచోదకులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ఆ రోడ్డుకు వెంటనే మరమ్మత్తులు చేయాలని వివేకానంద సేవాసమితి అధ్యక్షుడు సర్విశెట్టి సుబ్బరామయ్య శనివారం ఓ ప్రకటనలో మున్సిపల్ చైర్మన్‌ను, అధికారులను తెలిపారు. అందుకు వారు సానుకూలంగా స్పందించాలని ఆయన ప్రకటనలో కోరారు.

విద్యుత్ భారం వైసీపీ పాపం

- చార్జీల పెంపునకు సిఫార్సు చేసింది జగన్
- ఎమ్మెల్యే ఏలూరి



పర్చూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలకుల పాపాలు ప్రజలకు విద్యుత్ శాపంగా మారిందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. విద్యుత్ చార్జీలు పెరిగాయంటూ వైసీపీ శ్రేణులు రోడ్డుమీది కొచ్చి గగ్గోలుపెట్టడం సిగ్గుచేటన్నారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో 10 సార్లు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలను మోయలేని భారాలను మోపారన్నారు. విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదన జగన్ హయాంలోనే జరిగిందని శనివారం ప్రకటలో పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడే చార్జీలు పెంచాలని డిస్కమ్‌లకు సిఫార్సు చేసిందే జగన్ అన్నారు. జగన్ చర్యలతో విద్యుత్ శాఖ అస్తవ్యస్తంగా మారిందన్నారు. వరుసగా చార్జీల మోత మోగించి ప్రజలపై రూ.32 వేల కోట్ల భారం మోపారన్నారు. అంతా చేసిన వైసీపీ ఇప్పుడు ధర్నా చేయడంపై ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. సోలార్ విండ్ ఎనర్జీ పీపీఏలను రద్దు చేసి ఏపీకి 7వేల మోగావాట్ల విద్యుత్‌ను జగన్ అందుబాటులో లేకుండా చేశారన్నారు. విద్యుత్ చార్జీల పెంపుతోపాటు ట్రూ అప్ చార్జీలు అంటూ రూ.20వేల కోట్ల భారం ప్రజలపై మోపిన జగన్ ఇంటి ముందు ప్రజలే ధర్నా చేయాలన్నారు. విద్యుత్ చార్జీల పెంపునకు కూటమి ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. పెద్దపెద్ద మోసాలు, అవినీతి అక్రమాలు చేసిన వైసీపీ పాలకులు ఇప్పుడు రోడ్లపై ర్యాలీలు చేయడం విడ్డూరమన్నారు. చంద్రబాబు నేతృత్వంలో కూటమి పాలన ప్రజారంజకంగా సాగుతోందని, అభివృద్ధి, సంక్షేమం, పథకాల అమలు 6 నెలలుగా సక్రమంగా సాగుతుంటే జగన్‌రెడ్డి ధర్నాలు చేయడం పెద్ద నాటకమని ఏలూరి విమర్శించారు.



మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు వీరయ్య

టీడీపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

చినగంజాం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య నాయకులు, కార్యకర్తలకు సూచించారు. స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్‌కలాం అజాద్ అధ్యక్షతన శనివారం జరిగిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెలఖారుతో సభ్యత్వ నమోదు కార్యక్రమం ముగియనుండడతో పార్టీ సభ్యత్వం తీసుకొని వారిని గుర్తించి వెంటనే సభ్యత్వ నమోదు చేయాలని వీరయ్య అన్నారు. సభ్యత్వ నమోదులో పర్చూరు నియోజకవర్గంలోనే మండలం ప్రథమ స్థానంలో ఉండే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. తదనంతరం నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే స్వయం ఉపాధి పథకంపై నాయకులకు, కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో చినగంజాం, నీలాయపాలెం, పెదగంజాం గ్రామ సర్పంచ్‌లు రాయని ఆత్మారావు, తూమాటి శ్రీనివాసరావు, నక్కల కృష్ణ, నాయకులు సందు శ్రీనివాసరావు, మోటుమర్రి రామసుబ్బారావు, నరహరి శ్రీనివాసరావు, షేక్ జిలాని, షేక్ హుస్సేన్‌భాషా, నబీషా, కే.విష్ణు, కొక్కిలిగడ్డ రామాంజనేయులు, గొల్లపోతు వెంకటేశ్వర్లు, దండుప్రోలు తిరుపతిరావు, ఐటీడీపీ రామాంజనేయులురెడ్డి, పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణానికి ఇబ్బంది లేకుండా క్వారీ పనులు చేయాలి

బల్లికురవ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా గ్రానైట్ క్వారీలలో పనులు చేపట్టాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు కోరారు. శనివారం మండలంలోని కొప్పెరపాలెం గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 282/పీలో 8.20 హెక్టార్లలో గ్రానైట్ క్వారీ నిర్వహించేందుకు అమరావతి మైన్స్ వారు క్వారీ అనుమతులకు దరఖాస్తు చేసి ఉన్నారు. ఈ క్వారీకి అనుమతులకు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు క్వారీ నిర్వహించే ప్రదేశంలో ప్రజల నుంచి అధికారులు అభిప్రాయ సేకరణ చేపట్టారు. ప్రజల తెలిపిన వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని అర్డీవో తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవి నాయక్ పాల్గొన్నారు.

దేవదాయ పేరుతో రైతులతో చెలగాటం

- పూర్వీకుల నుంచి సాగులో ఉన్న భూములను ఆన్‌లైన్ చేయకుండా వేధింపులు
- కోర్టు తీర్పులు వచ్చిన పట్టించుకోని అధికారులు
- జిల్లాలోని పలుప్రాంతాల్లో రెవెన్యూ సదస్సుల్లో రైతుల గగ్గోలు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ పేరుతో అధికారులు రైతులకు చెలగాటమాడుతున్నారు. పూర్వీకుల నుంచి సంక్రమించిన భూముల విషయంలో రెవెన్యూ అధికారులు వేధింపులకు పాల్పడుతున్నారు. ఆయా భూములను ఆన్‌లైన్ చేయకుండా వారు దాటవేస్తుండటంతో అర్హులైన రైతులు ప్రభుత్వ పథకాలను కూడా కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో రైతులు ఇవే సమస్యలపై గగ్గోలుపెడుతున్నారు. మద్దిపాడు మండలం బసవన్నపాలెం, దొడ్డవరప్పాడు, వెంకటరాజుపాలెం తదితర గ్రామాలకు చెందిన రైతులు తమ భూములను ఆన్‌లైన్ చేయాలని ఆందోళన చేపట్టారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

స్పందన కరువు

ఇనమనమెళ్లూరు గ్రామ సర్వేనెంబర్‌లోని 291, 322, 324, 328, 329, 333, 391లో సుమారు 170.16 ఎకరాల భూమిని ఆయా గ్రామాల్లోని 230మంది రైతులు గత 30 ఏళ్ల నుంచి అనుభవిస్తున్నారు. అటువంటి భూములపై అనేక వివాదాలు నడిచి రైతులే హక్కుదారులుగా పలు న్యాయస్థానాల్లో తీర్పులు వచ్చినా సంబంధిత అధికారులు పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. రైతులు అనేక పర్యాయాలు మండల, డివిజన్, జిల్లాస్థాయిలో ఉన్నతాధికారులను కలిసి సమస్యను విన్నవించినా స్పందన కరువు. ఆ విధంగా జిల్లాలోని పలుప్రాంతాల్లో ఈ సమస్య ఉన్నా పట్టించుకొని పరిస్థితి ఏర్పడింది.


తగ్గింది.. తప్పులున్నాయి

(5వ పేజీ తరువాయి)

సదస్సులు నిర్వహించారు. భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోరుతూ ఇప్పటికీ 12,347 అర్జీలు రాగా వాటిల్లో ఇప్పటివరకు 976 పరిష్కారమయ్యాయి. పల్నాడు జిల్లాలో 366 రెవెన్యూ గ్రామాలు ఉండగా ఇప్పటికి 301 గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. 18,403 మంది సదస్సులకు హాజరై 4,153 అర్జీలు అంద జేశారు. వీటిలో ఇప్పటికి 198 అర్జీలను పరిష్క రించారు. బాపట్ల జిల్లాలో 277 రెవెన్యూ గ్రామా లకు 201 సదస్సులు జరిగాయి. 18,560 మంది హాజరు కాగా 4,771 అర్జీలను అందజేశారు. వీటిలో ఇప్పటికి 589 పరిష్కరించారు. గుంటూరు జిల్లాలో 198 రెవెన్యూ గ్రామాలు ఉండగా 158 గ్రామాల్లో సదస్సులు పూర్తయ్యాయి. 18,345 మంది 3,423 అర్జీలను అందజేయగా 189 అర్జీలను పరిష్కరిం చారు. బాధితుల నుంచి స్వీకరించిన అర్జీలను పరిష్కరించేందుకు రెవెన్యూ, భూసర్వే రికార్డుల శాఖల అధికారులు సంయుక్తంగా పరిష్కరించాల్సి ఉంది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అర్జీదా రుల సమక్షంలోనే భూ సమస్యలను పరిష్క రించాలి. అయితే అధికార యంత్రాంగం అర్జీల పరిష్కారంలో గతంలో వలే వ్యవహరిస్తుందన్న విమర్శలున్నాయి. చిత్తశుద్ధితో అర్జీలను పరిష్కరిం చకుంటే ప్రభుత్వం ఎంతో ఉన్నతాశయంతో ప్రవేశ పెట్టిన రెవెన్యూ సదస్సుల ఉద్దేశం నీరుగారి పోతుందని చెప్పవచ్చు.

ఆ క్వారీలతో ప్రమాదం!

- బల్లికురవ మండలంలో పలు చోట్ల పనులు నిలిపివేత
- ఆ ప్రదేశంలో పెద్ద ఎత్తున నిలిచిన నీరు
- పొలాలకు వెళ్లే రైతులు, పశువులకు పొంచి ఉన్న ముప్పు
- ఆందోళనలో ప్రజలు



ఉప్పుమాగులూరు పరిధిలో పనిచేయని క్వారీలో నిలిచి ఉన్న నీరు



కొండాయాలెం గ్రామం వద్ద పనిచేయని నేల క్వారీలో నిలిచి ఉన్న నీరు



ప్రమాదకరంగా నేల క్వారీలో ఉన్న వర్షపు నీరు

బల్లికురవ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రానైట్ క్వారీలలో పనులు నిలిపి వేసి ఉన్న ప్రదేశాలలో ఉన్న నీటితో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. నిబంధనల మేరకు పనులు చేయాల్సిన వారు అవేమీ పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టి ఎలాంటి ప్రతిఫలం లేకపోవడంతో క్వారీలను నిలుపుదల చేశారు. తవ్వకాలు చేసిన గుంటలలో పెద్ద ఎత్తున వర్షపు నీరు నిలిచి ఉంది. దీంతో పొలాలకు వెళ్లే రైతులు, ఈతకు వెళ్లే విద్యార్థులు, పశువులు ఏ సమయంలో ప్రమాదంబారిన పడతాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కనీసం పనులు నిలిపి ఉన్న నేల క్వారీల వద్ద చుట్టూ రక్షణ చర్యలు కూడా లేవని వారు తెలిపారు.

బల్లికురవ మండలంలోని కొణిదెన, బల్లికురవ, మల్లాయపాలెం, కొండాయపాలెం, ఉప్పుమాగులూరు గ్రామాల పరిధిలో అత్యధికంగా గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. కొన్ని కొండల భాగంలో ఉండగా, మరికొన్ని నేల భాగంలో ఉన్నాయి. ఈ క్వారీల నుంచి గ్రానైట్ నిక్షేపాలను తవ్వి దేశ విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. నేల క్వారీలలో పనులు చేసిన వారు నష్టాల బారిన పడుతున్నారు. ఖర్చు ఎక్కువ కావడంతో పాటు నాణ్యత సరిగా లేకపోవడంతో కొన్ని క్వారీలు కొంత కాలం నుంచి మూత పడి ఉన్నాయి. ఈ క్వారీలలో పనులు చేయకపోవడంతో ఇప్పటి వరకు తవ్వకాలు చేసిన గుంటలలో పెద్ద ఎత్తున వర్షపు నీరు నిబడి ఉంది. సుమారు 20 అడుగుల లోతు వరకు నీరు ఉంది. మాజీ ఎమ్మెల్యేకు చెందిన నేల క్వారీ మల్లాయపాలెం, వేమవరం గ్రామాల మధ్య కొంత కాలం నుంచి పూర్తిగా మూతపడి ఉంది. ఈ క్వారీలో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. బావులను తలపించేలా నీరు ఉండడంతో పశువుల కాపరులు భయపడుతున్నారు. పశువులు లోపలికి వెళితే తమకు రక్షణ ఎక్కడని క్వారీ నలు వైపులా రక్షణ చర్యలు లేవని పనులు చేయకపోవడంతో అక్కడ ఎవరు ఉండడం లేదని అక్రమంగా తవ్వకాలు చేసి వదిలేసిన వారిపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలు అమలు చేయడంలో కూడా అధికారులు విఫలం అయ్యారని వారు ఆరోపిస్తున్నారు. ఎంతవరకు లోతు తవ్వకాలు చేపడితే ఎంత రక్షణ చర్యలు చేపడుతున్నారు అన్న విషయం గురించి అధికారులు పట్టించుకోకపోవడం వలనే ఇప్పుడు గ్రామాలలో ఎక్కడ చూసిన గుంటలలో నీరు ఉందని వారు తెలిపారు. బల్లికురవ మండల పరిధిలో సుమారు 10 చోట్ల నేల క్వారీలలో నీరు ఉందని అధికారులు వెంటనే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు నిలుపుదల చేసిన క్వారీల వద్ద ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పిస్తున్న ఏవో కాశీవిశ్వనాథ్

ప్రకృతి సేద్యంపై అవగాహన

వేటపాలెం(చీరాల), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి సేద్యంపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలి. ప్రకృతి సేద్యంతో తక్కువ ఖర్చు అధిక ఫలసాయం పొందవచ్చని ఏవో కాశీవిశ్వనాథ్, ప్రకృతి సేద్యం మాస్టర్ ట్రైనర్ భారతి చెప్పారు. మండల పరిధిలోని పందిళ్లపల్లిలోని ప్రిపేర్ సంస్థ కార్యాలయంలో శనివారం ప్రకృతి సేద్యంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రకృతి సేద్యంతో ఒనగూరే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ప్రిపేర్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి కుంటల పనులు చేపడతాం

బల్లికురవ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గతంలో నిధులు మంజూరై ఉన్న అమృత్ సరోవర్ నీటి కుంటల పనులను తక్షణమే చేపడతామని ఉపాధి హామీ పథకం ఏపీవో రమాదేవి పేర్కొన్నారు. శనివారం ఆంధ్రజ్యోతిలో నీటి కుంటల జాడేది అన్న వార్త ప్రచురితం కావడంతో ఏపీవో రమాదేవి స్పందించారు. మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో గతంలో అమృత్ సరోవర్ ద్వారా అటవీ భూమిలో కొంత మేర పనులు చేపట్టామని నేల గట్టిగా ఉండడంతో పనులు నిలిపి వేశామని, వచ్చే వారం నుంచి నీటి కుంట పనులు మరలా ప్రారంభిస్తామని తెలిపారు. రైతులకు ఇబ్బందులు లేకుండా గ్రామాలలో పంట కాల్వల పనులు చేయిస్తున్నామని ఆమె తెలిపారు.

31లోపు అభ్యంతరాల స్వీకరణ

అద్దంకి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సోషల్ ఆడిట్ ఆఫ్ క్యాస్ట్ సర్వే ఆఫ్ ఎస్సీ క్యాస్ట్ జాబితాలను అద్దంకి పట్టణంలోని అన్ని సచివాలయాల వద్ద ప్రదర్శించినట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర తెలిపారు. జాబితాలో అభ్యంతరాలను ఈ నెల 31వ తేదీలోపు సచివాలయంలో నేరుగా తెలియజేయాలని కోరారు. సదరు అభ్యంతరాలను పరిశీలించి తుది జాబితాను 10 వ తేదీ సచివాలయాల వద్ద ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు.

గోశాలకు ట్రాక్టర్ వరిగడ్డి అందజేత



గడ్డిని అందజేస్తున్న దాత డాక్టర్ వెంకట కిరణ్, రోటరీ సభ్యులు

అద్దంకిటౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శనివారం అద్దంకిలోని హరిహర గోశాలకు ట్రాక్టర్ గడ్డిని అందజేశారు. అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో పని చేస్తున్న డాక్టర్ పొన్నం వెంకట కిరణ్ ఆర్థిక సహకారంతో వరిగడ్డి గడ్డిని గోశాలకు అందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, చిన్నిమురళీకృష్ణ, హరిప్రసాద్, ఊటుకూరు రామకోటేశ్వరరావు, తమ్మన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపు కౌన్సిల్ సాధారణ సమావేశం

చీరాల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కౌన్సిల్ హాల్లో మంగళవారం ఉదయం 11 గంటలకు ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరుగుతుందని కమిషనర్ అబ్దుల్ రషీద్ శనివారం తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సంబంధిత అధికారులు హాజరు కావాలని తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

వేటపాలెం(చీరాల), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నీలకంఠాపురానికి చెందిన పింజల నాగార్జున (31) శనివారం తన బెడ్ రూంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని తండ్రి సమాచారం మేరకు.. వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. నాగార్జున భార్య ఏడాదిన్నర కిందట వారి మధ్య నెలకొన్న గొడవల నేపథ్యంలో పుట్టింటికి వెళ్లింది. కొంత కాలంగా నాగార్జునకు ఆరోగ్యం సరిగాలేక చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని తండ్రి రాత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పద్మావతి

చిన్నారుల భద్రతపై ప్రత్యేక దృష్టి

చీరాలటౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామ స్థాయిలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి చిన్నారి బాలికల రక్షణకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. శనివారం జిల్లా స్థాయి విస్తృత సమావేశం చీరాల రోటరీ క్లబ్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా బాల్య వివాహాలు, బాల కార్మికులు, బాలల హక్కులు, బడి బయట పిల్లలు, పోక్సో కేసుల పురోగతి వంటి అంశాలపై ప్రాంతాలవారీగా సిబ్బందితో మాట్లాడి తెలుసుకున్నారు. ప్రతిఒక్కరూ చిన్నారల రక్షణ చర్యల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. వారి బంగారు భవిష్యత్‌కు ప్రతిఒక్కరూ క్రియాశీలకంగా పనిచేయాలని సూచించారు. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు ప్రభుత్వం ద్వారా సాయమందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే కొంతమంది చిన్నారులను శిశు గృహాల ద్వారా రక్షణ కల్పించి ఉన్నతంగా చదివిస్తున్నట్లు వివరించారు. సిబ్బంది సందేహాలను నివృత్తి చేశారు. అలాగే అంతకంటే ముందుగా హయ్యర్‌పేటలోని ఎంపీపీ స్కూల్, గంజిపాలెంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యక్రమంలో వేటపాలెం ఐసీడీఎస్ సీడీపీవో ఉమ, జిల్లా పరిధిలోని సూపర్‌వైజర్లు, సీసీఐఎస్ సిబ్బంది, వార్డెన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కర్పూర ఆరాధన మహోత్సవం



నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం ఈపూరుపాలెం పంచాయతీ పద్మనాభునిపేటలో వేంచేసిఉన్న శ్రీలక్ష్మీ అనంత పద్మనాభస్వామివారి దేవాలయ ప్రాంగణంలో ఘనంగా 38వ కర్పూర ఆరాధన మహోత్సవంను కమిటి ప్రతినిధులు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమం గత బుధవారం జరగాల్సి ఉండగా అల్పపీడనంతో శనివారం నిర్వహించారు. ఈక్రమంలోనే హరిహర సుత శ్రీ అయ్యప్ప స్వామివారి నగరోత్సవం, తిరునాళ్ల కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అలాగే శ్రీగణపతి సంకీర్తన, భజనా కాలక్షేపాన్ని నిర్వహించారు. సాయంత్రం జరిగిన కూచిపూడి, భరత నాట్యం అలరించాయి. ఆయా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీక్షధారులు పాల్గొన్నారు.

రీ-సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

- రైతులు అందుబాటులో ఉండి వినియోగించుకోవాలి
- ఆర్డీవో చంద్రశేఖరనాయుడు



గుంటుపల్లిలో రీసర్వే అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో చంద్రశేఖరనాయుడు

బల్లికురవ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూ సర్వేతో గ్రామాలలో ఎన్నో దశాబ్దాల నుంచి ఉన్న భూ సమస్యలు పరిష్కారం అవుతాయని రైతులు దగ్గరుండి తమ భూములను సర్వే చేయించుకోవాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు పేర్కొన్నారు. శనివారం మండలంలోని గుంటుపల్లిలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెట్టమెదటి సారిగా చేపడుతున్న భూ సర్వేపై రైతులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో రైతులతో కలిసి ఆర్డీవో పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుంటుపల్లి రెవెన్యూలో రైతులకు పలు సమస్యలు అధికంగా ఉన్నాయని వాటి పరిష్కారానికి ఈ భూ సర్వే ఎంతో ఉపయెగ పడతుందన్నారు. రైతులందరు సర్వే టీంలు కొలతలు వేసే రోజు పొలాలకు వెళ్లి తమ వద్ద ఉన్న పట్టాదారు పాసు పుస్తకాలు, లింక్ డ్యాక్‌మెంట్లు, రిజిస్ట్రేషన్ స్టాంపులు అధికారులకు చూపించాలన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి భూ సర్వే లేక రైతుల భూములు రికార్డులో నమోదు కాకపోవడంతో రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరిత గతిన సర్వే పూర్తి చేయిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవినాయక్, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, సర్వే డీటీ ప్రహర్ష, మండల సర్వేయర్ కిషోర్‌కుమార్, టీడీపీ నేతలు మలినేని గోవిందరావు, దద్దాల అంజయ్య, వీఆర్వో రామక్రిష్ణ, మాదాల శివన్నారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బైటమంజులూరులో 30న సర్వే

పంగులూరు : భూముల రీ-సర్వేపై ఈ నెల 30న రైతులకు అవగాహన కల్పించేందుకు బైటమంజులూరు గ్రామంలో గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పి.సింగారావు తెలిపారు. రీ-సర్వేపై శనివారం బైటమంజులూరు గ్రామంలో రెవెన్యూ సిబ్బంది నిర్వహించిన అవగాహన ర్యాలీలో తహసీల్దార్ సింగారావు పాల్గొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బైటమంజులూరులో రీ-సర్వే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో మొత్తం 1635ఎకరాల 54 సెంట్ల విస్తీర్ణం ఉన్నట్లు తెలిపారు. ఆరు బ్లాకులుగా విభజించి 5 ప్రత్యేక బృందాలతో సర్వే చేపడతామన్నారు. ర్యాలీలో గ్రామ సర్పంచ్ రుక్మిణి, మాజీ సర్పంచ్ శివరాజు, తిరుమలరాజు, కృష్ణంరాజు, రెవిన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు. కోటపాడు గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పాస్ పుస్తకాలు కోరుతూ ఏడుగురు, భూమి కొలతలకు సంబంధించి ఐదు ధరఖాస్తులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సురేష్, స్థానిక నేత గడ్డం నాగేశ్వరరావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మేదరమెట్ల : రీ సర్వేను దైవాలరావూరులో పునఃప్రారంభిస్తున్నట్లు తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్వేయర్ మహేష్‌బాబు, రీ సర్వే డీటీ రవికాంత్, వీఆర్‌వో, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చినగంజాం : మండలంలోని మోటుపల్లి గ్రామంలో రీ సర్వేపై రైతుల్లో అవగాహన కల్పించడానికి శనివారం రెవెన్యూ అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు మాట్లాడుతూ గ్రామంలో రీ సర్వే కార్యక్రమం జరుగుతున్న సమయంలో సంబంధింత రైతులు హాజరై సర్వేకి సహకరించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. పొలాలకు చెందిన అన్ని పత్రాలను అధికారులకు అందజేసి సర్వేలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సుబ్బారావు, గ్రామ రెవెన్యూ అధికారులు, వీఆర్ఏలు, రైతులు పాల్గొన్నారు.

చీరాలటౌన్ : రీసర్వేపై అవగాహన కోసం ర్యాలీని తహసీల్దార్ గోపీకృష్ణ శనివారం మండల పరిధిలోని చీరాల రెవెన్యూ విలేజ్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రీసర్వే జనవరి నుంచి ప్రారంభమవతుందని చెప్పారు. భూ యజమానుల సమస్యల పరిష్కారం కోసం రీ సర్వేని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ అర్జున్, డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారి ముసలయ్య, సర్వేయర్ బ్రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పర్చూరు : పర్చూరు మండల పరిధిలోని రమణాయపాలెం గ్రామంలో రీసర్వేపై రెవెన్యూ అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. శనివారం తహసీల్దార్ పి.బ్రహ్మయ్య నేతృత్వంలోని సిబ్బంది గ్రామస్థులు, రైతులతో కలసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ డీటీ అరుణ, ఎంఎస్ బాలాంజనేయులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి.ప్రేమ్‌కుమార్, వీఆర్వోలు శ్రీనివాసరావు, హుస్సేన్ పాల్గొన్నారు.

మార్టూరు : రైతుల సమస్యలను పరిష్కరించేందుకు రీసర్వే ప్రారంభిస్తామని తహసీల్దార్ టీ ప్రశాంతి అన్నారు. శనివారం రాజుపాలెంలో రీసర్వేపై ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, టీడీపీ గ్రామ నాయకులు, సర్వేయర్ ఏడుకొండలు, జాష్టి వెంకటనారాయణ, అడుసుమల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యద్దనపూడి : మండలం పూనూరు గ్రామంలో శనివారం రీసర్వే ప్రారంభోత్సవ ర్యాలీని తహసీల్దార్ కే రవికుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్ఐ విష్ణు, పంచాయతీ కార్యదర్శి రాజు, టీడీపీ నాయకులు బోయపాటి సాంబశివరావు పాల్గొన్నారు.

ఇంకొల్లు : భూ రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ వెంకటరత్నం కోరారు. మండలంలోని ఇడుపులపాడు గ్రామంలో రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.




సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు


సమస్యల పరిష్కారంలో బాధ్యతగా పనిచేయాలి

సర్వసభ్యసమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసరావు

ఇంకొల్లు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి శాఖ అధికారులు బాధ్యతగా పని చేసి గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ బండారు అనూష అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ జేఈ అనంద్ మాట్లాడుతూ మండలంలో రూ.2కోట్ల20లక్షలతో 9 గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. పావులూరు నుంచి నాగండ్ల పీఆర్ రహదారి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జ్యోతి మాట్లాడుతూ 9 అంగన్‌వాడీ భవనాలలో తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం వంటి పనులు జరుగుతున్నాయన్నారు. కొమ్మమూరు కాల్వ నుంచి నీటిని ఇంకొల్లు నాగుల చెరువుకు పంపింగ్ చేసేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఏపీఎం అనూరాధ మాట్లాడుతూ స్త్రీనిధి రుణాలను డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బకాయిలు ఉన్న రూ.19లక్షలను త్వరితగతిన చెల్లించాలన్నారు.ఏపీవో రేణుకా మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పథకం కింద 25 పనులను గుర్తించామన్నారు. సమావేశానికి ఏవో వేణుగోపాల్, ఈవోఆర్డీ రాజ్యలక్ష్మి, వాణీ, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.



'సోమశిల'కు 3,300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 3,300 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 71.791 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 1,550, కండలేరుకు 800, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువ 350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



గత వైసీపీ పాలనలో కనిపించని అభివృద్ధిని అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే ఎన్డీఏ కూటమి చేసి చూపించింది. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసి అన్ని రంగాల్లో అభివృద్ధికి బాటలు వేస్తోంది. ప్రతి పేద కుటుంబం గౌరవ ప్రదమైన జీవనం గడపడం, గ్రామీణ పేదలు తమ సామాజిక ఆర్థిక అవసరాలను తీర్చుకోవడానికి అవసరమైన వనరులను సమకూర్చడానికి కృషి చేస్తోంది. ప్రతి పేద మహిళ లక్షాధికారి కావాలన్న సంకల్పంతో వారి అభివృద్ధికి అనేక పథకాలను రూపకల్పన చేస్తూ పేదరికంపై గెలుపు సాధించాలనే లక్ష్యంతో ముందడుగు వేస్తోంది.

- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)

మహా వైభోగం

- కూటమి ప్రభుత్వంలో 'సంక్షేమ' పరుగులు
- అన్ని వర్గాల్లో ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు

ఎస్‌ఆర్ శంకరన్ నాలెడ్జి సెంటర్లు



బీసీ సంక్షేమ శాఖపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. జిల్లాలో ఈ శాఖ పరిధిలోని వసతి గృహాల్లో ప్రత్యేకంగా ఎస్ఆర్ శంకరన్ నాలెడ్జ్ సెంటర్ల ఏర్పాటుకు రూ.4.45 కోట్లు విడుదల చేసింది. విద్యార్థులకు డిజిటల్ బోధన చేయడానికి పొదలకూరులోని బాలికల వసతి గృహ ప్రాంగణంలో, మహ్మదాపురంలోని బాలుర వసతి గృహ ప్రాంగణంలో, ఆత్మకూరులోని బాలికల, కావలిలోని బాలుర వసతి గృహ ప్రాంగణాలలో ఈ సెంటర్లను ఏర్పాటు చేశారు. డిజిటల్ బోధనకు పెద్ద స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. జనరల్ నాలెడ్జ్‌కు, ఇతర ప్రయోజనకర అంశాలపై ఈ కేంద్రంలో బోధన చేయనున్నారు.




పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లు

గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లు పేదల ఆకలి తీర్చాయి. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం వాటిని మూసేసింది. దీంతో పట్టణ ప్రాంతాలకు పనుల కోసం వచ్చే ఎందరో పేదలు పొట్టకూటి కోసం ఇబ్బందులు పడ్డారు. తిరిగి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆగస్టులో అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించింది. నెల్లూరులో 9, కందుకూరు, కావలి, ఆత్మకూరు తదితర ప్రాంతాలలోని అన్న క్యాంటీన్లలో రూ.5లకే కడుపు నింపుతున్నారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం పెడుతున్నారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

గత ఐదేళ్ళ పాటు వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన మధ్యాహ్నభోజనం ఇంటర్ విద్యార్థులకు మళ్లీ అందిచాలని నిర్ణయించారు. దీంతో జిల్లాలోని 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 6074 మంది విద్యార్థులకు మేలు జరగనుంది.

పాడి రైతుకు బాసట



పేదరైతు కుటుంబాల ఉపాధిగా ఉన్న పాడి మీద కూడా జగన్ ప్రభుత్వం పగబట్టింది. కనీస ప్రోత్సాహకాలు లేకుండా చేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పాడియావులను సంరక్షించుకునేందుకు గోకులాల పేరిట షెడ్లు నిర్మించి ఇస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో 1300 గోకులాలను నిర్మిస్తోంది.

బ్యాంకు లింకేజీ రుణాలు

పొదుపు సంఘాలలోని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలనే ఉద్దేశంతో ఆర్థిక భరోసాను కల్పించి తద్వారా పరపతిని పెంచాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. బ్యాంకుల ద్వారా రుణ సాయాన్ని ప్రతి మహిళ రూ.లక్ష నుంచి 2 లక్షల వరకు తీసుకునే వెసులు బాటు కల్పించి ప్రోత్సహిస్తోంది. 25,732 డ్వాక్రా గ్రూపులకు రూ.1,277.13 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను ఇవ్వాలని డీఆర్‌డీఏకు లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇప్పటివరకు 10522 గ్రూపులకు రూ.838.88 కోట్ల రుణాలు అందచేసింది. అదేవిధంగా స్త్రీనిధి ద్వారా 17,688 గ్రూపులకు రూ.118.06 కోట్ల రుణాలు మంజూరు చేసింది.



ఒకటో తేదీనే జీతాలు, పెన్షన్లు



ప్రభుత్వ ఉద్యోగులు జీతాల కోసం, మాజీ ఉద్యోగులు పెన్షన్ల కోసం రోజుల తరబడి ఎదురుచూసే పరిస్థితి జగన్ ప్రభుత్వంలో ఉండేది. కూటమి ప్రభుత్వం ఈ నాన్చుడు ధోరణికి స్వస్తి చెప్పింది. ఇప్పుడు ఒకటో తేదీనే జిల్లాలోని సుమారు 32వేల మంది ప్రభుత్వ రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు అందుతున్నాయి. 20వేల మంది రిటైర్డు ఉద్యోగుల కుటుంబాలూ ధీమాగా పెన్షన్లు అందుకుంటున్నాయి.

అవ్వాతాతల్లో ఆనందం




సామాజిక పింఛన్‌ను రూ.3వేలు ఇస్తామంటూ 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చాక జగన్ మడమ తిప్పేశారు. కేవలం ఏడాదికి పింఛన్‌ను రూ.250 మాత్రమే పెంచింది. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.3వేలు ఉన్న పింఛన్‌ను రూ.4వేలకు పెంచింది. దివ్యాంగులకు, దీర్ఘకాలిక రోగులకు అందించే రూ.3వేల పింఛన్‌ను రెండింతలు చేసి రూ.6వేలకు పెంచింది. జిల్లాలో మొత్తం సామాజిక పెన్షన్‌దారులు 3,10,029 మంది ఉండగా, ప్రతినెలా 131.63 కోట్ల పెన్షన్ మొత్తాన్ని అందజేస్తోంది. వీటిలో వృద్ధాప్య పింఛన్లు 1,65,356, వితంతు పెన్షన్లు 73726, దివ్యాంగ పెన్షన్లు 32,773 ఉన్నాయి.

సంక్షేమ హాస్టళ్లకు నిధులు

వైసీపీ ప్రభుత్వంలో నిధులు సక్రమంగా విడుదల చేయకపోవటంతో సంక్షేమ వసతి గృహాల్లో అంధకారం అలముకుంది. ఎన్నో భవనాల్లో పైకప్పు, పెచ్చులూడి పైన పడుతున్నా, శిథిలావస్థకు చేరినా, డ్రైనేజీ వ్యవస్థ దుర్భరంగా ఉన్నా పట్టించుకోలేదు. ఇన్ని అవస్థలపై అధికారులు మొరపెట్టుకున్నా గత పాలకులు పెడచెవిన పెట్టారు. దీంతో వసతి గృహాల్లో చదువుతున్న పేదింటి విద్యార్థులు అక్కడ ఉండలేక నానా ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వసతి గృహాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. జిల్లాస్థాయి నుంచి నివేదికలు తెప్పించుకుని నిధుల విడుదలకు పూనుకుంది. జిల్లాలోని 64 సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో అభివృద్ధి పనులకు రూ.9 కోట్లు మంజూరు చేసింది. పంచాయితీరాజ్ ఇంజనీరింగ్, ఆర్‌డబ్ల్యుఎస్‌ల ఆధ్వర్యంలో పనులు మొదలు పెట్టనుంది.

వంటింట్లో దీపం-2

ఎన్డీఏ ప్రభుత్వం కొలువుదీరిన కొద్ది రోజులకే రేషన్‌కార్డుదారులకు దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ పంపిణీ చేసింది. సూపర్ సిక్స్ హామీలలో భాగంగా దీపం పథకం-2 కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేయడానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో నవంబరు నెల ఒకటవ తేదీ నుంచి సిలిండర్లను పంపిణీ చేస్తున్నారు. 7.33 లక్షల రేషన్ కార్డుదారులు ఉండగా, వీరిలో 4.9 లక్షల మంది దీపం-2 పథకానికి అర్హులుగా తేల్చారు. వీరిలో 4.8 లక్షల మందికి సిలిండర్లు అందజేయగా, సుమారు రూ.40.32 కోట్లు బ్యాంకు ఖాతాలో జమచేశారు.



కన్నతండ్రినే కడతేర్చాడు!

- గొడ్డలితో నరికి చంపిన కుమారుడు

కొడవలూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రెక్కలు ముక్కలు చేసుకుని పెంచి పెద్ద చేసిన కొడుకే ఆయన పాలిట యముడిలా మారాడు. తాగుడుకు బానిస అయినందుకు మందలించడమే ఆ తండ్రి చేసిన పాపం. కోపోద్రిక్తుడైన కుమారుడు గొడ్డలితో విచక్షణారహితంగా నరికి చంపాడు. కొడవలూరు మండలం యల్లాయపాలెం తెల్లమిట్ట గిరిజన కాలనీలో శనివారం జరిగిన ఈ ఘటన కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు.. యల్లాయపాలెం గ్రామానికి చెందిన పొట్లూరు పోలయ్యకు (55) ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. రెక్కాడితేగాని డొక్కాడని పోలయ్య రోజువారి పనులు చేసి వచ్చే సంపాదనతో బిడ్డలను పెంచి, పెద్దచేశాడు. ముగ్గురికి పెళ్లిళ్లు చేశాడు. అయితే, రెండో కుమారుడు పొట్లూరి సుబ్రహ్మణ్యం గ్రామంలో జులాయిగా తిరిగేవాడు. భర్తతో విభేదాల కారణంగా భార్య దూరంగా ఉండటంతో మద్యానికి బానిస అయ్యాడు. శనివారం ఉదయం 10 గంటల సమయంలో ఇంట్లో ఉన్న పోలయ్య తన కుమారుడు సుబ్రహ్మణ్యంను బాధ్యత లేకుండా తాగుతున్నావంటూ నిలదీశాడు. దీంతో వారి మధ్య మాటమాట పెరిగి ఘర్షణ చోటుచేసుకుంది. కోపోద్రిక్తుడైన సుబ్రహ్మణ్యం ఇంట్లో ఉన్న గొడ్డలిని తీసుకొని పోలయ్య తలమీద, చాతిమీద నరికాడు. దీంతో పోలయ్య బిగ్గరగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చే సరికి సుబ్రహ్మణ్యం పరారయ్యాడు. అప్పటికే తీవ్రంగా గాయపడిన పోలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సీఐ సురేంద్రబాబు, ఎస్ఐ కోటిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. గ్రామస్థులను అడిగి వివరాలు సేకరించి, కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిందితుడిని త్వరగా పట్టుకుంటామని చెప్పారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



పోలయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ సురేంద్రబాబు



ఇంటికి అందం.. మొక్కతో బంధం!

- నగరంలో వెలుస్తున్న నర్సరీలు
- దేశీయంతోపాటు విదేశీ మొక్కలూ విక్రయాలు
- రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ



ప్రకృతి ప్రియులకు పచ్చని మొక్కలు అంటే మహా ఇష్టం. అవి ఎక్కడున్నా సరే పరుగులుతీసి మరీ ఇంటికి తెచ్చుకుంటారు. అలాంటిది నెల్లూరు నగరంలో భవిష్యత్తుకు ప్రాణవాయువు లాంటి అందమైన పూల, పండ్ల, మొక్కలు అందుబాటులో ఉంటే ఇక వారిని ఆపేదెవరు?. ట్రంకురోడ్డు, మినీబైపాస్ రోడ్డు, కృష్ణపట్నం పోర్టు రోడ్డు, జొన్నవాడ రోడ్డు ఇలా నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులకు ఇరువైపులా నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలను విక్రయిస్తున్నారు. ఎన్ని రూ.కోట్లు ఖర్చు చేసి ఇల్లు కట్టుకున్నా ఇంటిముందు అందమైన మొక్కలు ఉంటే ఆ ఇంటికే అందాన్ని ఇస్తుంది. అలాంటి మొక్కలు వందల రకాలు నగరంలో లభ్యమవుతుండగా, రూ.50 నుంచి రూ.లక్ష వరకు ధర పలుకుతున్నాయి.

- వివరాలు 6లో..



భక్తజనం నడుమ ముందుకు సాగుతున్న రథం, రథంపై కొలువుదీరిన ఉత్సవర్లు



హరేరామ.. హరేకృష్ణ..!


- కావలిలో వేడుకగా జగన్నాథుడి రథయాత్ర
- అడుగడుగునా భక్తుల నీరాజనం

'హరేరామ.. హరేకృష్ణ... కృష్ణ కృష్ణ హరే హరే' అంటూ భక్తుల నామస్మరణలతో కావలి పట్టణం మారుమోగిపోయింది. శనివారం సాయంత్రం అశేష భక్తజనం నడుమ జగన్నాథుడి రథయాత్ర వేడుకగా సాగింది. నెల్లూరులోని ఇస్కాన్ మందిర అధ్యక్షుడు సుఖదేవ్ మహరాజ్ పర్యవేక్షణలో జరిగిన వేడులను ఎమ్మెల్యే కృష్ణారెడ్డి జెండా ఊపి రథాన్ని ముందుకు కదలించారు.

- వివరాలు 6లో..

మంచు దుప్పటిలో సంగం

సంగం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం తెల్లవారు జామున మంచు దట్టంగా ఏర్పడింది. ఈ మంచు వల్ల రహదారి కనిపించక వాహనాలు లైట్లు వేసుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం 8 గంటలైనా మంచు తగ్గలేదు. సంగంపై దుప్పటి కప్పినట్లు మంచు వ్యాపించింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.





ఆగ్రహం

విడవలూరులో ఆందోళన చేస్తున్న ఎంపీడీవో, ఉద్యోగులు

అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై వైసీపీ మూకల దాడిని నిరసిస్తూ జిల్లావ్యాప్తంగా రెవెన్యూ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయాల వద్ద అధికారులు, సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీవోపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మాలకొండ ఆదాయం రూ. 9,05,080

వలేటివారిపాలెం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మాల్యాద్రి లక్ష్మీనృసింహ స్వామి ఆలయానికి శనివారం భక్తుల నుంచి రూ.9లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.వి సాగర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్, కుంకుమార్చన, వివాహాలు, తలనీలాలు, వాహనపూజ, ప్రత్యేకదర్శనం, స్థలపురాణ పుస్తకాలు విక్రయాలు ఇతర మార్గాలతో ఆదాయం వచ్చిందని సాగర్ బాబు పేర్కొన్నారు.



ఇంటికి అందం.. మొక్కతో బంధం!

నగరంలో వెలుస్తున్న నర్సరీలు

దేశీయంతోపాటు విదేశీ మొక్కలూ విక్రయాలు

రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ

ఎన్ని రకాల ఇండోర్ మొక్కలో..

నెల్లూరురూరల్, (ఆంధ్రజ్యోతి) : రూ.కోట్లు పెట్టి ఇల్లు కట్టుకున్నా.. రూ.లక్షలు పెట్టి ఇంటీరియల్ చేయించుకున్నా.. రూ.వేలు వెచ్చించి ద్వారాలు పెట్టుకున్నా ఏదో వెలితి గానే ఉంటుంది. అదే పచ్చని మొక్కలు ఉంచితే చాలు ఆ ఇంటికే అందాన్ని తెచ్చి పెడుతుంది. ఈ పద్ధతినే పాటిస్తున్నారు మన నెల్లూరీయులు. వారికున్నది పూరి గుడిసె అయినా.. ప్యాలెస్ అయినా సరే ఇంటి ముందు ఖచ్చితంగా శోభనిచ్చే మొక్కలు ఉండాల్సిందే. కాస్తంత ఖాళీ స్థలముంటే పండ్ల మొక్కలు అందులో వేయాల్సిందే. ఇలా ప్రకృతిప్రియులను మొక్కలు ఆకర్షిస్తుండటంతో వాటి అమ్మకాలకు గిరాకీ పెరిగింది. గతంలో మొక్క కావాలంటే నెల్లూరులో వెతుక్కుంటూ వెళ్లాల్సిన దుస్థితి ఉండేది. లేదా తెలిసిన వారింట్లో అడిగి తెచ్చుకునేవారు. ఇప్పుడు పూర్తిగా భిన్నమైన వాతావరణం ఏర్పడింది. నగరంలో ఎటు చేసినా మొక్కల నర్సరీలే దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా మినీబైపాస్ రోడ్డు, ముత్తుకూరు రహదారి, మైపాడు రోడ్డు, జీఎన్‌టీ రోడ్డు, పొదలకూరు రోడ్డు ప్రాంతాలలో అనేక రకాల మొక్కలు ఆకర్షిస్తున్నాయి. రూ.20 నుంచి మొదలు రూ.వేలలో అందమైన అరుదైన మొక్కలు ఈ నర్సరీల్లో లభ్యమవుతున్నాయి. మన పూర్వీకుల నుంచి ఈ మొక్క ల సంతతి తెలిసిందే అయినా హైబ్రీడ్ రకాలతో వివిధ ఆకర్షణీ యమైన పూలతో కొత్త ఒరవడిని సృష్టిస్తున్నాయి. ఇండోర్, అవుట్‌డోర్, టేబుల్ మొక్కలంటూ అనేక రకాలు మార్కెట్లోకి వచ్చాయి.





అరె.. భలే ఉన్నాయే!

దేశ, విదేశాల నుంచి దిగుమతి

తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి వివిధ రకాల మొక్కలను వ్యాపారులు దిగుమతి చేసుకుని నగరంలో విక్రయిస్తున్నారు. కానీ నెల్లూరు - జొన్న వాడ రహదారి పొట్టేపాళెం కలుజుదాటాక గార్డెన్ వరల్డ్స్‌లో 1500 రకాల మొక్కల ప్రపంచమే ఉంది.

మనుబోలు మండలం వీరంపల్లికి చెందిన జెట్టి నవీన్‌రెడ్డి ప్రపంచ వ్యాప్తంగా అరుదైన మొక్కలను దిగుమతి చేసుకుని ప్రకృతిప్రియులకు అందుబాటు ఉంచారు. రూ.50 నుంచి రూ.లక్ష వరకు ఇక్కడ వివిధ రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. ప్రధానంగా డార్జిలింగ్ ఆరంజ్, బోన్ సాయి, పచ్చిరా, చైనాడాల్, యాంథోరియం, ఆగ్లోనిమా, క్యాక్టర్స్, సక్యూలెన్స్, పీస్‌లిల్లీ వంటి విదేశీ సంతతికి చెందిన మొక్కలను చైనా, థాయిలాండ్, వియాత్నం, మన దేశంలోని గుజరాత్, ఢిల్లీ ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నారు. ఇంటికే కాకుండా కార్యాలయాలు, వాణిజ్య సముదాయాల్లో ఉంచే బోన్‌సాయి మొక్కలు ఇక్కడ ప్రత్యేకం.



పండ్ల మొక్కల్లోనూ రకాలు

మనం తరచూ చూసే మామిడి మొక్కల్లో ఒకటీ రెండు రకాలు మాత్రమే తెలుసు. కానీ నర్సరీల్లో అనేక హైబ్రీడ్‌కు చెందిన 30 రకాలు ఉన్నాయి. ఇక జామ 6, సపోట 4, కొబ్బరి 6 హైబ్రీడ్ రకాలను కొనుగోలు దారులకు అందుబాటులో ఉంచారు. ఇవి రూ.50 నుంచి ఐదు వేల వరకు వివిధ సైజులు, రకాల్లో ఉన్నాయి. కొన్ని నర్సరీల నిర్వాహకులు దేశీయ మొక్కలకు జీవం పోస్తుండగా, విదేశీ సంతతికి చెందిన మొక్కలను మాత్రం ప్రత్యేకించి దిగుమతి చేయించుకుంటున్నారు. ఇవీ పూర్తిగా అవుట్‌డోర్ మొక్కలు కావడంతో ప్రతికూల వాతావర ణాన్ని తట్టుకునే విధంగా వీటి తయారీ ఉందని నర్సరీదా రులు చెబుతున్నారు.



ఎన్ని రకాల మొక్కలో..



మొక్కను ఇలా అందంగా మలిచి...

● లక్ష మొక్కలే లక్ష్యంగా..

మనం బతకడానికి వ్యాపారం చేయాలి.. పదిమందిని బతికం చడానికి ప్రజాసేవ చేయాలి. ఇదే ఆచరిస్తు న్నారు గార్డెన్ వరల్డ్స్ అధినేత జెట్టి నవీన్‌రెడ్డి. లక్ష మొక్కలు ప్రకృతి ఒడిలోకి చేర్చాలన్న లక్ష్యంతో ప్రతి వారం అనేక సంస్థలకు వెయ్యి మొక్కలను అందిస్తు న్నారు. పండ్లు, నీడనిచ్చే మొక్కలను అందచేస్తున్నారు. ఎవరైనా సరే తనను సంప్రదిస్తే ఈ తరహా మొక్కలను ఉచితంగా ఇస్తానని చెబుతున్నారు. ప్రభుత్వ సంస్థలతో భాగస్వామ్యమై పాఠశాలలు, కార్యాలయాలు, రోడ్లు, కూడళ్ల వంటి ప్రాంతాలలో మొక్కలు అందచేసేం దుకు తాను సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

మొక్కలంటే బాగా ఇష్టం



మాకు మొక్కలంటే బాగా ఇష్టం. ఇష్టమైన మొక్కలను నర్సరీలో కొనుగోలు చేసి ఇంట్లో పెంచుకుంటాము. ఎప్పుడూ చూడని మొక్కలు, అరుదైనవి ఇక్కడ దొరుకు తున్నాయి. ధర కూడా అందుబాటులోనే ఉన్నాయి.

- డీ క్రిష్ణారావు, వై మోహన్, కొండ్లపూడి సంఘం

మొక్కలు పెంచుకుంటే అదోతృప్తి



మొక్కలను ఇంట్లో పెంచుకుంటే అదోకతృప్తి. వీటిని చూడగానే మనసు కు హాయిగా ఉంటుంది. మొక్కలను పెంచడం మా పెద్దవాళ్ల నుంచి అలవాటు అయ్యింది. ప్రతి రోజూ వాటిని చూసు కుంటూ సంరక్షించుకుంటూ ఉండటమంటే మాటల్లో చెప్పలేము.

- జీ శ్రావణ్‌కుమార్, కవిత, బీవీనగర్ నెల్లూరు



పాము కాదు.. ఇది మొక్కే!



మొక్కలే కాదండోయ్.. కుండీలూ అందంగా ఉంటాయ్!



అవుట్‌డోర్ మొక్కలు..





ఇది డార్జిలింగ్ ఆరెంజ్

అన్ని రకాల మొక్కలున్నాయ్!



మాది వ్యవసాయ కుటుంబం కావడం ఈ నర్సరీ ఏర్పాటుకు ప్రధాన కారణమైంది. నిమ్మ మొక్కలేసి చెట్లుగా పెంచేవాడిని. అలా అలవాటై ఇప్పుడు ప్రకృతిప్రియులకు అవసరమైన అన్ని రకాల మొక్కలను అందుబాటులో ఉంచాము. మన దేశ సంతతితోపాటు విదేశీ మొక్కలనూ తెప్పించి, అమ్ముతు న్నాము. వ్యాపారంకాక లక్ష మొక్కలు నాటాలన్నదే నా లక్ష్యం కూడా.

- జెట్టి నవీన్‌రెడ్డి, గార్డెన్ వరల్డ్స్ అధినేత

పొదుపు మహిళలను పారిశ్రామిక వేత్తలు చేయండి : మెప్మా పీడీ



శిక్షణలో మాట్లాడుతున్న రాధమ్మ

నెల్లూరు (హరనాథపురం); డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పొదుపు మహిళలకు తగిన అవగాహన కల్పించి పారిశ్రామిక వేత్తలుగా చేయాలని మెప్మా ప్రాజెక్టు డెరెక్టర్ ఏ. రాధమ్మ ఆర్పీలను ఆదేశించారు. నెల్లూరులోని కార్పొరేషన్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఆర్పీలకు మెప్మా ఆధ్వర్యంలో 100 రోజుల కార్యక్రమాలపై శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొదుపు మహిళలు అన్నీ రంగాలలో రాణిస్తున్నారని తెలిపారు. పరిశ్రమల స్థాపనకు సంబంధించి వారికి సరైన అవగాహన కల్పిస్తే వారు పారిశ్రామిక వేత్తలుగా మారుతారన్నారు. కార్పొరేషన్ అదనపు కమిషనర్ నందన్ మాట్లాడుతూ మెప్మా 100 రోజుల కార్యక్రమాలను విజయవంతం చేయడానికి, ఆర్పీలు అన్నీ విషయాలను అవగాహన చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీఈలు అంకయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంకును లాభాల్లో నడుపుతాం

● చైర్మన్ అరిగెల నాగేంద్రసాయి

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : అర్బన్ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించటం ద్వారా లాభాల బాటలో నడుపుతామని ఆ బ్యాంకు చైర్మన్ అరిగెల నాగేంద్రసాయి చెప్పారు. నగరంలోని ఆ బ్యాంకు సమావేశ మందిరంలో శనివారం 109వ మహాజనసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బ్యాంకు ద్వారా బంగారు రుణాలతో పాటు, డిపాజిట్లపై అధికశాతం వడ్డీ ఇస్తున్నామని చెప్పారు. గృహరుణాలు కూడా అందచేస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో ఆ బ్యాంకు సీఈవో మాగుంట అనిత తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులం షెడ్లు ప్రారంభం



షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా పలుకూరు, జిల్లెలమూడి రైతులు కొండూరి సుస్మిత, షేక్ మస్తానమ్మ నిర్మించుకున్న నూతన మినీ గోకులం షెడ్లను శనివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ముందుగా ఆయన పలుకూరులో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గత వైసీపీ ప్రభుత్వం గోకులం షెడ్లని పూర్తిగా విస్మరించిందని పాడిరైతుల అభివృద్ధి, సన్నకారు రైతుల ప్రోత్సాహకం కోసం కూటమి ప్రభుత్వం ఈ చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గానికి మొదటి దశలో 89మినీ గోకులం షెడ్లు వచ్చా యన్నారు. గొర్రెలు, మేకలు పెంపకందా రులకు 90శాతం సబ్సిడీ, కోళ్ల పెంపకందారులకు 70శాతం సబ్సిడీ వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రత్నజ్యోతి, డ్వామా ఏపీడీ బాబూరావు, టీడీపీ మండలాధ్యక్షుడు నార్నె రోశయ్య బొద్దులూరి కొండలరావు, యడ్లపల్లి వెంకట నరసింహ్మా, బోయపాటి రమేష్, బెజవాడ శ్రీను, రావెళ్ల వెంకటేశ్వర్లు, ముప్పాళ్ల శ్రీనివాసులు, ఈదర సుధాకర్ పాల్గొన్నారు.

ఎస్సీ జాబితాపై అభ్యంతరాలు తెలపండి

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) ! కులగణపలో సేకరించిన ఎస్సీల వివరాల జాబితాను గ్రామ, వార్డు సచివాలయాల నోటీసు బోర్డుల్లో ఉంచామని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోషల్ ఆడిట్ కోసం ఈ జాబితాను ఉంచామని తెలిపారు. ఈ జాబితాపై అభ్యంతరాలను ఈనెల 31వతేదీలోగా స్వీకరిస్తారని తెలిపారు.

నీ కోసం కాదు.. కుటుంబం కోసం హెల్మెట్ వాడు..

ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసేవారు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని, అనుకోని ప్రమాదం జరిగినా తలకు ఎలాంటి గాయాలు కాకుండా అది కాపాడుతుందని కావలి డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. హెల్మెట్ల అవసరాన్ని తెలియచేస్తూ శనివారం కావలిలో పోలీసులు, సిబ్బంది తో స్థానిక డీఎస్పీ కార్యాలయం నుంచి హెల్మెట్లు ధరించి ట్రంకు రోడ్డులో మోటారు సైకిళ్లపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మన మీద ఎన్నో ఆశలతో పెట్టుకున్న కుటుంబాలు ఉన్నాయన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఒకటో, రెండో పట్టణ సీఐలు పిరోజ్, గిరిబాబు, కావలి సర్కిల్ సీఐ పాపారావు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

- కావలి, (ఆంధ్రజ్యోతి)



హెల్మెట్లు ధరించి ర్యాలీలో పాల్గొన్న పోలీసులు

జగన్నాథ రథయాత్రతో ఆధ్యాత్మిక శోభ

● అడుగడుగునా భక్తుల నీరాజనం

కావలి టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం నిర్వహించిన జగన్నాథ రథయాత్రతో ఆధ్యాత్మికశోభ సంతరించుకుంది. నెల్లూరు ఇస్కాన్ మందిర అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవ్ మహరాజ్ పర్యవేక్షణలో జరిగిన వేడులను ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు ట్రంకు రోడ్డు ఆర్ఎస్ఆర్ మండపం వద్ద ఏర్పాటు చేసిన వేదికలో వారు ప్రముఖులు ఆధ్యాత్మిక ప్రవచనాలు అందించారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ కృష్ణభగవానుడు సర్వమానవాళి సంస్కరణ కొరకు శాంతి సన్మార్గం, ధర్మ శ్లోకాలు, సూక్తులు ఆచరణీయం అన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల, మహిళల కోలాటాలు, వివిధ బృందాలు వేషాధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రెడ్‌క్రాస్, రోటరీ క్లబ్, పలు స్వచ్ఛంద సంస్థలు, విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఈ యాత్రలో సేవలందించారు. డీఎస్పీ శ్రీధర్ పర్యవేక్షణలో సిబ్బంది బందోబస్తును పర్యవేక్షించారు. రథయాత్ర నిర్వాహణకు నల్లూరు రవికుమార్, జయచంద్రానాయుడు, రమేష్ నాయుడు, వెంకటసుబ్బయ్య, గోపికృష్ణ, సువర్ణశ్రీను సహకరించారు.



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి

పక్కా గృహాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి

ఉదయగిరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పక్కాగృహాల లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేయాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్ సూచించారు. శనివా రం మండలంలోని కొండాయపాళెం పంచాయతీ గంగిరెడ్డిపల్లి గ్రామం వద్ద ఏర్పాటుచేసిన లే అవుట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఇళ్ల నిర్మా ణాలకు సంబంధించి మెటీరి యల్ సిద్ధంగా ఉందని, బిల్లు పెట్టిన వారం రోజుల్లోనే నగదు వారి ఖాతాల్లో జమవుతుందన్నారు. కావున లబ్ధిదారులు 2025 మార్చి నాటికి పక్కాగృహ నిర్మాణాలను పూర్తిచేసు కోవాలన్నారు. ఉదయగిరి లేఅవుట్‌లో ఆప్షన్-3 కింద కాంట్రాక్టర్ 140 పక్కాగృహాల నిర్మాణాలు చేపట్టారన్నారన్నారు. లేఅవుట్‌లలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ పీరా, వర్క్ఇన్‌స్పెక్టర్లు హర్షవర్ధన్‌రెడ్డి, చెన్నరాయుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న పీడీ వేణుగోపాల్

ఆత్మకూరు చెరువు అభివృద్ధికి కృషి

ఆత్మకూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఆత్మకూరు చెరువు అభివృద్ధికి కృషిచేస్తామని అందుకు జలవనరుల శాఖ అధికారులు సహకరించాలని సాగునీటి సంఘం నూతన అధ్యక్షుడు మాదాల మస్తాన్‌నాయుడు కోరారు. శనివారం స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో ఈఈ వెంకటేశ్వర్లును, ఆత్మ కూరు చెరువు సాగునీటి సంఘం పాలకవర్గ సభ్యులను టీడీపీ నేతలు సన్మానించారు. ఈసందర్భంగా వారు ఆత్మకూరు చెరువు నీటిపారుదల, సామర్థ్యం, సాగునీటి కాలువల మరమ్మతులు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. రెండు పంటలకు చివరి ఆయుకట్టు వరకు సాగునీరు అందించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, రూరల్ అధ్యక్షుడు సుంకర పెంచలచౌదరి, ప్రధాన కార్యదర్శి కేతా విజయ భాస్కర్‌రెడ్డి, తెలుగు యువత ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, సొసైటీ మాజీ చైర్మన్ చిట్టమూరు వెంకటేశ్వర్లురెడ్డి, వైస్ చైర్మన్ డేగా పెంచలరెడ్డి, డైరెక్టర్లు చిట్టమూరు వెంకురెడ్డి, నరసింహారెడ్డి, సుమలత పాల్గొన్నారు.


ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లును, పాలకవర్గ సభ్యులను సన్మానించిన టీడీపీ నేతలు

టీడీపీ సభ్యత్వాలు వేగవంతం చేయాలి

కొండాపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం సభ్యత్వాలను వేగవంతం చేయాలని మండల మాజీ వైస్ చైర్మన్ పోలినేని చంద్రబాబునాయుడు తెలిపారు. శనివారం ఆయన మండలకేంద్రంలో టీడీపీ నాయకులతో సమావేశమై మాట్లాడారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల నాయకులు ఇప్పటి వరకు 9వేలకు పైగా పార్టీ సభ్యత్వాలు చేసినట్లు తెలిపారు. ఈనెల 30వరకు పార్టీ సభ్యత్వ నమోదుకు అవకాశం ఉందని ఇప్పటికీ నమోదు కాని వారితో చేయించాలని కోరారు. సభ్యత్వ కలిగే ప్రయోజనాలను వివరించాలని నాయకులు, కార్యకర్తలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో నేతలు సుధాకర్, తిరుపతిరెడ్డి, నరేంద్ర, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● మర్రిపాడు : మండలంలోని 13మంది నాయకులు శనివారం టీడీపీ శాశ్వత సభ్యత్వాలు తీసుకున్నారు. విజయవాడలో దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కలిసి ఆయన సమక్షంలో సభ్యత్వాలు తీసుకున్నట్లు టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుట్టం బ్రహ్మారెడ్డి తెలిపారు.


మర్రిపాడు: మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో సభ్యత్వాలు తీసుకున్న నేతలు

సినిమా టిక్కెట్ ధరలు పెంచొద్దు

కావలి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో కొత్త సినిమాల టిక్కెట్ ధరలు పెంపునకు ప్రభుత్వం ప్రత్యేక జీవోలు ఇవ్వవద్దని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి తెలిపారు. శనివారం ఈ విషయంపై ఆయన సంఘం సభ్యులతో స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపి ఆర్డీవో వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. సినిమా అగ్రహీరోలకు వాళ్ల సినిమాలు రిలీజ్ అయినపుడు కొత్త జీవోలు ఇస్తే వంద రూపాయల టిక్కెట్‌ను రూ.వెయ్యికి అమ్ముతూ సామాన్య జనాలను దోపిడీ చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనార్దన్, హుస్సేన్, వెంకటరత్నం పాల్గొన్నారు.


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మల్లి

ఎంపీడీవోపై దాడిని ఖండిస్తూ నిరసన

వలేటివారిపాలెం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీఓ జవహర్ బాబుపై దాడిని ఖండిస్తూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఎంపీడీఓ నరేంద్రదేవ్‌తో పాటు సిబ్బంది నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

●వింజమూరు : అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీఓ జవహర్ బాబుపై దాడి చేయడం పట్ల శని వారం మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బం ది నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


వలేటివారిపాలెం: నిరసన చేస్తున్న ఎంపీడీవో, సిబ్బంది

● కావలి రూరల్ : అన్నమయ్య జిల్లా గాలివీడు ఎమ్పీడీవో జవహర్‌బాబుపై దాడి చేయడం అమానుషం అని మండల ఎమ్పీడీవో శ్రీదేవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి కార్యాణ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్పీడీవో శ్రీదేవి మాట్లాడారు. దాడి చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాల అడ్డగింపు

కావలి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మానస థియేటర్ సమీప రోడ్డులో అక్రమంగా చేపట్టనున్న అక్రమ నిర్మాణాలను శనివారం మున్సిపల్ సిబ్బంది అడ్డుకున్నారు. ఆర్వోబీ వంతెన నిర్మాణానికి ప్రయివేట్ వ్యక్తుల స్థలాలలను గతంలో సేకరించి వారికి పరిహారం చెల్లించారు. ఈ స్థలంలోని కొన్ని భవనాలను కూడా తొలగించారు. అయితే ఆర్వోబీ వంతెన నిర్మాణం జరుగక ఆ స్థలం ఖాళాగా ఉండటంతో గతంలో స్థలం ఇచ్చిన వారు ఆ స్థలంలో నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ విషయం తెలసుకున్న మున్సిపల్ అధికారులు తమ సిబ్బందిని పంపి నిర్మాణాలు నిలిపివేయించారు. అవసరమైతే పార్కింగ్‌కు ఆ స్థలం వాడుకోవచ్చని తాత్కాలిక నిర్మాణం చేపట్టినా సహించమని హెచ్చరించారు.


ప్రభుత్వ స్థలంలో అక్రమంగా చేపట్టిన నిర్మాణం

ఉపాధి కూలీ కుటుంబానికి ఆర్థిక సాయం

కందుకూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీ నలదలపూరు కుంచాల కొండమ్మ కుటుంబసభ్యులకు శనివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు రూ.50వేలు ఆర్థికసాయం అందజేశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల నుంచి ఈ మొత్తాన్ని అందజేసినట్లు ఏపీడీ జె. బాబూరావు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ మహేష్, మన్నం కృష్ణ, మన్నం ఉమామహేశ్వరరావు, కంద్రా శ్రీను, బత్తిన కృష్ణారావు పాల్గొన్నారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు

● ప్రజల అవస్థలు
● పట్టించుకోని అధికారులు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని వరికుంటపాడు మండలంలో సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. ఇతరత్రా వసతుల సంగతి అటుంచితే గ్రామాల రహదారులు అధ్వాన్నంగా మారినా పట్టించుకునే నాథుడే లేడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నానా కష్టాలు అనుభవించిన పల్లె ప్రజలు కూటమి ప్రభుత్వం పల్లె పండుగ పేరుతో సిమెంట్ రోడ్లను మంజూరు చేయడంతో సంబరపడ్డారు. ఇక తమ కష్టాలు తీరినట్లేననే ఆశపడిన ప్రజలు నిరాశకు గురవుతున్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు చేయడంతో పాటు గ్రామాల్లో సిమెంట్ రోడ్ల పనులు జోరుగా సాగుతుండడం మంచి పరిణామమే అయినప్పటికీ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల వెంట ప్రయాణం నరకప్రాయంగా మారింది. రోజుల తరబడి కురిసిన వర్షాల పుణ్యమా అని సిమెంట్ రోడ్లతో సహా గుంతల మయంగా మారిన గ్రావెల్ రహదారుల్లో ఎక్కడి నీరు అక్కడే నిలిచి ప్రమాదాలకు నిలయంగా మారాయి. జీ.కొత్తపల్లి, నల్లబోతులవారిపల్లి, యర్రంరెడ్డిపల్లి, గొల్లపల్లి, విరువూరు, సాతువారిపల్లి తదితర గ్రామాల్లో ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయి.


గొల్లపల్లిలో బురదమయంగా మారిన సిమెంటు రోడ్డు

కలగా మిగిలిన రింగురోడ్డు

ఇదంతా ఒకవంతైతే రామాపురం జాతీయ రహదారి నుంచి హుస్సేన్ నగర్ మీదుగా కాకొల్లువారిపల్లి జాతీయ రహదారి వరకు మంజూరైన రింగురోడ్డు నిర్మాణం ఏళ్ల తరబడి ప్రారంభానికి నోచుకోక పోవడం దారుణం. దీంతో ఆయా గ్రామాల ప్రజలు మోకాలి లోతు గుంతల నడుమ బురదమయంగా మారిన గ్రావెల్ రహదారి వెంటే ప్రయాణాలు సాగించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ రహదారికి ఆనుకునే పాఠశాలలు, వసతిగృహం ఉండడంతో ప్రజలతో పాటు ప్రతినిత్యం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు అడుసు తొక్కుకుంటూనే అడుగులు వేయాల్సి వస్తోంది. గతంలో టీడీపీ, వైసీపీ ప్రభుత్వాల హయాంలో రెండుసార్లు టెండర్ల ప్రక్రియ పూర్తయినప్పటికీ పనులు చేపట్టకపోవడం ఆప్రాంత వాసులకు శాపంగా మారింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో అధ్వానంగా మారిన ప్రధాన రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామస్థులు కోరుతున్నారు.

నిర్ణీత గడువులో రెవెన్యూ సమస్యల పరిష్కారం

ఉదయగిరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడినరవలో శనివారం తహసీల్దారు సుభద్ర రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసదస్సుల్లో ప్రజలు, రైతులు పలు సమస్యలపై అర్జీలు అందజేశారు. అర్జీలను పరిశీలించి త్వరలో పరిష్కారమార్గం చూపుతామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సురేంద్ర, వీఆర్వో రాశేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●దుత్తలూరు : మండలంలోని మందలపల్లి గ్రామంలో శనివారం తహసీల్దారు నాగరాజు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పలు సమస్యలపై ప్రజలు, రైతులు అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● సంగం : మండలంలోని దువ్వూరులో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు సోమ్లా నాయక్ రైతుల నుంచి అర్జీలు స్వీకరించి స్థానిక అధికారులతో చర్చించారు. అనంతరం అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. గడువు లోపు సమస్యలను పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



సీతారామపురం:రైతుల వద్ద అర్జీలు తీసుకుంటున్న తహసీల్దార్ కృష్ణారెడ్డి

● సీతారామపురం: మండల పరిధిలోని బసినేనిపల్లి గ్రామ పంచాయతీలో శనివారం తహసీల్దార్ కృష్ణారెడ్డి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ కార్యనిర్వాహక అధికార ప్రతినిధి తురక వెంకటేశ్వర్లు, ఆర్ఐ శ్రీనివాసులు, సర్వేయర్ భాగ్యలక్ష్మి, వీఆర్వో బాలయ్య, సచివాలయ సిబ్బంది. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

●వలేటివారిపాలెం : శామీరపాలెంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో శనివారం తహసీల్దార్ అబ్దుల్‌అమీద్ పాల్గొన్నారు. సదస్సుకు వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాయబ్‌రసూల్, ఆర్ఐ ప్రసాద్, మండల సర్వేయర్ గోపిరెడ్డి, ఎండోమెంట్ ఈఓ పావని వీఆర్వో మల్లేశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

● మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక ఓవెల్‌మినర్వా హైస్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన వెంట డాక్టర్లు శివప్రసాద్, నరేంద్రలు ఉన్నారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టుల నమూనాల పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివయ్య, డీజీఎం శ్రీనివాసులు, ఏజీఎం జయదేవ్, హైస్కూల్, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఇన్‌చార్జిలు లత, సుమలత, రమ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● సంగం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు సౌత్ ఇండియన్ సైన్స్ ఫెస్టివల్‌లో భాగంగా పాఠశాల స్థాయిలో సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులు సైన్స్ ప్రయోగాలు ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా నెల్లూరు య్యాజియం క్యూరేటర్ సుబ్రహ్మణ్యం పాల్గొని మూడు విభాగాల్లో మూడు ప్రయోగాలను మండల స్థాయికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కావలి టౌన్: సైన్స్ ఎగ్జిబిట్స్‌ను తిలకిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, డాక్టర్లు శివప్రసాద్, నరేంద్ర

గణితంలో రాణించాలి

సీతారామపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గంగ వరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంఈవో మస్తాన్ వలి సందర్శించారు. విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. గణితంలో రాణించాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని గ్రామ సర్పంచ్ రామచంద్రయ్యతో కలిసి పరిశీలించి వంట నిర్వాహకులకు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జన్యాల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హత్య కేసు దర్యాప్తు

కలువాయి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్లకొండకు చెందిన కొల్లూరు గోపీ హత్య కేసును శనివారం రాపూరు సీఐగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎన్ సత్యనారాయణ దర్యాప్తు చేపట్టారు. గ్రామానికి వచ్చి హత్య జరిగిన ప్రదేశంతో పాటు గోపీ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను ఆయన విచారించారు.

ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం

బిట్రగుంట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని స్థానిక లిటిల్‌ఇంగ్లాండ్ క్రీడా మైదానంలో శనివారం న్యూఇయర్ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంటును ప్రారంభించారు. మొదటిరోజు మురుగుదాసు వర్సెస్ నెల్లూరు, ఎన్‌డీఎఫ్ఏ నెల్లూరు వర్సెస్ శీనుమెమరీస్ జట్లు తలపడ్డాయి. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఎస్ఎస్ఈ గౌరీశంకర్, నిర్వాహకులు స్టీవెన్ కుమార్, ఆంథోని, అలెక్స్, చిట్టి మోహన్ నైనల్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతసాగరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చిలకలమర్రి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉపాధ్యా యుల సహకారంతో 2025 సంవత్సర క్యాలెండర్‌ను తయారు చేశారు. అందమైన చిత్రాలతో క్యాలెండర్లను తయారు చేయడంతో చిన్నారులను హెచ్ఎం సురేష్, ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

రేపు యూటీఎఫ్ స్వర్ణోత్సవ ప్రచారజాతా

కందుకూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం కందుకూరులో ప్రచారజాతా నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎం. తిరుపతిస్వామి, నాయకులు జి. శ్రీనివాసులు తెలిపారు. అనంతరం జనవరి 5నుంచి 8వరకు కాకినాడలో జరగనున్న స్వర్ణోత్సవ సభల విజయవంతంపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో సీ.హెచ్ వెంకటేశ్వర్లు, జీ.మాధవరావు, ఎం. మాధవరావు, ఎస్.జాలయ్య, ముప్పరాజు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి

ఆత్మకూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్ సూచించారు. శనివారం ఆయన ఈవోపీ ఆర్డీ డేవిడ్‌రాజుతో కలిసి మండలంలోని పలు చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌డబ్ల్యుపీఎస్ కేంద్రాలను సక్రమంగా నిర్వహించి, చెత్త నుంచి సంపద సృష్టించాలనే లక్ష్యంతో ఉందన్నారు. కావున సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి టైడ్ గ్రాంట్ నిధులను ఉపయోగించి ఎస్‌డబ్ల్యుపీఎస్ కేంద్రాలకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూనుగుంట రేవతి తదితరులు పాల్గొన్నారు.


కరటంపాడులో ఎస్‌డబ్ల్యుపీఎస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ తదితరులు

లక్ష్మీనృసింహుడి సన్నిధిలో ఎమ్మెల్యే ఇంటూరి

వలేటివారిపాలెం, డిసెంబరు 28 (ఆంధ్ర జ్యో తి): మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనృసింహ స్వామిని శనివారం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రధాన ఉప అర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర ప్రత్యేక పూజలు చేసి శాలువాతో సత్కరించారు. అనంతరం అన్నదాన సత్రంలో భక్తులకు అందుతున్న సౌకర్యాలను భక్తులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ కందుకూరు అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, మండలాధ్యక్షుడు నార్నే రోశయ్య, కాకుమాను హర్షకుమార్ ఉన్నారు.


మాలకొండలో దర్శనానికి వెళ్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

ముగ్గురమ్మల తిరునాళ్ల వాల్‌పోస్టర్ విడుదల

అల్లూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31న జరుగనున్న అల్లూరు ముగ్గురమ్మల తిరునాళ్లను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి కోరారు. శనివారం సాయంత్రం ఆయన స్థానిక నివాసంలో ఆలయ కార్యనిర్వాహకులు, గ్రామస్థులతో కలిసి తిరునాళ్ల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, గుండవరపు సుధాకర్‌రెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, పప్పు సుధాకర్, కత్తుల విజయకుమార్, పెనుమల్లి శ్రీనివాసులు రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మోమిడి మాధవరావు, పెయ్యల వెంకయ్య పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న కాటంరెడ్డి విష్ణువర్ధన్

సామాజిక రుగ్మతులపై అవగాహన

సంగం, డిసెంబరు 28: మండలంలోని గాంధీ జన సంఘం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సామాజిక రుగ్మతుల నియంత్రణపై ఎస్ఐ రాజేష్ శనివారం అవగాహన కల్పించారు. విద్యార్థినులకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌పై, చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రగ్గుల పంపిణీ

కందుకూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ ట్రీ రిసార్ట్స్ నిర్వాహకుడు తానికొండ ప్రవీణ్ శనివారం స్థానిక సుందరయ్య నగర్‌లోని నిరుపేద చిన్నారులకు నూతన వస్త్రాలు, కోవూరురోడ్డులోని స్వర్ణ స్వయంకృషి దివ్యాంగుల పాఠశాల చిన్నారులకు రగ్గులు పంపిణీ చేశారు. తండ్రి వెంకటేశ్వర్లు జయంతి సందర్భంగా శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు చిన్నారులకు అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు చక్కా వెంకటకేశవరావు, రవ్వా శ్రీనివాసులు, గోనుగుంట వేణుగోపాలరావు, కోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సంక్రాంతికి సిమెంట్ రోడ్లు పూర్తి

● పీ రమణయ్య, పంచాయతీ రాజ్ ఏఈ, సంగం



సంగం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి: మండలంలో పల్లె పండుగ కార్యక్రమంలో చేపట్టిన సిమెంట్ రోడ్ల నిర్మాణం సంక్రాంతి నాటికి పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు పంచాయతీరాజ్ ఏఈ పి రమణయ్య తెలిపారు.

? మండలంలో పల్లె పండుగ కార్యక్రమంలో ఎన్ని సిమెంట్ రోడ్లకు ఎన్నికోట్ల నిధులు మంజూరయ్యాయి.

! మండలంలోని 20 పంచాయతీల్లో 30 గ్రామాల్లో 30 రోడ్లకు రూ. 1.53 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వాటిల్లో ఇప్పటికే 14 పూర్తయ్యాయి. మిగిలిన 16 రోడ్లు సంక్రాంతి నాటికి పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం.

? సిమెంట్ రోడ్లు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా జరుగుతున్నాయా.

! నిబంధనలకు అనుగుణంగా సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ల పర్యవేక్షణలో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. నాణ్యత లోపిస్తే బిల్లులు నిలిపివేస్తామని హెచ్చరించాం.

? వైసీపీ హయాంలో చేపట్టిన సచివాలయ, రైతు భరోసా, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌ల నిర్మాణాల పరిస్థితి ఏమిటీ. నిర్మాణాలు కొనసాగుతున్నాయా, లేదా.

! మండలంలో 13 సచివాలయాలకు గాను 12 చోట్ల నిర్మాణాలు ప్రారంభించారు. తరుణవాయి, వంగల్లు, జండాదిబ్బ, పడమటిపాళెంలో మాత్రమే సచివాలయ, ఆర్బీకేలు పూర్తయ్యాయి. రెండు హెల్త్ క్లీనిక్‌లు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

న్యూస్ బాక్స్

యూరియా పంపిణీ

కలువాయి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వీఆర్వో దగ్గర సీసీఆర్సీ కార్డు కానీ సాగుపత్రం కానీ తీసుకువచ్చిన కౌలు రైతులకు ఏకరాకు బస్తా వంతున యూరియా అందిస్తామని ఏవో ప్రతాప్ తెలిపారు. యూరియా కావాల్సిన రైతులు ముందుగా వ్యవసాయ సహాయకులను కలసి పేర్లు నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు.

నానో యూరియాను వాడండి

బిట్రగుంట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): యూరియాకు ప్రత్యామ్నాయంగా రైతులు ద్రవరూపంలో ఉన్న నానో యూరియాను పంటల్లో వాడాలని కావలి వ్యవసాయ సహాయ సంచాలకులు సీ.హెచ్ నాగరాజు తెలిపారు. శనివారం నాగులవరం, చెంచులక్ష్మీపురంలో ఆయన పర్యటించి వరి, వేరుశనగ పంటలను పరిశీలించి మాట్లాడారు. నానో యూరియాతో రైతులు యూరియా బస్తాలను మోసే బాధలు తప్పుతాయన్నారు. వరి పైరులో రెండోవిడత, మూడవ విడత నానో యూరియా ద్రావణాన్ని పిచికారి చేసుకుంటే ఉపయోగకరం అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి విజయలక్ష్మి, విస్తరణాధికారి అశోక్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

వరిలో వెన్నుతీతపై ఆందోళన వద్దు

కలిగిరి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కలిగిరి, వింజమూరు, జలదంకి మండలాల్లో సాగుచేసిన ఆర్ఎన్ఆర్-15048, కెఎన్ఎం-1638 వరి రకాలకు నెలరోజు పంటలో వెన్ను రావడంపై ఆందోళన చెందవద్దని వింజమూరు ఏడీఏ రామిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన కలిగిరి సాగుచేసి వరి పంటలను స్థానిక వ్యవసాయాధికారి సురేష్ బాబుతో కలిసి పరిశీలించారు. కొన్ని రోజులుగా వీడని వర్షాలు, ముసురు వాతావరణంతో ఈ సమస్య వచ్చిందన్నారు. ఈ రకం వరిపైరులో నీరు పలుచగా ఉండి ఎకరానికి యూరియా కట్ట వేయాలని సూచించారు. ఈ జాగ్రత్తలతో పైరులో మరలా పిలకలు పుట్టుకొస్తాయన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

లింగసముద్రం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చిన్నపవని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వీసీబీ పనులు నిమిత్తం ఆదివారం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు మండల ట్రాన్స్‌కో ఏఈ షేక్ ఫిరోజ్ శనివారం తెలిపారు. చిన్నపవని, పెద్దపవని, ముత్యాలపాడు, ముత్తంవారిపాలెం గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా ఉండదని వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు.

31న పింఛన్ల పంపిణీ

ఏఎస్ పేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఈనెల 31వ తేదీన పంపిణీ చేయడానికి సర్వం సిద్ధం చేశామని ఎంపీడీవో ప్రసన్నకుమారి తెలిపారు. సచివాలయ సిబ్బం ది 31వ తేదీ ఉదయం 6గంటల నుంచి పెన్షన్ల పింపిణీ ప్రారంభించి సాయంత్రానికి 95శాతం పూర్తిచేస్తామని తెలిపారు.

టీడీపీ సభ్యత్వం తీసుకోండి

కందుకూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం సభ్యత్వ నమోదును ఈ నెల 30తో ముగుస్తున్నందున ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం ప్రకటనలో కోరారు. టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారికి 2025 జనవరి 1నుంచి 2026 డిసెంబరు 31 వరకు ప్రమాదబీమా ఉంటుం దన్నారు.